




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 25 మంగళవారం | మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 189

8Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# నలుగురా.. ఆరుగురా..?



- తెలంగాణలో మంత్రివర్గం విస్తరణ కన్ఫార్మ్..?
- ఢిల్లీకి చేరుతున్న ఆశావహులు..ముమ్మరంగా ప్రయత్నాలు
- రాహుల్ గాంధీ సమక్షంలో మంత్రివర్గ కూర్పు
- సామాజిక,ప్రాంతీయ సమీకరణలతో కూర్పు
- ఖాళీగా 6 స్థానాలు..నలుగురిని ఎంపిక చేస్తారని ప్రచారం
- వినిపిస్తున్న పేర్లలో రాజగోపాల్‌రెడ్డి,వాకిడి శ్రీహరి,అద్దంకి దయాకర్, అమీర్ అలీఖాన్,గడ్డం వివేక్,సుదర్శన్‌రెడ్డి ప్రేమ్‌సాగర్‌రావు

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణలో గత కొంతకాలంగా హాట్ టాపిక్‌గా నడుస్తున్న మంత్రివర్గం విస్తరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతుండగా.. 40వ సారి ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి పయణమయ్యారు. ఈ క్రమంలోనే ఉగాది సందర్భంగా మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు చేసినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలు హస్తినకు వెళ్లారు. ముందుగా కేసీ వేణు గోపాల్ తో నేతలంతా సమావేశం కానున్నారు. దీంతో ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కొత్త కార్యవర్గం, నామినేటెడ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ వస్తుందని భావిస్తున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం, రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య అసెంబ్లీ సభ్యుల మొత్తం సంఖ్యలో 15 శాతం ఉండాలి. ఈ ప్రకారం తెలంగాణలో 18 మందికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం రాష్ట్ర క్యాబినెట్‌లో 12 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఖాళీగా ఉన్న 6 మంత్రి పదవులను ఈసారి అనౌన్స్ చేస్తారని పొలిటికల్ వర్గాల్లో జోరుగా చర్చించుకుంటున్నారు.

# స్టూడెంట్ వీసాలకు అమెరికా కత్తెర

- ఒక్క ఏడాదిలో 41 శాతం దరఖాస్తుల తిరస్కరణ
- నిరుడు 6.79 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 2.79 లక్షల దరఖాస్తుల తిరస్కరణ
- రోజు రోజుకూ తగ్గుతున్న అమెరికాపై మోజు

2





వాషింగ్టన్ డీసీ-నవభూమిబ్యూరో

విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదవాలని చాలామంది ఆశిస్తుంటారు. అందులోనూ అమెరికాలో ఉన్నతవిద్య అభ్యసించేందుకు మరింత ఎక్కువ మక్కువ చూపుతుంటారు. అందుకే వివిధ దేశాల నుంచి ఏటా ఎంతోమంది విద్యార్థులు అగ్రరాజ్యానికి ఉన్నత చదువుల కోసం వెళ్తుంటారు. అయితే గత కొన్నాళ్లుగా ఈ విద్యార్థి వీసాల (F-1 visas) సంఖ్యకు అమెరికా (USA) భారీగా కత్తెర వేస్తోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) లో ఏకంగా 41 శాతం వీసా దరఖాస్తులను ఆమెరికా తిరస్కరించింది. దశాబ్దం క్రితంతో పోలిస్తే ఈ F-1 వీసాల తిరస్కరణ దాదాపు రెట్టింపు అయ్యింది. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్-1 వీసాల కోసం 6.79 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 2.79 లక్షల (దాదాపు 41 శాతం) దరఖాస్తులు తిరస్కరణకు

# రీవాల్యుయేషన్ జరపాల్సిందే

- తెలంగాణ హైకోర్టులో గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్
- 18 రకాల సబ్జెక్టులంటే..12 సబ్జెక్టుల నిపుణులతోనే దిద్దుబాట్లు
- ఒకే మాధ్యమం నిపుణులతో 2 భాషల పేపర్లు దిద్దుబాట్లు
- తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం
- పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు..4వారాల్లో కౌంటర్‌కు ఆదేశం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** గ్రూప్-1 అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలంటూ హైకోర్టులో అభ్యర్థులు పిటిషన్ వేశారు. గ్రూప్ 1 మెయిన్స్ రీవాల్యుయేషన్ జరిపించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. గ్రూప్ 1 మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు తెలిపారు. 18 రకాల సబ్జక్టులుంటే 12 సబ్జక్టుల నిపుణులతోనే దిద్దించారన్నారు. 3 భాషల్లో పరీక్ష జరిగినా తగిన నిపుణులతో దిద్దించలేదని వెల్లడించారు. ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో రెండు భాషల (తెలుగు, ఇంగ్లీష్) పేపర్లు దిద్దించచారని.. దీంతో మూల్యాంకణంలో నాణ్యత కొరవడిందన్నారు.

# తమిళగడ్డపై జనసేన రెపరెప?

- తమిళ రాజకీయాల్లోకి జనసేన ప్రవేశం?
- నిర్ధారించిన జనసేన చీఫ్ పవన్‌కళ్యాణ్
- ఏదీ ప్లాన్ చేసుకోలేదు..అలా జరిగిపోతుంది
- ఓ తమిళ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో పవన్

2



విజయవాడ-నవభూమిబ్యూరో

పవన్ సంచలన కామెంట్స్ ఓ తమిళ టీవీ చానల్‌కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తాను ఏదీ ప్లాన్ చేసుకోనని, జరగాల్సినవి ఏదైనా అలా జరిగిపోతుందని వ్యాఖ్యానించారు. ఏపీలో కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించి, వైసీపీ నుంచి అధికారాన్ని హస్తగతం చేసుకోవడంలో విజయం సాధించిన జనసేన విస్తరణ ఆలోచనలో ఉందా? ఏపీలో నిలదొక్కుకుంటూనే పక్క రాష్ట్రాలు, ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఉనికి చాటుకోవాడానికి సిద్ధమవుతోందా? అంటే ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను చూస్తే అవును అనే

# నటిపై దాడి

- కాళ్లు, చేతులు కట్టేసి.. వ్యభిచారం చేయాలంటూ నిర్బంధం
- షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన బాలీవుడ్ నటి
- బస చేసిన హెూటల్ రూంలోకి ప్రవేశించి అఘాయిత్యం
- బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** హైదరాబాద్‌లో షాకింగ్ ఘటన జరిగింది. ఓ షాపింగ్ మాల్ ఓపెనింగ్ కు వచ్చిన బాలీవుడ్ నటిపై కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. ఆమె బస చేసిన హెూటల్ లోకి ప్రవేశించి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. ఏం జరిగింది..? బాలీవుడ్ ఇండస్ట్రీకి చెందిన ఓ ప్రముఖ నటి హైదరాబాద్ లోని షాపింగ్ మాల్ ఓపెనింగ్ కు ఈనెల 18న ముఖ్య అతిథిగా వచ్చారు. ఆమె మాసబ్ ట్యాంక్, బంజారాహిల్స్ లోని ఓ హెూటల్ లో బస చేశారు. అయితే ఈనెల 21న రాత్రి 9 గంటల సమయంలో ఆమె హెూటల్ లో నిద్రిస్తున్న వేళ ఇద్దరు అమ్మాయిలు రూమ్ లోకి వచ్చారు. తమతో కలిసి వ్యభిచారం చేయాలని ఆమెను బలవంతం చేశారు. మరుసటి రోజు ఉదయం 11 గంటలకు ఇద్దరు అబ్బాయిలు ఆమె

# ఎంపీలకు కేంద్రం గుడ్ న్యూస్

- పెరిగిన జీతభత్యాలు, పెన్షన్
- పార్లమెంటు సభ్యుల నెలవారీ జీతం
- రూ.1 లక్ష నుండి రూ.1.24 లక్షలకు ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం
- పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల మేరకే నిర్ణయం



3

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

పార్లమెంట్ సభ్యులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఎంపీల జీత భత్యాలు, పెన్షన్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పార్లమెంట్ సభ్యులకు ప్రస్తుతం ఉన్న జీత భత్యాలు, పెన్షన్లు పెరగబోతున్నాయి. పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల ప్రకారం కేంద్రం పెంచింది

# తమ్మినేనికి బిగిస్తున్న ఉచ్చు!

- నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల వ్యవహారంలో చిక్కుకున్న తమ్మినేని
- డిగ్రీ చదవకుండానే నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఆయన లా అడ్మిషన్ తీసుకున్నారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన ప్రభుత్వానికి ఫిర్యాదు
- విచారణకు సిద్ధమవుతున్న కూటమి ప్రభుత్వం

2



అమరావతి-నవభూమిబ్యూరో

మాజీ స్పీకర్, మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాంపై ప్రభుత్వం ఉచ్చు బిగిస్తోంది. డిగ్రీ చదవకుండానే నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఆయన లా అడ్మిషన్ తీసుకు న్నారని తమ్మినేని మేనల్లుడు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఇంటర్ మాత్రమే చదువుకున్న తమ్మినేని లాయర్ డిగ్రీ చదవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్ 2022 నుంచి ఈ వ్యవహారంపై పోరాటం చేస్తున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే కూన పోరాటం ఫలించడంతో తమ్మినేనిపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఎమ్మెల్యే కూన రవికుమార్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం రాజకీయంగా ప్రత్యర్థులు. మరీ ముఖ్యంగా ఈ ఇద్దరూ మామా అల్లుళ్లు. దగ్గర బంధువులైనా ఆ ఇద్దరి మధ్య రాజకీయ వైరం చాలా కాలంగా కొనసాగుతోంది. గతంలో టీడీపీలో పనిచేసిన సీతారాం ఆ తర్వాత పీఆర్పీ, కాంగ్రెస్, వైసీపీ పార్టీల్లో ప్రయాణం చేశారు. కానీ, కూన తొలి నుంచి టీడీపీని అంటిపెట్టుకునే ఉన్నారు. 2009లో పీఆర్పీ నుంచి తమ్మినేని, టీడీపీ నుంచి కూన రవికుమార్ పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఇద్దరూ ఓటమి చెందారు. అప్పట్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన బొడ్డేపల్లి సత్యవతి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2014లో కూన, 2019లో తమ్మినేని, మళ్లీ గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కూన ఎమ్మెల్యేలు అయ్యారు. అయితే 2019లో తమ్మినేని గెలిచి స్పీకర్ అయ్యాక, వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుత ఎమ్మెల్యే కూన టార్గెట్ గా ఎన్నో కేసులు నమోదయ్యాయి. అర్ధరాత్రి కూడా ఆయన ఇంటిపై పోలీసులు దాడి చేయడంతో రాజకీయ వైరం బాగా ముదిరిపోయింది. ఈ క్రమంలోనే తమ్మినేని ఫేక్ సర్టిఫికెట్ల గుట్టు రట్టైంది. ఎన్నికల అఫిడవిట్ లో తాను ఇంటర్ వరకు చదువుకున్నట్లు చెప్పిన తమ్మినేని, 2020లో హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ లా కాలేజీలో అడ్మిషన్ తీసుకున్నారని ఎమ్మెల్యే కూన ఆరోపిస్తున్నారు. స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి నైతిక విలువలు పాటించాలని సూచిస్తున్న

# తానా మహాసభలకు సీఎం

- జులై 3 నుంచి 5వ తేదీ వరకు డెట్రాయిట్‌లో జరగనున్న తానా సభలు
- రేవంత్‌ను కలిసిన తానా ప్రతినిధులు..సభలకు రావాలని ఆహ్వానం
- ఏపీ సీఎం చంద్రబాబు,స్పీకర్ అయ్యన్నపాత్రుడికి కూడా ఆహ్వానం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మహాసభలకు సర్వం సిద్ధమైంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి తానా సభలను నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే తానా 24వ సభలు జులై 3 నుంచి 5వ తేదీ వరకు డెట్రాయిట్ లో జరగనున్నాయి. ప్రతి పదేళ్లకు ఒకసారి డెట్రాయిట్‌లో మహాసభలు జరగడం ఆనవాయితీగా కనిపిస్తోంది. 2005, 2015 సంవత్సరాల్లోనూ ఇక్కడే తానా మహాసభలు జరిగాయి. ఇప్పుడు కూడా ఆ ఆనవాయితీకి కొనసాగిస్తూ 2025 మహాసభలను సైతం అక్కడే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే తాజాగా తానా 24వ సభలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రతినిధులు ఆహ్వానం అందజేశారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి వెళ్లిన తానా ప్రతినిధులు ఆయనకు ఆహ్వానపత్రికను అందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తానా కాన్ఫరెన్స్ ఛైర్మన్ నాదెళ్ల గంగాధర్, మాజీ అధ్యక్షుడు కోమటి జయరామ్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ సునీల్ పాంత్ర సహా పలువురు ఉన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని తానా కాన్ఫరెన్స్ నాయకులు కలిసి మహాసభలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. అలానే ఈ మహాసభలకు ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో ఆయనను కలుసుకున్న తానా ప్రతినిధులు సభ వివరాలను తెలియజేసి, ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఢిల్లీలో కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్ లకు ఆహ్వానం అందజేశారు. ఆ తర్వాత ఎంపీలు పురందేశ్వరి, సీఎం రమేశ్, లావు శ్రీకృష్ణదేవరాయలు, కేశినేని శివనాథ్

# సీబీఎస్ఈలో కీలక సంస్కరణలు





- క్లాస్‌కు క్యాలిక్యులేటర్ల అనుమతి..!
- కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం, శాతాల గణనలు వంటి ఆప్షన్లు ఉన్న ప్రాథమిక కాలిక్యులేటర్‌లు మాత్రమే అనుమతి
- మూల్యాంకన పద్ధతులు, సిలబస్ నిర్మాణంతో పాటు పలు మార్పులు
- బోర్డు 140వ పాలకమండలి సమావేశంలో సీబీఎస్ఈ కీలక నిర్ణయాలు

2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

2025-26 విద్యా సంవత్సరానికి ప్రాథమిక విద్యలో పలు సంస్కరణల్ని సీబీఎస్ఐ ప్రకటించింది. ముఖ్యంగా 12వ తరగతి అకౌంటెన్సీ విద్యార్థులకు ప్రాథమిక, నాన్-ప్రోగ్రామబుల్ కాలిక్యులేటర్‌లను ఉపయోగించడాన్ని కేంద్ర ప్రాథమిక విద్యా బోర్డు (సీబీఎస్ఈ) ఆమోదించింది. బోర్డు 140వ పాలక మండలి సమావేశంలో సీబీఎస్ఈ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సీబీఎస్ఈ చేపడుతున్న సంస్కరణల్లో మూల్యాంకన పద్ధతులు, సిలబస్ నిర్మాణంతో పాటు పలు మార్పులున్నాయి. 12వ తరగతి విద్యార్థులకు కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం, శాతాల గణనలు వంటి ఆప్షన్లు ఉన్న ప్రాథమిక కాలిక్యులేటర్‌లు మాత్రమే అనుమతించబడతాయి. అలాగే డిజిటల్ మూల్యాంకనం, ఆన్-స్క్రీన్ మార్కింగ్ సమాధాన పత్రాల డిజిటల్ మూల్యాంకనం కోసం ఓఎస్ఎమ్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నారు. వీటి ద్వారా జవాబు పత్రాలను స్కాన్ చేసి మార్కింగ్ కోసం అప్‌లోడ్ చేస్తారు. ముందు ఎంపిక చేసిన సబ్జెక్టుల్లో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి అనంతరం 10, 12 తరగతులకు ఈ విధానం విస్తరిస్తారు. 2024-25 నుండి సైన్స్, గణిత అనుబంధ పరీక్షలు , రీవాల్యుయేషన్ కేసులకు అమలు చేయబోతున్నారు. కొత్త రీవాల్యుయేషన్ ప్రక్రియ 2025 బోర్డు పరీక్షల నుండి వర్తిస్తుందని సీబీఎస్ఈ ప్రకటించింది. పరీక్షల్లో పారదర్శకత పెంచేందుకు ఈ మార్పులు చేపట్టబోతున్నారు. మరోవైపు వృత్తి విద్య, పరిశ్రమ ప్రమాణాలలో నిపుణులతో సహకారం తీసుకోవాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. 10వ తరగతికి ప్రామాణిక అధునాతన-స్థాయి పరీక్షలు 2026-27 విద్యా సంవత్సరం నుండి అమలు చేయాలని నిర్ణయించారు. విద్యార్థులు

# తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక..





**హైదరాబాద్-నవభూమి:** గత కొద్దిరోజుల నుంచి వాతావారణంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వారం రోజుల ముందు వరకు ఎండలు దంచికొట్టాయి. 40 డిగ్రీలకుపైనే ఎండలు పెట్టాయి. కానీ, ఇప్పుడు మాత్రం ఎండలు బాగా తగ్గాయి. అప్పుడప్పుడు వర్షాలు కూడా పడుతున్నాయి. అకాల వర్షాల కారణంగా రైతులు అల్లాడిపోతున్నారు. పంటనష్టం సంభవిస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. వచ్చే మూడు రోజులు తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. అంతేకాదు.. తెలంగాణ వ్యాప్తంగా ఈ రోజు వర్షం పడే అవకాశం ఉందని వెల్లడించింది. అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు,భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, వరంగల్, జనగామ, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు మిగిలిన జిల్లాలకు కూడా ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షాలు తగ్గిన తర్వాత మళ్లీ ఎండలు దంచికొడతాయని, 2-3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని అంది. ఉత్తర కోస్తా , యానాంలలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఉంటుందని వెల్లడించింది. తర్వాతినుంచి ఎండలు మరింత పెరుగుతాయని పేర్కొంది. దక్షిణ కోస్తా, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఒకటి రెండు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. తర్వాతినుంచి ఎండలు పెరుగుతాయి.ఇక, రాయలసీమలోనూ ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది.

## ప్రభుత్వానికి అందిన నివేదిక.. త్వరలో రైతుల ఖాతాల్లోకి డబ్బులు..!




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో గత మూడ్రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. వడగళ్ల వాన రైతులకు కడగండ్లు మిగుల్చుతున్నాయి. మార్చి 21 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వర్షాలతో పంట నష్టం వాటిల్లింది. వడగళ్ల వానతో పొట్ట దశలోని ధాన్యపు గింజలు, మామిడి పూత, కాయలు నేలరాలాయి. మొక్కజొన్న, వరి పంటలు నేలవాలిపోయాయి. ఇన్నాళ్లు కంటిరెప్పలా కాపాడుకున్న పంట పది నిమిషాల్లో నేలపాలైదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కన్నీరు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పంట నష్టాన్ని అంచనా వేయాలని రెండ్రోజుల క్రితం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.తాజాగా.. వడగళ్ల వానలతో సంభవించిన పంట నష్టంపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందింది. 13 జిల్లాల్లోని 64 మండలాల్లో 11,298 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6,670 ఎకరాల్లో వరి, 4,100 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగిందని చెప్పారు. 309 ఎకరాల్లో మామిడి, ఇతర పంటలకు తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి తుది నివేదిక రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పూర్తి నివేదిక వచ్చాక పరిహారం చెల్లింపునకు చర్యలు చేపడతామని తుమ్మల తెలిపారు. అంటే మరో వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యే ఛాన్సు ఉంది.ఇక రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. కరీంనగర్, భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి, వరంగల్, జనగామ, సిద్దిపేట, రంగారెడ్డి, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్‌లో వర్షాలు కురుస్తాయన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటుగా పిడుగులు కూడా పడే సూచలను ఉన్నాయని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. కాగా, ఇప్పటికే అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు మళ్లీ వర్షాలనే వార్త కలవరపాటుకు గురి చేస్తోంది.

## ప్రయాణికులకు శుభవార్త.. గంటలోనే ఎయిర్‌పోర్ట్‌కు.. 50 కి.మీ దూరం ఆదా..



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో మరో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేసే మామునూరు విమానాశ్రయం కొచ్చిన్ ఎయిర్‌పోర్ట్ మాదిరిగా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. ఆ దిశగా పనులు చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ సుమారు 1000 ఎకరాల్లో నిర్మించబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను చేపట్టింది. ఇప్పటికే దీనికి ప్రభుత్వం రూ.205 కోట్లను మంజూరు చేసింది. భవిష్యత్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రత్యామ్నాయంగా మామునూరు ఎయిర్‌పోర్ట్ నిలవనుంది.అయితే వరంగల్ నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మీదుగా ఒక జాతీయ రహదారి ఉంది. చేర్యాల మీదుగా మరొకటి ఉంది. ప్రస్తుతం ప్రయాణికులకు అనుకూలంగా ఉండే విధంగా.. ఈ రెండు రహదారుల విస్తరణ పనులు సాగుతున్నాయి. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయితే.. దాని చుట్టుపక్కల ప్రాంతాలే కాకుండా.. అక్కడ నుంచి ఇంటర్ లింక్ రూపంలో ఉన్న జాతీయ రహదారుల వెంట అభివృద్ధి పరుగులు పెట్టనుంది. సిద్దిపేటకు కనెక్షన్ ఉన్న ఈ రహదారుల నిర్వహణ మరింత మెరుగుపడనుంది. రహదారి చుట్టుపక్కల భూములకు ధరలు పెరగనున్నాయి. అనేక వ్యాపార, వాణిజ్య పరిశ్రమలు రానున్నాయి.. పర్యాటకం అభివృద్ధి చెందనుంది.. దీంతో ఉపాధి అవకాశాలు కూడా మెరుగవ్వనున్నాయి.సిద్దిపేట జిల్లా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ 139 కిలోమీటర్ల దూరం ఉంది. అక్కడికి చేరుకోవడానికి 2 నుంచి 3 గంటల సమయం పడుతోంది. అదే సిద్దిపేట నుంచి మామునూరు వెళ్లేందుకు 89 కి.మీ మాత్రమే ఉంటుంది. ఈ రకంగా 50 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. గంటలోనే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవచ్చు. వరంగల్ జిల్లా కేంద్రం నుంచి ఏటా 50 వేలకు పైగా ప్రయాణికులు శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్తూ ఉంటారు. వరంగల్ లో నిర్మించబోతున్న మామునూరు ఎయిర్‌పోర్ట్ ప్రారంభం అయితే సగానికి పైగా జనాలు ఇటువైపు నుంచే వెళ్లనున్నారు.విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లా ప్రజలకు విమాన సేవలు అందుబాటులోకి రానున్నట్లు.. ఆర్అండ్‌బీ విశ్రాంత ఈఈ ముస్త్యాల బాలనర్సయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ విమాన సర్వీసులు ఇక్కడ నుంచి ప్రారంభం అయితే.. జిల్లా రూపు రేఖలు మారిపోతాయన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లే మధ్యతరగతి వారు ఈ అవకాశాలను ఎక్కువగా వినియోగించుకుంటారన్నారు. సిద్దిపేట జిల్లాలోని వ్యాపారస్తులు మాట్లాడుతూ.. వరంగల్ సమీపంలో ఎయిర్‌పోర్ట్ రావడం వల్ల.. ప్రయాణికులకు చక్కటి వెసులుబాటు కలగనుంది. వివిధ ప్రాంతాలకు, రాష్ట్రాలకు , విహార యాత్రలకు వెళ్లేవారికి ఇది ఎంతగానో సౌకర్యవంతంగా మారనుందన్నారు. ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో తాము ఎంతో సంతోషగా ఉన్నామన్నారు.

## సైకిల్‌పై బస్టాండ్‌కు మెదక్ కలెక్టర్



**రామాయంపేట-నవభూమి:** మూడు రోజుల క్రితం పంట పొలాలను పరిశీలించిన మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ నేడు సైకిల్‌పై బస్టాండ్‌కు వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. కలెక్టర్ రాహుల్ ఆదివారం ఉదయం భార్య శ్రీజతో కలిసి సైకిల్ తొక్కుకుంటూ మెదక్ నుంచి 20 కి.మీల దూరంలోని రామాయంపేట బస్టాండ్‌కు వచ్చారు. బస్టాండ్‌లోని సౌకర్యాలను పరిశీలించారు. కలెక్టర్ వచ్చిన విషయం తెలిసిన వెంటనే డిపో మేనేజర్ సురేఖ బస్టాండ్‌కు వచ్చారు.ప్రయాణికులకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని, పరిసరాల్లో చెత్తచెదారం లేకుండా చూడాలని ఆమెను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం భార్యతో కలిసి ఆర్టీసీ బస్సులో టికెట్ తీసుకుని సామాన్యుడిలా మెదక్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. ఆ సమయంలో ప్రయాణికులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## రైతన్న ఐడియా సూపర్.. కోతులను తరిమేందుకు ఈ ఆలోచన మనకెందుకు రాలేదో..?



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో పట్టణాల్లో కంటే.. పల్లెల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంటుంది. కొన్ని జిల్లాలో ఇవి చాలా తక్కువ మోతాదులో ఉన్నా.. ఖమ్మం, భద్రాచలం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో అధిక మొత్తంలో కోతులు విహరిస్తున్నాయి. పంట వేసుకున్న రైతులు వాటి బారి నుంచి ఎలా తప్పించాలో అర్థం కాక.. తలలు పట్టుకుంటున్నారు. కోతుల బెడద తట్టుకోలేక చాలామంది వ్యవసాయం చేయడమే మానేశారు.అధికారులను ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఈ కోతుల బెడదను తగ్గించే చర్యలు తీసుకోలేదు. అంతే కాదు.. వాటి సంఖ్య రాను రాను పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. వీటికి అడవిలో ఆహారం దొరక్కపోతే.. ఊళ్లల్లోకి వచ్చేస్తున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు, మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అయితే.. ఇక్కడ ఓ రైతు తెలివితేటలతో కోతులను హడలెత్తిస్తున్నాడు. ఆయన్ను చూసి మిగతా రైతులు కూడా అదే ఉపాయాన్ని అమలు చేస్తున్నారు. దీంతో కోతుల నుంచి తమ పంటలు రక్షించుకోగలుగుతున్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

రైతుకు చేరకముందే.. కోతుల పాలు..

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన భద్రయ్య అనే రైతు మామిడి తోట కౌలుకు తీసుకున్నాడు. మామిడి కాయలను, మొక్కజొన్న పంటను కోతుల నుంచి రక్షించుకునేందుకు ఓ ఉపాయం ఆలోచించాడు. వేసవికాలం కావడంతో ఎండకు చెట్లు తేమ కోల్పోతున్నాయి. కానీ మామిడి తోటలు, మొక్కజొన్న చేలు మాత్రం పచ్చగా ఉండి కాయలు కాస్తున్నాయి. కానీ అవి రైతుకు చేరకముందే.. కోతుల పాలవుతున్నాయి. దీంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. మామిడి కాయలతో పాటు మొక్కజొన్న పంటను కోతుల నుంచి కాపాడుకునేందుకు రైతులు చెట్ల కింద, చుట్టూ కంచెలు ఏర్పాటు చేస్తున్నారు.ఆ వైపు చూడాలంటేనే వణుకుతున్న కోతులు.. అయినప్పటికీ కోతుల బెడద తగ్గలేదు. చివరికి ఒక తెలివైన ఐడియాతో కోతులను అవైపు రాకుండా తరుముతున్నాడు. తోట చుట్టూ ఓ హ్యాండ్ మైక్ తీసుకుని తిరుగుతూ.. కుక్కల అరుపుల శబ్దాలు చేయడం మొదలు పెట్టాడు. దీంతో తోట అంతటా కుక్కల అరుపులు మారుమోగుతున్నాయి. దీంతో కుక్కల శబ్దాలు విన్న కోతులు భయంతో పరుగులు తీస్తున్నాయి. రోజూ ఇలాగే తోట చుట్టూ మైక్ పట్టుకుని తిరుగుతూ ఆ రైతు కోతుల బెడదను పూర్తిగా తగ్గించగలుగుతున్నాడు. ఊరిలో ఉన్న ఇతర రైతులు కూడా ఆయన్ను చూసి ఇలాంటి ఐడియానే అమలు చేయడం మొదలెట్టారు. కుక్కలు లేకున్నా, వాటి అరుపులు సరిపోతాయని దాంతో కోతులు భయంతో పారిపోతాయని భద్రయ్య చెప్తున్నాడు.

## హమ్మయ్య.. ఎట్టకేలకు చార్మినార్ వద్ద పార్కింగ్ కష్టాలకు చెక్..



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ అంటే.. ఒక్క ఉపాధి అవకాశాలకే కాకుండా.. పర్యాటకులకు కూడా ఆహ్లాదాన్ని పంచుతుంది. పర్యాటక ప్రదేశాలకు ఇక్కడ కొదవే లేదు. ఏ ప్రదేశానికి వెళ్లినా.. బహమనీలు, కుతుబ్ షాహీలు, అసఫ్‌జాహీలు కట్టిన కట్టడాలు కనపడతాయి. అవి చూడటానికి అద్భుతంగా ఉంటాయి. అంతే కాకుండా.. తెలంగాణ ప్రభుత్వం కూడా ఎన్నో ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చి దిద్దింది. దీంతో వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా.. ఇతర దేశాల నుంచి కూడా చాలా మంది హైదరాబాద్ చుట్టేయడానికి వస్తుంటారు. అయితే అందులో ఎక్కువగా ఇష్టపడే ప్రదేశం చార్మినార్. హైదరాబాద్ చూడటానికి వచ్చిన ప్రతీ ఒక్కరు ఈ చార్మినార్ చూడాలనే కోరిక కచ్చితంగా ఉంటుంది. అయితే ఆ ప్రదేశానికి వెళ్లాలంటేనే చుక్కలు కనిపిస్తాయి. ఎందుకంటే.. పాత బస్తీలో ట్రాఫిక్ సమస్య అంతగా ఉంటుంది మరి. దీనికి తోడు చిన్న చిన్న రోడ్లు ఈ సమస్యను మరింత పెంచుతున్నాయి. దీంతో ఒక్క అరగంటలో వెళ్లి వద్దామనుకునే వారికి దాదాపు గంటకు పైగా సమయం పడుతుంది. అయితే ఎలాగోలా అక్కడికి వెళ్లామంటే.. పార్కింగ్ సమస్య ఎదురవుతుంది. సొంత వాహనాలను అక్కడ పార్కింగ్ చేయాలంటే.. చాలా కష్టంతో కూడుకున్న పని.

పార్కింగ్ ప్రదేశాలు ఎక్కడ ఉన్నాయో కూడా చాలా మందికి తెలియదు. ప్రైవేట్ పార్కింగ్ స్థలాలు ఉన్నా.. ఫీజు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఇష్టం వచ్చిన ఫీజును వసూలు చేయడమే కాదు.. అక్కడ వాహనాలకు గ్యారెంటీ కూడా ఉండదు. అయితే అలాంటి వారి కోసమే ట్రాఫిక్ పోలీసులు గుడ్‌న్యూస్ చెప్పారు. ప్రత్యేకంగా పార్కింగ్ కొరకు స్థలాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. రంజాన్ పండుగ నేపథ్యంలో పాతబస్తీకి వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో అక్కడ వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు కూడా పార్కింగ్ స్థలం లేక.. చార్మినార్ చూసేందుకు వచ్చిన వారి వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయించాలో తెలియక ఇబ్బందులకు గురవుతున్నారు. తాజాగా పార్కింగ్ స్థలాలను కేటాయించడంతో.. ఆ సమస్యకు చెక్ పడినట్లే.

# తమిళగడ్డపై జనసేన రెపరెప?

(1వపేజీ తరువాయి)చెప్పాల్సివస్తోంది. ఓ తమిళ టీవీ చానల్ కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తాను ఏదీ ప్లాన్ చేసుకోనని, జరగాల్సినవి ఏదైనా అలా జరిగిపోతుందని వ్యాఖ్యానించారు. తమిళ రాజకీయాల్లోకి జనసేన ప్రవేశంపై అడిగిన ప్రశ్నకు ఆయన అలా సమాధానం ఇవ్వడంతో ద్రవిడ రాజకీయాలపై జనసేనాని ఆసక్తి చూపుతున్నారా? అన్న ఆసక్తికర ప్రశ్న తలెత్తుతోంది. జాతీయ రాజకీయాలతోపాటు తమిళ, తెలుగు రాజకీయాలపై పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చిన డిప్యూటీ సీఎం పవన్ సినీ నటులు రాజకీయాల్లో రాణించడం చాలా కష్టమని చెప్పుకొచ్చారు. అన్న ఎన్టీఆర్, తమిళనాడు మాజీ సీఎం ఎంజీఆర్‌కు మాత్రమే అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్నారు. మహానటుడు ఎన్టీఆర్ పార్టీని స్థాపించి 9 నెలల్లో అధికారంలోకి తేవడం గొప్ప విషయంగా పవన్ అభివర్ణించారు. ఇక తమిళనాడులో త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఏఐడీఎంకే, టీవీకే మధ్య కెమిస్ట్రీ కుదురుతుందో? లేదో? చూడాల్సివుందన్నారు. ఏపీలో టీడీపీ, జనసేన మధ్య చక్కని కెమిస్ట్రీ కుదరడం వల్లే విజయం సాధించామని చెప్పుకొచ్చారు. పార్టీని పెట్టడం ముఖ్యం కాదని, నిలబెట్టుకోవడమే ముఖ్యమన్నారు. రాజకీయాల్లో ఓపిక ఎంతో అవసరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. తమిళ నటుడు విజయ్ పెట్టిన టీవీకే పార్టీపైనా పవన్ వ్యాఖ్యలు చేశారు. టీవీకే అధినేత విజయ్ కు అనుభవం ఉందని, తాను ఆయనకు సలహాలివ్వాల్సిన అవసరం లేదన్నారు. సహజంగా ఏర్పడని పొత్తుల వల్ల ప్రయోజనం ఉంటుందో? ఉండదో? చూడాలన్నారు. రాజకీయ లెక్కల కోసం పొత్తు పెట్టుకుంటే ఓట్ల షేరింగు జరుగుతుందా? అనేది అనుమానమేనన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మంచి నాయకుడంటూ పవన్ కితాబునిచ్చారు. పగ తీర్చుకోవాలనే ఆలోచన లేని స్టాలిన్ ఉదార వైఖరిని అభినందించాలన్నారు. అయితే ప్రస్తుతం తమిళనాడు ప్రజల ఆలోచన వేరుగా ఉండొచ్చునని పవన్ వ్యాఖ్యానించడం ఆసక్తికరంగా మారింది.ఎన్డీఏ భాగస్వామపక్ష నేతగా తాను ఏఐడీఎంకే మళ్లీ తమ కూటమిలో చేరాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఎంజీఆర్ స్థాపించిన ఏఐఎండీకే పార్టీ బాగుండాలని ఆకాంక్షించారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి ఫళనిస్వామి బలమైన నాయకుడని చెప్పిన పవన్, ఎన్డీఏతో ఏఐఎండీకే పొత్తు పెట్టుకోవడం తప్పేమీ కాదన్నారు. ఇక డీలిమిటేషన్ పై కేంద్రం ఏ నిర్ణయం తీసుకోకముందే ప్రతిపక్షాలు గొడవ చేయడాన్ని ఏపీ డిప్యూటీ సీఎం తప్పుపట్టారు. దక్షిణాదిలో సీట్లు తగ్గకూడదని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు.

# నలుగురా..ఆరుగురా..?

(1వపేజీ తరువాయి)ఇప్పటికే మంత్రివర్గ విస్తరణ.. పదవుల పైన ఢిల్లీ నేతలు ప్రతిపాదనలు కోరగా రాష్ట్ర నేతలు సమర్పించారు. ఇప్పుడు ఆ పేర్ల పైన సామాజిక - ప్రాంతీయ సమీకరణాలతో కూర్పు దిశగా కసంఅయితే ఇప్పుడు ఎవరికి మంత్రి పదవులు దక్కుతాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ మేరకు మంత్రులుగా వీరికి ఛాన్స్ దక్కిందని విశ్వసనీయ వర్గాల ద్వారా వెల్లడవుతోంది. ఇప్పుడు కొత్తగా మంత్రి ఛాన్స్ దక్కే అవకాశం ఉన్న వారిలో 8 మంది పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.

అందులో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గం వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అద్దంకి దయాకర్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇక ఈసారి మంత్రివర్గంలో మైనారిటీ వర్గం నుంచి ఒకరికి మంత్రి పదవి దక్కే ఛాన్స్ కనిపిస్తోంది. మైనారిటీ కోటాలో పదవి కోసం అమీర్ అలీ ఖాన్ పేరును పరిశీలిస్తునట్టు చెబుతున్నారు. ఇక మహిళల కోటాలో విజయ శాంతికి అవకాశం ఇచ్చినట్టు కాంగ్రెస్ నేతల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

## రీవాల్యుయేషన్ జరపాల్సిందే

(1వపేజీ తరువాయి)తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం రీవాల్యుయేషన్ జరపాల్సిందే

జరిగిందని పిటిషనర్లు చెప్పుకొచ్చారు. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు.. టీజీపీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ వేయాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. గ్రూప్-1 మెయిన్స్‌పై తదుపరి విచారణను హైకోర్టు ధర్మాసనం నాలుగు వారాలకు వాయిదా వేసింది.

కాగా.. ఈనెలలోనే (మార్చి) గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలతో పాటు గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలను కూడా టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 10, 11 తేదీల్లో గ్రూప్ 1 మెయిన్స్, గ్రూప్-2 రాత పరీక్షల మార్కులు విడుదలయ్యాయి. అలాగే మార్చి 14న గ్రూప్-3 ఫలితాలను కూడా టీజీపీఎస్సీ రిలీజ్ చేసింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 పోస్టుల భర్తీకి గాను.. గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు గ్రూప్-1 పరీక్షలు జరిగాయి. ఈ మెయిన్స్‌కు 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు మొత్తం 2.36 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇక 1,365 గ్రూప్-3 సర్వీస్‌ల పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలు నిర్వహించింది టీజీపీఎస్సీ. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 రాత పరీక్షలు జరిగాయి. ఈనెల 14న గ్రూప్-3 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది.

### ఎంఎంటీఎస్ రైలులో దారుణం.. దూకేసిన యువతి

**హైదరాబాద్-నవభూమి:** ఎంఎంటీఎస్ రైలు బోగీలో దారుణం జరిగింది. ఒంటరిగా ఉన్న ఓ యువతి పై యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డా డు. హైదరాబాద్ కొంపల్లిలో ఎంఎంటీఎస్ ట్రైన్‌లో ఒంటరిగా యువతి ప్రయాణిస్తోంది. ఆ బోగీలో ఇంక ఎవరూ లేరు. దీంతో అదే బోగీలో ప్రయాణిస్తున్న యువకుడు.. యువతిపై కన్నేసాడు. అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో యువకుడి నుంచి తప్పించుకునేందుకు యువతి రన్నింగ్ ట్రైన్‌లో నుంచి కిందికి దూకేసింది. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది.ఇది గమనించిన స్థానికులు యువతిని సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాధితురాలి నుంచి స్టేట్‌మెంట్ తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్టూడెంట్ వీసాలకు అమెరికా కత్తెర

(1వపేజీ తరువాయి)గురయ్యాయి. అంతకుముందు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షల (36 శాతం) దరఖాస్తులకు అధికారులు ఆమోదం తెలుపలేదు. ఇక 2013-14 ఆర్థిక సంవత్సరంలో 7.69 లక్షల మంది విద్యార్థి వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా.. 1.73 లక్షల (23 శాతం) దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అప్పటితో పోలిస్తే గత ఏడాది తిరస్కరణకు గురైన దరఖాస్తుల సంఖ్య దాదాపు రెట్టింపుగా ఉంది.

అయితే తిరస్కరణకు గురైన దరఖాస్తుల వివరాలను అమెరికా దేశాలవారీగా వెల్లడించలేదు. గత ఏడాది డిసెంబర్ 9 వరకు ఉన్న గణాంకాల ప్రకారం.. 2024 సంవత్సరం తొలి 9 నెలల్లో భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలు 38 శాతం తగ్గాయి. కొవిడ్ తర్వాత భారతీయ విద్యార్థులకు వీసాలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే తొలిసారి. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ నెలవారీ నివేదికల డేటా ప్రకారం.. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య 64 వేల మంది భారతీయ విద్యార్థులకు ఎఫ్-1 వీసాలను జారీ చేశారు. అంతకుముందు 2023 ఇదే సమయంలో ఈ సంఖ్య 1.03 లక్షలుగా ఉంది.

**ఎఫ్-1 వీసా అంటే..?**

ఎఫ్-1 వీసా అనేది నాన్-ఇమిగ్రెంట్ వీసా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అమెరికాలో ఫుల్ టైమ్ విద్యను అభ్యసించేందుకు ఈ వీసా అనుమతినిస్తుంది. అగ్రరాజ్యంలోని విద్యా సంస్థలు ఏటా రెండుసార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు- డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే మన విద్యార్థులు అధికంగా చేరుతుంటారు.

## తమ్మినేనికి బిగిస్తున్న ఉచ్చు!

(1వపేజీ తరువాయి)ఎమ్మెల్యే కూన తన ప్రత్యర్థి తమ్మినేని మాత్రం వదిలిపెట్టేది లేదన్నట్లు సంకేతాలు పంపుతున్నారు. 2018లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ నుంచి డిగ్రీ చదవినట్లు తమ్మినేని ఫేక్ సర్టిఫికెట్ తయారు చేశారని, ఆర్టీఐ యాక్ట్ ద్వారా ఆ యూనివర్శిటీని సంప్రదిస్తే తమ్మినేని డిగ్రీ సర్టిఫికెట్‌లో పేర్కొన్న రిజిస్టర్ నంబర్‌తోగానీ, పరీక్ష రాసినట్టు పేర్కొన్న సెంటర్ నంబర్‌లోగాని పరీక్ష రాయలేదని తేలిందని ఎమ్మెల్యే కూన చెబుతున్నారు. దీంతో తమ్మినేని దొంగ సర్టిఫికెట్లపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై గత ప్రభుత్వంలోనే కూన రవికుమార్ ఫిర్యాదు చేశారు. రాష్ట్రపతి, తెలంగాణ, ఏపీ గవర్నర్లు, ఆనాటి సీఎం జగన్‌కు ఫిర్యాదు చేశారు. అయితే రాష్ట్రపతి తప్పితే మిగిలిన వారు ఆ ఫిర్యాదుపై స్పందించలేదు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తన ఫిర్యాదుపై స్పందించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కూన ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. దీంతో మాజీ స్పీకర్ తమ్మినేని చిక్కులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వైసీపీ శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ ఇన్ చార్జిగా ఉన్న తమ్మినేని ఈ వ్యవహారం నుంచి ఎలా బయటపడతారనేది ఉత్కంఠ రేపుతోంది.

## సీబీఎస్ఈలో కీలక సంస్కరణలు

(1వపేజీ తరువాయి)సైన్స్ , సాంఘిక శాస్త్రంలో ప్రామాణిక , అధునాతన-స్థాయి పరీక్షల్లో ఒకటి ఎంచుకోవచ్చు. అడ్వాన్స్‌డ్-లెవల్ పరీక్షలకు ఎక్కువ వ్యవధి, లోతైన అవగాహనను పరీక్షించడానికి మరిన్ని ప్రశ్నలు ఉంటాయి. పరీక్షల సామర్థ్యాన్ని, లాజిస్టికల్ సవాళ్లను తగ్గించడం, యొక్క మూల్యాంకన వ్యవస్థను ప్రపంచ విద్యా పద్ధతులతో సమలేఖనం చేయడం, జాతీయ విద్యా విధానం ప్రకారం ఉన్నత స్థాయి ఆలోచనా నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా సీబీఎస్ఈ ఈ మార్పులు చేస్తోంది.

## నటిపై దాడి

(1వపేజీ తరువాయి)గదిలోకి చొరబడ్డారు. వాళ్లిద్దరూ ఆమెను రేప్ చేసేందుకు యత్నించారు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో కాళ్ళు,చేతులు కట్టేసి హింసించారు. అనంతరం ఆమె బ్యాగులోని రూ. 50,000 నగదు, కొంత బంగారంతో అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలు డయల్ 100కు ఫోన్ చేయడంతో సంఘటనాస్థలికి పోలీసులు చేరుకున్నారు. ఈ ఘటనపై మాసబ్ ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## తానా మహాసభలకు సీఎం

(1వపేజీ తరువాయి)తదితరులను కలిసి ఆహ్వానించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి తెలుగు సంస్కృతిని, సంప్రదాయాలను గుర్తుకు తెచ్చే విధంగా ఈ సంబరాలు జరపడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ ఏడాది తరతరాల తెలుగు దనం- తరలివచ్చే యువతరం అనే థీమ్ తో మూడు రోజులపాటు తానా మహాసభలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు తానా ప్రతినిధులు వెల్లడించారు.

## బెట్టింగ్ యాప్స్ కేసు.. పోలీసుల ఎదుట యాంకర్ శ్యామల

**హైదరాబాద్-నవభూమి:** బెట్టింగ్ యాప్స్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ వ్యవహారంలో యాంకర్ శ్యామల పంజాగుట్ట పోలీసుల విచారణకు హాజరయ్యారు. న్యాయవాదితో కలిసి విచారణకు వచ్చారు శ్యామల. బెట్టింగ్ యాప్ కేసులో శ్యామలపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విచారణకు వచ్చిన యాంకర్ నుంచి పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్నారు. ఈరోజు ఉదయం 8:44 గంటల ప్రాంతంలో యాంకర్ పంజాగుట్ట పీఎస్‌కు వచ్చారు. సుమారు గంటన్నర పాటుగా ఆమెను పోలీసులు విచారిస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌ను యాంకర్ శ్యామల కూడా చేసిన విషయం తెలిసిందే.

ఒక సామాజిక కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాంకర్ శ్యామలపై పంజాగుట్ట పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణకు రావాల్సిందిగా గతంలో పోలీసులు ఒకసారి నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసులకు ఆమె స్పందించలేదు. విచారణకు హాజరుకాకుండా నేరుగా శ్యామల హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. అలాగే క్వాష్ పిటిషన్‌ను కూడా దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఆమెకు ముందస్తు బెయిల్ ఇచ్చారు. శ్యామలను అరెస్టు చేయవద్దని, నోటీసులు ఇచ్చి విచారించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈరోజు పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని హైకోర్టు చెప్పిన నేపథ్యంలో ఉదయమే శ్యామల విచారణకు వచ్చారు. ఆంధ్రా 365 అనే బెట్టింగ్ యాప్‌ను గత కొంతకాలంగా శ్యామల ప్రమోట్ చేశారు. న్యాయవాదితో కలిసి యాంకర్ పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## బ్రేక్స్ ఫెయిల్ కావడంతో రన్‌వేపై దూసుకెళ్లిన విమానం..



**హిమాచల్ ప్రదేశ్ -నవభూమి:** హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో తృటిలో ఘోర విమాన ప్రమాదం తప్పింది. అలయన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం సిమ్లా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్ సమయంలో రన్‌వే నుంచి అదుపుతప్పి ముందుకు దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో హిమాచల్ ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి ముకేశ్ అగ్నిహోత్రి (, డీజీపీ అతుల్‌వర్మ సహా 44 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.అలయన్స్ ఎయిర్ ఫ్లైట్ నెంబర్ 91821 విమానం సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి సిమ్లాకు బయల్దేరింది. సిమ్లాలోని జుబ్బర్హట్టి విమానాశ్రయంలో ల్యాండింగ్ సమయంలో విమానం బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. పైలట్ ఈ విషయాన్ని ప్రయాణికులకు తెలియజేశారు. ఎమర్జెన్సీ బ్రేకులు వేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో విమానం అదుపుతప్పి రన్‌వేని దాటి ముందుకు దూసుకెళ్లింది. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే, అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# పార్లమెంట్ సభ్యుల వేతనాలు 24 శాతం పెంపు



**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంట్ సభ్యులకు ప్రతీ నెలా అందే జీతాలు, పెన్షన్లను కేంద్ర ప్రభుత్వం పెంచుతున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా ఎంపీల జీతాన్ని 24 శాతం మేర పెంచుతున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. అలాగే సిట్టింగ్ సభ్యులు, మాజీ ఎంపీలు భత్యాలు, పెన్షన్లను కూడా పెంచుతున్నట్లు వివరించింది. అయితే ప్రస్తుతం ఎంపీలు ఎంత మొత్తంలో జీతభత్యాలు పొందుతున్నారు, ఇప్పుడు పెంచడంతో ఎంత మొత్తంలో అందుకోబోతున్నారో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. సిట్టింగ్ సభ్యులకు రోజువారీ భత్యాలను మరియు మాజీ సభ్యులకు ఐదు సంవత్సరాల్లో ప్రతీ ఏటా సేవకు పెన్షన్ మరియు అదనపు పెన్షన్‌ను కూడా పెంచారు. 1961 ఆదాయపు పన్ను చట్టంలో పేర్కొన్న వ్యయ ద్రవ్యోల్బణ సూచిక ఆధారంగా పార్లమెంట్ సభ్యుల జీతం, భత్యాలు మరియు పెన్షన్ చట్టం కింద మంజూరు చేసిన అధికారాలను వినియోగించుకుని జీతం పెరుగుదలను ప్రకటించారు. ఈ లెక్కన ఎంపీల నెలవారీ జీతం లక్ష రూపాయల నుంచి రూ. 1.24,000కు పెరిగింది. అలాగే సిట్టింగ్ సభ్యుల దినసరి భత్యాన్ని రూ. 2000 నుంచి రూ. 2500కు పెంచారు. మాజీ పార్లమెంట్ సభ్యుల పెన్షన్ నెలకు 25,000 రూపాయల నుంచి రూ. 31,000కు పెరిగింది. అలాగే 5 సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం సర్వీస్‌కు అదనపు పెన్షన్‌ను నెలకు 2000 రూపాయల నుంచి రూ. 2500కు పెంచారు. అయితే ఈ పెరిగిన జీతాలను 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రెండేళ్లకు ముందు నుంచే పెంచడంతో.. ఈ నెల అందరూ మరింత ఎక్కువ మొత్తంలో జీతాలను అందుకోబోతున్నారు.ఇదిలా ఉండగా.. ఇటీవలే కర్ణాటక ప్రభుత్వం శాసన సభ్యుల జీతాలను 100 శాతం పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య జీతం నెలకు రూ. 75,000 నుంచి రూ. 1.5 లక్షలకు చేరుకుంది. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా శాసన సభ్యుల జీతాలు నెలకు రూ. 40,000 నుంచి రూ. 80,000కి రెట్టింపు అవుతాయి. ఇవి మాత్రమే కాకుండా శాసన సభ్యుల నియోజకవర్గ భత్యం నెలకు రూ. 60,000 నుంచి లక్ష రూపాయలకు పెరగబోతుంది. మంత్రుల ఇంటి అద్దె భత్యం నెలకు రూ. 1.2 లక్షల నుంచి రూ. 2 లక్షలకు పెరుగుతుంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చాలా కాలంగా చెల్లించాల్సిన జీతా సవరణ కోసం డిమాండ్ చేయగా.. ఈ బిల్లను రూపొందించినట్లు వర్గాల చెబుతున్నాయి.

## పార్లమెంట్‌లో అరకు కాఫీ ఘుమ ఘుమలు



**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంట్ ఆవరణలో అరకు కాఫీ ఘుమఘుమలు మొదలయ్యాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతితో పార్లమెంట్ ఆవరణలో అరకు కాఫీ స్టాల్స్‌ను గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఇవాళ ప్రారంభించింది. ఎంపీలు అల్పాహారం తీసుకునే సంగం క్యాంటీన్‌లో రెండు స్టాళ్లను ఏర్పాటు చేసింది. సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద ఈ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.లోకసభ క్యాంటీన్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, రాజ్యసభ క్యాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అరకు స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, తెలుగుదేశం, బీజేపీ పార్టీల ఎంపీలు, నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరకు కాఫీ రుచిని ఆస్వాదించారు. సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించింది.

## ప్రధాని మోదీ ఆ సమస్యపై కూడా మాట్లాడాలి : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాని నరేంద్రమోదీ పైన, బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ పైన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. దేశంలోని ఓ సంస్థ భారతదేశ భవిష్యత్తును, దేశంలో విద్యావ్యవస్థను ఖతం చేయాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఆ సంస్థ మరేదో కాదని, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అని ఆయన చెప్పారు.ఒకవేళ భారత విద్యావ్యవస్థ క్రమంగా ఆరెస్సెస్ చేతుల్లోకి వెళ్తే దేశం పూర్తిగా నాశనమవుతుందని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో ఎవరికీ ఉద్యోగాలు రావని, దేశం పని ఖతమవుతుందని వ్యాఖ్యానించారు. దేశ రాజధాని ఢిల్లీలో నిరసన కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. అన్ని విద్యార్థి సంఘాలు కార్యక్రమానికి వచ్చినందుకు తనకు సంతోషంగా ఉందని చెప్పారు. దేశంలో ఏం జరుగుతుందో విద్యార్థులకు చెప్పాల్సిన బాధ్యత విద్యార్థి సంఘాలపైనే ఉందన్నారు.దేశంలోని అన్ని యూనివర్సిటీల వైస్ ఛాన్సెలర్స్‌లో ఆరెస్సెస్ ఆధిపత్యం ఉన్నదని రాహుల్‌గాంధీ చెప్పారు. ఇక ముందు రాష్ట్రాల్లోని యూనివర్సిటీలకు వీసీలను కూడా ఆర్‌ఎస్ఎస్ నామినేట్ చేసే రోజులు రాబోతున్నాయని అన్నారు. ఇది దేశానికి చాలా ప్రమాదకరమని, అలా జరగకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగ సమస్య ప్రధాన సమస్యగా ఉన్నదని రాహుల్‌గాంధీ అన్నారు.కొన్ని రోజుల క్రితం ప్రధాని మోదీ పార్లమెంటులో కుంభమేళా గురించి మాట్లాడారని, తాను ఆయనకు ఒక విషయం చెప్పదల్చుకున్నానని రాహుల్‌గాంధీ అన్నారు. కుంభమేళా గురించి మాట్లాడటం మంచి విషయమేగానీ, ఆయన దేశ భవిష్యత్తు గురించి మాట్లాడితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. దేశంలోని యువతను మోదీ ప్రభుత్వం నిరుద్యోగులుగా మార్చిందని, కాబట్టి ప్రధాని మోదీ ఆ సమస్యపై కూడా మాట్లాడాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

## కర్ణాటక ఆసుపత్రిలో విద్యుత్‌కు అంతరాయం.. ఆక్సిజన్ అందక అల్లాడిపోయిన రోగులు




**బెంగళూరు-నవభూమి:** ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో రోగులు ఇబ్బంది పడ్డారు. ఐసీయూలోని రోగులకు ఆక్సిజన్ అందకపోవడంతో అల్లాడిపోయారు. చివరకు వైద్య సిబ్బంది మాన్యువల్‌గా ఆక్సిజన్ అందించారు. కర్ణాటకలోని కాలబురగి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం ప్రముఖ గుల్బర్గా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (జిమ్స్)లో గందరగోళం నెలకొన్నది. హాస్పిటల్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.కాగా, ఆ హాస్పిటల్‌లో బ్యాటరీ బ్యాకప్ లేకపోవడంతో ఐసీయూ వార్డులో ఆక్సిజన్ కొరత ఏర్పడింది. దీంతో శ్వాసకోశ, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు చికిత్స పొందుతున్న రోగులకు ఆక్సిజన్ అందకపోవడంతో అల్లాడిపోయారు. ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది మాన్యువల్‌గా ఆక్సిజన్‌ను పంప్ చేశారు.మరోవైపు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగే వరకు ఆక్సిజన్ కోసం క్రిటికల్ రోగులు చాలా ఇబ్బందిపడ్డారు. వారి పరిస్థితి చూసి రోగుల బంధువులు ఆందోళన చెందారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో కర్ణాటకలోని ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రిలో బ్యాటరీ బ్యాకప్ లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

## సీనియర్‌ను కొట్టిన జూనియర్ స్టూడెంట్స్.. 13 మంది సస్పెండ్

**చెన్నై-నవభూమి:**కాలేజీ హాస్టల్‌లో ఒక సీనియర్ స్టూడెంట్‌ను జూనియర్లు కొట్టారు. అతడ్ని భౌతికంగా హింసించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో 13 మంది జూనియర్ స్టూడెంట్స్‌ను కాలేజీ నుంచి సస్పెండ్ చేశారు. (%హ్‌బనవత్ం ాబంజూవఅనవన%) తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మార్చి 20న నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లో దొంగతనం ఆరోపణలపై సీనియర్ విద్యార్థిపై జూనియర్లు దాడి చేశారు. అతడ్ని కొట్టడంతోపాటు పలు రకాలుగా పనిష్మెంట్ ఇచ్చారు. అర్ధ నగ్నంగా మోకాళ్లపై ఉన్న ఆ స్టూడెంట్ బాధతో అల్లాడిపోయాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.కాగా, ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌కు దీనిపై ఫిర్యాదు అందింది. దీంతో దర్యాప్తు కోసం విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. సీనియర్ స్టూడెంట్‌పై దాడికి పాల్పడిన 13 మంది జూనియర్ విద్యార్థులను గుర్తించారు. వారిని కాలేజీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సంఘటన గురించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థులపై చర్యలు చేపడతామని సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు.

# ఉద్యోగులతో బిలియనీర్ వింత ఒప్పందం



**వాషింగ్టన్-నవభూమి:**వయసు తగ్గించుకోడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి.. జన్యుపరమైన చికిత్స తీసుకుంటోన్న అమెరికాకు చెందిన వ్యాపారవేత్త బ్రెయిన్ జాన్సన్ తాజాగా వివాదంలో చిక్కుకున్నారు. తన వింత ప్రవర్తన గురించి బయటపెట్టకుండా ఉండేందుకు తన స్టార్టప్ సంస్థ బ్లూప్రింట్‌లోని ఉద్యోగులతో ఒప్పందాలపై సంతకాలు చేయించుకున్నారనేది ప్రధాన ఆరోపణ. 47 ఏళ్ల జాన్సన్ కొన్నిసార్లు పొట్టి దుస్తులు వేసుకుంటాడని, లోదుస్తులు కూడా వేసుకోకుండా ఉంటాడని, లైంగిక కార్యకలాపాల గురించి మాట్లాడుతుంటాడని, అంగస్తంభనల గురించి కూడా చర్చిస్తుంటాడని న్యూయార్క్ టైమ్స్ సంచలన కథనం ప్రచురించింది.ఈ ప్రవర్తన తమకు ఇబ్బందికరంగా లేదని, అసభ్యంగా లేదని, అవమానకరంగా లేదని, కవ్వింపుగా లేదని, వృత్తికి తగినట్లుగా ఉందని ఉద్యోగులు అంగీకరించాల్సి ఉంటుందని ఆ కథనం పేర్కొంది. అయితే ఈ ఒప్పందం సరైందేనని జాన్సన్ సమర్థించుకోవడం గమనార్హం. ఉద్యోగులతో రహస్య ఒప్పందం చేసుకున్నారని, అందులో చాలా నిబంధనలు ఉన్నాయని కథనం ఆరోపించింది. కురుచ దుస్తులు వేసుకుని తిరుగుతూ, మహిళా ఉద్యోగులతో సరసాలు ఆడతుంటారని ఆ పత్రిక తెలిపింది. ఈ ఒప్పందం వల్ల ఎవరూ ఆయనపై ఫిర్యాదు చేయలేకపోయారని పేర్కొంది.జాన్సన్ తన వృద్ధాప్యాన్ని వెనక్కి తిప్పే ప్రయోగాల కోసం ఏటా 2 మిలియన్ డాలర్లు (రూ. 17 కోట్లు) ఖర్చు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, న్యూయార్క్ టైమ్స్ తన గురించి తప్పుడు కథనం రాసిందని జాన్సన్ ఆరోపించారు. కానీ, ఆ కథనం తన ప్రొఫైల్ లాగా ఉందని వ్యాఖ్యానించాడు. తన గురించి తప్పుగా రాయడానికి ప్రయత్నించింది, కానీ అది తన గురించి మంచిగా రాసినట్లు అయిందని ఎక్స్ (ట్విట్టర్)లో జాన్సన్ పోస్ట్ పెట్టారు..బ్లూప్రింట్‌లో చేరేటప్పుడు ఒక ఒప్పందంపై సంతకం చేయాల్సి ఉంటుంది. దీని గురించి జాన్సన్ మాట్లాడుతూ.. 'నేను సోషల్ మీడియాలో నా నగ్న ఫోటోలను పోస్ట్ చేస్తాను.. రాత్రిపూట నా అంగస్తంభనలను ట్రాక్ చేస్తాను. నా వీర్యం ఆరోగ్యం గురించి నా జట్టు బహిరంగంగా చర్చిస్తాను... మేము మీమ్స్ కూడా చేస్తాము. ప్రజలు గుడ్డిగా అనుసరించకుండా మేము ఈ విషయాన్ని ముందుగానే లిఖితపూర్వకంగానే తెలియజేస్తాం. దీనివల్ల ఎవరికీ ఆశ్చర్యం కలగదు' అని అన్నాడు.అంతేకాదు 'ఇది ఎవరినీ బలవంత పెట్టడం కాదు. ఇది పారదర్శకత. ఈ విధానం అందరికీ సరైంది. ఇది అందరి ప్రయోజనాలను కాపాడుతుంది.. మా సంస్కృతికి ఎవరైనా సరిపోకపోతే వారు వేరే చోట పనిచేయవచ్చు.. ఎవరూ బలవంతంగా సంతకం చేయాల్సిన అవసరం లేదు. ఈ ఒప్పందం సంస్థ వాతావరణాన్ని అర్థం చేసుకుని, అంగీకరించడానికి మాత్రమే. ఇది అస్పష్టతను తొలగిస్తుంది. అపార్థాలను నివారిస్తుంది' అని జాన్సన్ చెప్పుకొచ్చారు.అయితే, గత పదేళ్లలో కనీసం రెండు డజన్ల మందితో జాన్సన్ రహస్య ఒప్పందాలు చేసుకున్నాడని న్యూయార్క్ టైమ్స్ చేసిన ఆరోపణలపై కూడా ఆయన స్పందించారు. ఈ ఒప్పందాలు సాధారణమైనవేనని అన్నారు. అంతేకాదు, న్యూయార్క్ టైమ్స్‌లో పనిచేసే ఉద్యోగులు కూడా ఇలాంటి ఒప్పందాలపై సంతకం

## విమానంలో మహిళా ప్రయాణికురాలి రచ్చ.. పొగ తాగుతూ..



**ఇస్తాంబుల్-నవభూమి:**విమాన ప్రయాణంలో చోటు చేసుకునే కొన్ని ఘటనలు ప్రము ఖంగా వార్తల్లో నిలుస్తుంటాయి. ముఖ్యంగా ప్రయాణికుల ప్రవర్తన చర్చకు దారితీస్తుంటుంది. కొందరు వ్యక్తులు తప్పతాగి వికృతచేష్టలకు పాల్పడుతుంటారు. మరికొందరు తోటి ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటారు. తాజాగా ఓ మహిళా ప్రయాణికురాలు విమానంలో పొగ తాగి ప్రయాణికులు, సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేసింది.ఇస్తాంబుల్ నుంచి సైప్రస్ వెళ్లే విమానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఫాతిమా అనే మహిళ.. విమానంలో లైటర్‌తో సిగరెట్‌నువెలిగించి పొగ తాగింది. ఆమె చర్యతో ప్రయాణికులు, విమాన సిబ్బంది ఒక్కసారిగా షాక్ అయ్యారు. వెంటనే అప్రమత్తమైన విమాన సిబ్బంది ఆమె దగ్గరకు చేరుకుని సిగరెట్ లాక్కునే ప్రయత్నం చేశారు. అయితే, సిగరెట్ ఇవ్వకపోవడమే కాదు, మరో చేతితో లైటర్ వెలిగించి ఏకంగా విమానాన్నే అంటించే ప్రయత్నం చేసింది. విమాన సీట్లకు లైటర్‌తో నిప్పు పెట్టేందుకు ప్రయత్నించింది. అయితే, సిబ్బంది బాటిల్‌తో నీళ్లు పోసి ఆమె ప్రయత్నాన్ని అడ్డుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. వీడియో చూసిన నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## డీపీఎల్ మ్యాచ్ ఆడుతుండగా బంగ్లా మాజీ కెప్టెన్‌కు గుండెపోటు..



**బంగ్లాదేశ్-నవభూమి:**బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ గుండెపోటుతో ఆస్పత్రి పాలయ్యారు. ఢాకా ప్రీమియర్ లీగ్ లో మహమ్మదన్ స్పోర్టింగ్ క్లబ్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న తమీమ్ ఇక్బాల్.. సోమవారం సావర్‌లో షైన్‌పుకూర్ క్రికెట్ క్లబ్ తో మ్యాచ్ సందర్భంగా ఛాతిలో నొప్పితో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దాంతో ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.పరీక్షించిన వైద్యులు ఆయనకు గుండెపోటు వచ్చినట్లు నిర్ధారించారు. గుండెలో ఒక వాల్ బ్లాక్ అయ్యిందని, స్టెంట్ వేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. మ్యాచ్ ఆడుతుండగా తమీమ్ ఇక్బాల్ ఛాతిలో నొప్పితో తీవ్ర అసౌకర్యానికి గురయ్యాడని, మైదానంలో ప్రాథమిక చికిత్స అనంతరం అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించామని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజీషియన్ దేవాశిష్ చౌధరి చెప్పారు.ముందుగా ఆస్పత్రికి తరలించినప్పుడు పరీక్షలు చేయగా చిన్న సమస్య ఉన్నట్లుగా నిర్ధారణ అయ్యిందని, దాంతో తమీమ్ తనను ఢాకాకు తీసుకెళ్లాలని పట్టుబట్టడంతో అంబులెన్స్‌లో మ్యాచ్ జరుగుతున్న మైదానానికి తరలించారని, అయితే మైదానానికి చేరుకోగానే మరోసారి ఛాతిలో నొప్పి రావడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్లారని, మరోసారి పరీక్షలు చేయగా అతడికి గుండెలో బ్లాక్ ఉన్నట్లు తేలిందని చౌధరి తెలిపారు.

## ఇంటర్ మ్యాథ్స్ పేపర్ లీక్.. మొత్తం పరీక్షలను రద్దుచేసిన ప్రభుత్వం




**అసోం-నవభూమి:**పరీక్షకు ఒక రోజు ముందు భద్రతా సీల్‌ను పగలగొట్టి పేపర్‌ను లీక్ చేశారు. దీంతో తర్వాత జరగాల్సిన మొత్తం 11వ తరగతి బోర్డు పరీక్షల్ని రద్దు చేస్తూ అసోం ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మార్చి 24 నుంచి 29 వరకు జరగాల్సి ఉన్న 36 సబ్జెక్టుల పరీక్షలను రద్దు చేస్తున్నట్లు అసోం విద్యాశాఖ మంత్రి రనోజ్ పేగు ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. అసోంలో మార్చి 21న జరిగిన 11వ తరగతి మ్యాథ్స్ ప్రశ్నాపత్రం లీక్ కావడంతో 10 జిల్లాల్లోని 15 స్కూల్స్‌పై సస్పెన్షన్ విధించారు. ఇందులో మూడు ప్రభుత్వ పాఠశాలల పాత్ర ఉన్నట్టు గుర్తించామని మంత్రి తెలిపారు.

'మార్చి 21న 11వ తరగతి మ్యాథమెటిక్స్ ప్రశ్నాపత్రం సీల్‌ను పరీక్షకు ఒకరోజు ముందుగానే తొలగించి లీక్ చేశారు.. ఈ వ్యవహారంలో ఇప్పటికే 10 జిల్లాలోని 15 ప్రైవేటు స్కూల్స్ గుర్తింపుపై సస్పెన్షన్ విధించాం. నిబంధనలు ఉల్లంఘించిన మరో మూడు ప్రభుత్వ పాఠశాలల పైనా చర్యలు చేపడతాం.. ఈ పాఠశాల్లో వచ్చే విద్యా సంవత్సరం (2025-26) లో ప్రవేశాలపై నిషేధం విధిస్తున్నాం.. 18 కేంద్రాల్లో పేపర్ లీకైంది.. మిగతా చోట్ల నిబంధనలు ప్రకారం జరిగాయి" అని మంత్రి రనోజ్ పేగు పేర్కొన్నారు. కాగా, మార్చి 6న అసోంలో ప్రారంభమైన 11వ తరగతి బోర్డు పరీక్షలు 29న పూర్తి కావాల్సి ఉంది. కానీ, పేపర్ లీక్‌తో అర్ధాంతరంగా మిగతా పరీక్షలను రద్దు చేశారు. కాగా, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, విద్యాశాఖ మంత్రి పేగు రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.కాగా, లీక్ అయిన పేపర్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగింది. అయితే, దీని వెనుక కుట్రదారులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటామని అసోం ప్రభుత్వం తెలిపింది. అయితే, అసోంలోని బర్పెట్ జిల్లాలో 9 వ తరగతి ఇంగ్లిష్ ప్రశ్నాపత్రం లీక్ కావడంతో ఆ పరీక్షను రద్దుచేశారు. వరుసగా ఈ ఘటనలపై విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. విద్యా మంత్రి, స్టేట్ బోర్డు అధ్యక్షుడు ఆర్సీ జైన్‌ను తక్షణమే తొలగించాలని ఆందోళనలు కొనసాగిస్తున్నాయి. ఈ విషయంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తున్నాయి.


# డిప్యూటీ సీఎంపై కమేడియన్ వివాదాస్పద వ్యాఖ్యలు

## రెచ్చిపోయిన పార్టీ కార్యకర్తలు




**న్యూఢిల్లీ-నవభూమి:**మహారాష్ట్ర ఉప-ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై స్టాండప్ కమెడియన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. ఓ షోలో ఆయన చేసిన వ్యాఖ్యలతో షిండే అభిమానులు భగ్గుమన్నారు. దీంతో ఆయన షో జరుగుతోన్న హొటల్‌పై దాడికి పాల్పడ్డారు. ప్రముఖ స్టాండప్ కమేడియన్ కునాల్ కమ్రా..ముంబయి ఖార్ ప్రాంతంలోని ది యూనికాంటినెంటల్ హొటల్‌లోని హాబిటాట్ కామెడీ క్లబ్‌లో షో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే ఉద్దేశిస్తూ జోకులు పేల్చారు. "శివసేన నుంచి శివసేన బయటికి వచ్చింది.. ఎన్సీపీ నుంచి ఎన్సీపీ విడిపోయింది.. అంతా గందరగోళంగా ఉంది" మరాఠా రాజకీయాల గురించి మాట్లారు. ఇదే సమయంలో షిండే ద్రోహిగా అభివర్ణించించిన కునాల్.. 'దిల్ తో పాగల్ హై' అనే బాలీవుడ్ సినిమా పాటలోని చరణాలను రాజకీయాలను అనుగుణంగా మార్చి వ్యంగ్యంగా పాడారు. దీనికి సంబంధించిన వీడియోను శివసేన (యూబీటీ) సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ 'ఎక్స్ (ట్విట్టర్)'లో పోస్ట్ చేస్తూ 'కునాల్ కా కమాల్' అంటూ షిండేపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దీంతో కామెడీ షో కాస్త రాజకీయ వివాదానికి దారితీసింది. కునాల్ కమ్రా వ్యాఖ్యలపై షిండే సేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. ఆదివారం రాత్రి షో జరిగిన హొటల్‌కు చేరుకుని ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంతటితో ఆగకుండా హొటల్‌లోకి వెళ్లి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి.. రెచ్చిపోయారు.పోలీసులు అక్కడకు చేరుకుని.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. అయితే, కమెడియన్‌పై శివసేన కార్యకర్తల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేశారు. ఇది మరో రాజకీయ వివాదానికి దారితీసింది. హొటల్‌పై దాడిని ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే ఖండించారు. కమెడియన్ పాడిన పాటలో తప్పేముందని, ఇది 100 శాతం నిజమని అన్నారు. ఆయనపై దాడి మాత్రం కుట్రపూరితమైనది ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవా? అని ఆదిత్య ప్రశ్నించారు. జూన్ 2022లో శివసేనను చీల్చిన ఏక్‌నాథ్ షిండే.. తన వర్గంతో కలిసి బయటకు వచ్చి.. బీజేపీ సహకారంతో సీఎం పదవి చేపట్టిన విషయం తెలిసిందే.కాగా, షిండే వర్గం ఎంపీ నరేష్ మస్కే స్పందిస్తూ.. ఉద్ధవ్ ఠాక్రే నుంచి డబ్బులు తీసుకున్న కునాల్ కమ్రా.., ఏక్‌నాథ్ షిండే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. "కమ్రా ఒక కాంట్రాక్ట్ కమెడియన్. కానీ, అతను పాము తోకను తొక్కకూడదు... కోరలు బయటకు వచ్చిన తర్వాత భయంకరమైన పరిణామాలు ఉంటాయి.. మీరు దేశంలో స్వేచ్ఛగా తిరగకుండా చేస్తాం.. మేము దివంగత బాలాసాహెబ్ ఠాక్రే శివసైనికులం.. మిమ్మల్ని మేము టార్గెట్ చేస్తే దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది' అని ఆయన హెచ్చరించారు.

## ఉగ్రవాదులు సముద్రం ద్వారా చొరబడతారు.. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : రజనీకాంత్



**చెన్నై-నవభూమి:** సముద్రతీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపర్ స్టార్ రజనీకాంత్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొత్త వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారా దేశంలోకి చొరబడే అవకాశం ఉందని.. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు.మన దేశ కీర్తిని దెబ్బతీసేందుకు ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా చొరబడి విధ్వంసం సృష్టిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా 26/11 ముంబై ఉగ్రదాడి ఘటనను రజనీకాంత్ ఉదహరించారు. ఈ దాడి ఘటనలో సుమారు 175 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అందువల్ల సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 100 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లు పశ్చిమ బెంగాల్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 7 వేల కిలోమీటర్ల సైకిల్ ప్రచార యాత్ర చేపట్టనున్నారని తెలిపారు. వారు మీ ప్రాంతాలకు వచ్చేటప్పుడు స్వాగతించాలని సూచించారు. కుదిరితే వారితో కొంచెం దూరం వెళ్లి వారికి సహకరించాలని కోరారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
మంగళవారం
25 । మార్చి । 2025



## షిండేపై కమెడియన్ అనుచిత వ్యాఖ్యలు.. భగ్గుమన్న శివసేన కార్యకర్తలు



**మహారాష్ట్ర-నవభూమి:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే పై స్టాండప్ కమెడియన్ కునాల్ క్రమా చేసిన స్కిట్ తీవ్ర వివాదాస్పదమైంది. కామెడీ షోలో షిండేను దేశ ద్రోహిగా పేర్కొంటూ ఓ పాట కూడా పాడారు. దీంతో మహా రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. క్రమాపై శివసేన నేతలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఖార్ ప్రాంతంలోని హాబిటాట్ కామెడీ క్లబ్‌లో కునాల్ క్రమా షో జరిగింది. షోలో భాగంగా క్రమా మహా రాజకీయాల గురించి మాట్లాడారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎంను ఉద్దేశిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన ఓ దేశ ద్రోహి అని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'కునాల్ కా కమల్' అంటూ ఎద్దేవా చేశారు. దీంతో ఈ అంశం కాస్తా వివాదాస్పదమైంది. కమెడియన్‌పై శివసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు షో జరిగిన హోటల్‌పై దాడి చేశారు. అప్రమత్తమైన పోలీసులు కొందరు శివసేన కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు డిప్యూటీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కమెడియన్‌పై శివసేన కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు క్రమాపై కేసు నమోదు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో తమ క్లబ్‌ను మూసివేస్తున్నట్లు హాబిటాట్ స్టూడియో ప్రకటించింది.

## 'సమాధి' రాజకీయం

మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ పరివార్ సంస్థలు నిర్వహించిన నిరసన ప్రదర్శనకు, పలు అసత్యప్రచారాలు కూడా తోడై నాగపూర్ తీవ్ర మతహింసను చవిచూసింది. దీనిని ఖండిస్తూ, ఔరంగజేబు సమాధి వర్తమానంలో ఒక అనవసరపు అంశంగా ఆరెస్సెస్ వ్యాఖ్యానించడం అత్యధికులకు ఆశ్చర్యం కలిగించింది. నాగపూర్ ఆరెస్సెస్ కేంద్రస్థానం కావడమే కాక, ఔరంగజేబు సహా మొగల్ చక్రవర్తులంతా పరివార్ ప్రధాన లక్ష్యంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. నాగపూర్ కార్యాలయం పెద్దలకు తెలియకుండానే ఈ వివాదం రేగి, ఇంత హింసాకాండ జరిగిందని అధికులకు ఎందుకో నమ్మకం కలగడం లేదు. చిన్ననిప్పురవ్వచాలు, కాస్తంత గాలితోడైతే ఎన్ని కొంపలనైనా తగలబెట్టవచ్చును. నాగపూర్ హింస కార్యకారణసంబంధాలకంటే, మొత్తంగా మొగల్స్ చుట్టూ ఎంతోకాలంగా సాగుతున్న మత రాజకీయం, వారి సమాధులు, నిర్మాణాలు నిరంతర లక్ష్యాలుగా మారుతూండటం ప్రధానంగా గమనించాలి. ఎవరో అంటిస్తే తప్ప, మత హింస తనకుతానుగా రాజుకోదు. ఈ హింస వెనుక లోతైన, ముందస్తు కుట్ర ఉన్నదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వ్యాఖ్యానించారు. ఆయన ఎవరిని లక్ష్యంగా చేసుకొని, ఏ కోణంలో ఆ మాటన్నారో తెలియదు కానీ, పెద్దగా ప్రాచుర్యం లేకుండా పడివున్న ఓ మూడువందల ఏళ్ళకు పైబడిన సమాధిని తొలగించాలని పరివార్ కార్యకర్తలు డిమాండ్ చేయడం వెనుక మాత్రం స్పష్టమైన ఆదేశాలు, నిర్దేశిత లక్ష్యాలూ ఉన్నాయి. ఇటీవలే పేరుమార్చిన ఔరంగాబాద్‌కు సమీపంలోని ఖుల్దాబాద్‌లో పెద్దగా పోల్చుకోవడానికి కూడా గొప్ప ఆనవాళ్ళు లేని ఆ కట్టడం వారిని ఆగ్రహంతో ఊపేస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రే ఆ కట్టడంమీద అంత ద్వేషం ప్రకటించినప్పుడు కర్తవ్యనిర్వాహకులను, కరసేవకులను తప్పుబట్టి ప్రయోజనం లేదు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఉన్నందున, ఖర్మకాలి దానిని కాపాడవలసివస్తున్నదన్న రీతిలో ఫడ్నవీస్ నిండుసభలో వ్యాఖ్యానించారు.

ఆ కట్టడం ఊసెత్తడమే మహాపాపం అన్నట్టుగా ఎంతో తేలికగా మాట్లాడారు. ఇక, ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ జీవిత ఘట్టాలతో కూడిన ఒక నవల ఆధారంగా తయారైన ఛావా సినిమా మీద ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను లోతుగా గమనించినప్పుడు, నాగపూర్ హింసకు కారణమని ఆయన ఈ సినిమాను తప్పుబట్టినట్టు కనబడదు. పైగా, ఆయన ఈ చిత్రాన్ని అమితంగా ప్రశంసించారు, అందులో చెప్పినవన్నీ నిజాలేనని, చూపినవన్నీ చారిత్రక సత్యాలేనని నిర్ధారించారు. ఆ సినిమా చూసి, అసలు చరిత్రను తెలుసుకొని గుండెలు రగిలినందునే ఈ హింస జరిగిందన్న రీతిలో మాట్లాడారు. నాగపూర్ హింసకు ఎంతో ముందునుంచే సదరు చిత్రం చుట్టూ రాజకీయం నడవడం, ప్రధాని సహా బీజేపీ పెద్దలంతా చిత్రాన్ని మెచ్చుకోవడం, దాని విజయోత్సవ వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొని ప్రోత్సహించడం చూశాం. అందులో ఉన్నది చరిత్ర కాదని, కల్పన అని, ఔరంగజేబు క్రూరుడు కాదని సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబూ ఆజ్మీ వ్యాఖ్యానిస్తే, మరాఠా వారసత్వాన్ని అవమానించిన ద్రోహి అంటూ మహాయుతి నాయకులంతా ఆయనను సభనుంచి గెంటివేయడమూ తెలిసిందే. మొన్నటివరకూ ముఖ్యమంత్రిగా ఉన్న శిందేకు ఏకంగా ఈ సందర్భంలో ఒసామా బిన్ లాడెన్ కూడా గుర్తుకొచ్చాడు. ఔరంగజేబు సమాధిని కూల్చాలన్న డిమాండ్ పైస్థాయి బీజేపీ నేతలతోనే పుట్టింది. రాణేలు, శిందేలు, భోసాలేలు పద్ధతిప్రకారం వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటే, మా అందరిదీ ఒకేమాట, కానీ, కాంగ్రెస్ ఏలుబడిలో ఏఎస్‌ఐ రక్షణ దక్కడంతో దానిని విధిలేక కాపాడవలసి వస్తున్నదని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పిన తరువాత, అది ఒక సందేశంగా, నెరవేర్చాల్సిన లక్ష్యంగా దిగువస్థాయికి చేరడం సహజం. తీవ్ర హింస, విధ్వంసం, వందలాది అరెస్టులతో ప్రస్తుతానికి పరిస్థితులు సద్దుమణిగినట్టు కనిపిస్తున్నప్పటికీ, త్వరలోనే ఔరంగజేబు సమాధికి బాబరీమసీదు గతే పడుతుందన్న హెచ్చరికలు భవిష్యత్ పరిణామాలకు సంకేతాలు. దేశ ఆర్థిక రాజధానినీ, పారిశ్రామికంగా అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాన్నీ ఇటువంటి వివాదాలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత దేవేంద్ర ఫడ్నవీస్ మీద ఉంది.

మహారాష్ట్రలోని ఖుల్దాబాద్‌లోని మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి ప్రస్తుతం పరిశీలనలో ఉంది. ఇటీవలి నిరసనలు నాగ్‌పూర్‌లో హింసాత్మక ఘర్షణలకు దారితీశాయి. చారిత్రక మనోవేదనలకు చిహ్నంగా ఉన్న ఔరంగజేబు సమాధిని తొలగించాలని నిరసనలు డిమాండ్ చేస్తున్నాయి. దీనికి ప్రతిస్పందనగా, భారత పురావస్తు సర్వే సంస్థ సమాధి చుట్టూ టిన్ షీట్‌లను ఏర్పాటు చేసింది, ఇది విధ్వంసం నుండి రక్షించడానికి మరియు శాంతిని కాపాడటానికి. ఔరంగజేబు మార్చి 3, 1707న మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ సమీపంలోని భింగర్‌లో 88 సంవత్సరాల వయసులో మరణించాడు.

తన మరణానికి ముందు, ఔరంగజేబు మహారాష్ట్రలోని ఖుల్దాబాద్‌లో సూఫీ సన్యాసి షేక్ జైనుద్దీన్ దర్గా సమీపంలో ఖననం చేయాలనే కోరికను వ్యక్తం చేశాడు, షేక్ జైనుద్దీన్‌ను తాను ఎల్లప్పుడూ ఆరాధించే మరియు తన మార్గదర్శక శక్తిగా భావించేవాడు. అక్బర్ మరియు హుమాయున్ యొక్క గొప్ప సమాధుల మాదిరిగా కాకుండా, ఔరంగజేబు సమాధిని అతని స్వంత సూచనల ప్రకారం సరళంగా మరియు అలంకరణ లేకుండా ఉంచారు. అయితే, శతాబ్దాల తరువాత, అతని సమాధి ఒక ప్రధాన రాజకీయ సమస్యగా మారింది. ఈ వివాదం మహారాష్ట్రలోని రాజకీయ పార్టీలను విభజించింది. ఔరంగజేబు సమాధిని తొలగించాలనే డిమాండ్‌కు బిజెపి, శివసేన (షిండే వర్గం) మద్దతు ఇవ్వగా, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం మరియు పాలన వంటి వాస్తవ సమస్యల నుండి రాజకీయ దృష్టి మరల్చడమే ఈ డిమాండ్ అని కాంగ్రెస్, ఎన్‌సిపి వ్యతిరేకించాయి. "శివాజీ మహారాజ్ మరియు శంభాజీ మహారాజ్ ఔరంగజేబును ఓడించారు. ఇక్కడ ఆయన సమాధి ఆయన విజయానికి కాదు, ఆయన వైఫల్యానికి చిహ్నం. ప్రజల నిజమైన ఆందోళనలను పరిష్కరించే బదులు బిజెపి ఈ సమస్యను రాజకీయ లాభం కోసం ఉపయోగిస్తోంది. ప్రభుత్వం చర్య తీసుకోకుండా వారిని ఆపినట్లయితే, నిరసనలు ఎందుకు అవసరం. ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి నోటిఫికేషన్ జారీ చేసి ఆ సమాధిని తొలగించవచ్చు. వారు ఈ నాటకాన్ని ఆపి, శివాజీ మహారాజ్ మరణం తర్వాత ఔరంగజేబు తదుపరి 25 సంవత్సరాలు పోరాడాడని, కానీ మరాఠాలను ఓడించలేకపోయాడని అర్థం చేసుకోవాలి. ఈ సమాధి ఆయన వైఫల్యానికి చిహ్నం" అని శివసేన యుబిటికి చెందిన సంజయ్ రౌత్ అన్నారు.

# దక్షిణాది గొంతు నులుముతున్న డీ లిమిటేషన్



ఈస్టిండియా పాలకులు భారతదేశాన్ని నాడు తమ వలస (బానిస) దేశంగా రూపొందించుకున్నారు. అంటే పాలిచ్చే పాడి ఆవుగా తమ గాటన కట్టేసుకున్నారు. భారతీయులనే లేగదూడల గొంతు తడుపుతూ కడవల కొద్దీ పాలు పితికి తమ దేశానికి కబళించుకువెళ్లారు. నేడు దక్షిణ భారతాన్ని తమ పాడి పశువుగా రూపొందించుకొని 'ఒక దేశం -ఒకే భాష -ఒకే జీఎస్టీ -ఒకే ఎన్నిక -ఒకే జాతీయ విద్యా విధానం -డీ లిమిటేషన్' అనే లింకుల గొలుసుతో నార్త్ ఇండియా పాలకులు తమ గాటన కట్టేసుకోబోతున్నారని వాపోతున్నారు దక్షిణ భారతీయులు.

'జనాభాను నియంత్రించండి! దేశాభివృద్ధికి తోడ్పడండి!' అన్న నాటి కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం, కుటుంబ నియంత్రణను పాటించటమే కాదు, గణనీయ ఆర్థికాభివృద్ధినీ సాధించాయి దక్షిణ భారత రాష్ట్రాలు. కానీ, అవిద్య, అంధ విశ్వాసాలలో కూరుకుపోయి, జనాభా నియంత్రణను పాటించని కారణంగా అత్యధిక జనాభాకు, పేదరికానికి నిలయాలయ్యాయి ఉత్తర భారత రాష్ట్రాలు. నేడు 'ఆదాయం కొద్దీ జీఎస్టీ- జనాభా కొద్దీ ఆదాయం పంపిణీ' అంటూ%% 1.రూపాయి జీఎస్టీని అందిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు అందులోనుంచి సగటున 0-30 పైసలు విదిల్చుతున్నారు. అదే రూపాయినందిస్తున్న ఉత్తరాది రా ష్ట్రాలకు వారిచ్చిన రూపాయికి అదనంగా 3 రూపాయలు కలిపి, సగటున 4 రూపాయలు కట్టబెడుతున్నారు నార్తిండియా పాలకులు. నాటి కేంద్ర ప్రభుత్వ ఆదేశాన్ని పాటించినందుకు, దక్షిణాది రాష్ట్రాలకు వారు విధిస్తున్న కఠిన శిక్ష అని వాపోతున్నాయి దక్షిణ భారత రాష్ట్రా లు. 2.ఒకే జాతీయ విద్యావిధానం పేరిట, హిందీ భాషా సంస్కృతులతో దక్షిణాది భాషా సంస్కృతులపై దాడి పూనుకోవటం మరో శిక్ష. 3.తమ చేతి రిమోట్ లాంటి గవర్నర్ల నియామకం ద్వారా దక్షిణ భారత రాష్ట్ర ప్రభుత్వాలను శాసించటం, ఇంకో శిక్ష. 4.రేపో, మాపో 'డీ లిమిటేషన్' అంటే, జనాభా ప్రాతిపదికన 'ఎంపీ' సీట్ల పెంపు పేరిట, అధిక జనాభా గల ఉత్తరాది హిందీ రాష్ట్రాలలో భారీగా ఎంపీ సీట్లను పెంచుకొని, తద్వారా ఎ.దక్షిణ భారత ఎంపీలతో పనిలేకుండానే అధికారాన్ని చేయటం. బీ.దక్షిణ భారత గొంతును పార్లమెంట్‌లో వినపడకుండా చేయటం. సీ.దక్షిణ భారతాన్ని అణచివేసే చట్టాలను, సంఖ్యాబలం, లేమితో వాటిని అడ్డుకోలేని బలహీన రాష్ట్రాలుగా రూపొందించి, దక్షిణ భారతాన్ని తమ పాడి పశువుగా రూపొందించుకోవాలనుకోవటం అతి పెద్ద శిక్ష. ఇప్పటికే 1.కడివెడు జీఎస్టీని ఇస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు ముంతెడు విదిల్చటమే కాదు, 2.దక్షిణ భారత జల వనరులు, ఖనిజాల మీద వారి అజమాయిషీయే. 3.దక్షిణ భారత సాగర తీర భూములను ఖనిజాలను నార్తిండియా పాలకులు తెగనమ్ముకునే చట్టాలూ చేశారు. 4.ఇంకా దయనీయమేమంటే, గంపెడు ఆదాయాన్నిస్తున్న దక్షిణ భారత రైల్వే జోన్‌కు బుట్టెడు నిధులు విదిల్చి %-% బుట్టెడు ఆదాయాన్నిస్తున్న ఉత్తర భారత రైల్వే జోన్‌కు గంపెడు నిధులు కుమ్మరించటం. 5.అంతేకాదు, 'నవరత్న' హోదాను, ప్రపంచఖ్యాతిని పొంది, వేలాది ఎకరాలలో విశాఖ సాగరతీరాన విస్తరించి ఉన్న అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ విశాఖ ఉక్కు కర్మాగారం, దానికి గనులు కేటాయించకుండా, ఉద్దేశపూర్వకంగా అప్పుల్లోకి నెట్టి, దాన్ని ఆశ్రిత కార్పొరేట్లకు కట్టబెట్టజూస్తున్న అడ్డుకోలేని, కనీసం ప్రశ్నించలేని అసహాయులను చేశారు దక్షిణ భారతీయులను. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, జనాభా నియంత్రణ వల్ల ఎంపీ సీట్లు తగ్గి నార్తిండియా పాలకులను కనీసం ప్రశ్నించలేని, బలహీన స్థితిలో ఉన్నాయి దక్షిణాది రాష్ట్రాలు. డీ లిమిటేషన్‌తో ఉనికినే కోల్పోయే ప్రమాదం ముంచుకొస్తుందన్న వాస్తవాన్ని గుర్తించి, దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రజలను ముందుగానే హెచ్చరించిన దీర్ఘదర్శి తమిళనాడు సీఎం స్టాలిన్. డీలిమిటేషన్ ప్రమాదం స్టాలిన్ ఊహ కాదు, ఈపాటికే నార్తిండియా పాలకులు రూపొందించుకున్న ప్రణాళిక అది! ఇప్పుడున్న 543 ఎంపీలకు అదనంగా 300 ఎంపీలను, ఉత్తరాది హిందీ రాష్ట్రాలలోనే పెంచుకోవాలన్నది వారి ప్రణాళిక. 'దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్లు తగ్గవు' అన్న అమిత్ షా ప్రకటనకు అర్థం పెరగవు అనే కదా! 888 ఎంపీలు కూర్చునేంత సువిశాల పార్లమెంట్ భవన నిర్మాణం, వారి ముందస్తు ప్రణాళికకు నిలువెత్తు నిదర్శనం అంటున్నారు రాజకీయ పరిశీలకులు. దక్షిణ భారతాన్ని కాంగ్రెస్ వాళ్లు రబ్బరు సుత్తితో మోదితే బీజేపీ వారు ఇనుప సుత్తితో మోదుతున్నారు. ఈ విషయంలో రెండు పార్టీలకు గల తేడా అంతే. ఇప్పటి నార్తిండియా పాలకుల ఎత్తుగడలు, ఒకప్పటి ఈస్టిండియా వారి ఎత్తుగడలను గుర్తుకుతెస్తున్నాయంటూ వాపోతున్నారు దక్షిణ భారతీయులు. ఈస్టిండియా పాలకుల ఎత్తుగడలు: 1.హిందూ, ముస్లిం రాజ్యాల మధ్య మత విద్వేష వ్యాప్తి ద్వారా, మెజారిటీ హిందూ రాజుల సమీకరణతో ముస్లిం రాజులను హతమార్చి వారి రాజ్యాలనాక్రమించారు. 2.హిందూ రాజులలో ఒకరికి మద్దతిస్తూ మరొకరిని హతమార్చుతూ అంతిమంగా హిందూ రాజ్యాలనూ దురాక్రమించారు. 3.ఆంగ్లభాష నేర్చినవారికీ ప్రభుత్వోద్యోగాలనూ -పదవులనూ కట్టబెడుతూ తమ భాషా, సంస్కృతులను విస్తరింపజేసుకున్నారు. 4.భారతదేశ ఖనిజ సంపదను తమ కార్పొరేట్లకు కట్టబెట్టుకున్నారు. 5.తమను ప్రశ్నించే పత్రికలను నిషేధించి, తాము చెప్పింది రాసే మీడియాను ప్రోత్సహించారు. ఆ ఎత్తుగడలతోనే భారతదేశాన్ని 200 ఏండ్ల పాటు తమ పాడి పశువుగా వాడుకున్నారు. నేటి నార్తిండియా పాలకులు గూడ 1.'హిందూత్వ' నినాదంతో మెజారిటీ హిందూ ఓటర్ల సమీకరణతో అధికారాన్ని దక్కించుకున్నారు. 2.'కాంగ్రెస్ ముక్త భారత్' నినాదంతో ప్రాంతీయ పార్టీలతో చేతులు కలిపి, మరో ప్రాంతీయ పార్టీని నిర్వీర్యం చేయటం ద్వారా 'ప్రాంతీయ పార్టీల ముక్త భారత్' లక్ష్యంతో దూసుకువెళ్తున్నారు. 4.హిందీ నేర్చిన వారికి ప్రవేశ పరీక్షల ద్వారా కేంద్ర ప్రభుత్వోద్యోగాలు ఇస్తూ తమ భాషా సంస్కృతులను విస్తరింపజేసుకుంటున్నారు. 5.తమను నిలదీసే మీడియాను, జర్నలిస్టులను అణచివేస్తూ, తమను ఆకాశానికెత్తే మీడియాను ప్రోత్సహిస్తున్నారు. అందుకే, నాటి ఈస్టిండియా పాలకుల లాగే నేటి నార్తిండియా పాలకులు గూడ దక్షిణ భారతాన్ని తమ పాడి పశువుగా చేసుకుంటారన్న భయాందోళనలో మునిగి తేలుతున్నారు దక్షిణ భారతీయులు. అందుకే కాంగ్రెస్, బీజేపీల నార్తిండియా పాలకులారా.. ఇప్పటికైనా దయచేసి మీ విధానాలను మార్చుకొని, దక్షిణ భారతీయుల భయాన్ని తొలగించండి. ముఖ్యంగా 'డీ లిమిటేషన్ ప్రక్రియను' జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రతి రాష్ట్రానికి మినిమం 20 ఎంపీలు మాగ్జిమమ్ 50 ఎంపీలుండేలా, అఖిల పక్షాల ఆమోదంతో రాజ్యాంగాన్ని సవరించండి. తద్వారా, ప్రతి రాష్ట్రానికీ మేము భారతదేశ భాగస్వాములమేనన్న భరోసాను కల్పించండి. అలా జాతీయ సమైక్యతను కాపాడండి, లేకుంటే.. పాక్ పాలకుల నిరంకుశ, అణచివేత, దోపిడీ విధానాలకు విసిగి నాడు బంగ్లాదేశ్ విడిపోయింది. ఐనా సరే, పాక్ పాలకులు తమ విధానాలను మార్చుకోని కారణంగా నేడు 'బలూచిస్థాన్' విడిపోయేందుకు ఉద్యమించింది. పాక్ పరిణామాలను చూసైనా నార్తిండియా పాలకులు, తమ విధానాలను మార్చుకుంటారని, ఇటు దక్షిణ భారత, అటు ఈశాన్య రాష్ట్రాల ఉద్యమాలకు బీజాలు పడకుండా, భారత జాతీయ సమైక్యతను కాపాడుతారని దేశ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# సమ సమాజ స్వాప్నికుడు కానూ సన్యాల్ !



భారతదేశ చరిత్రలో మార్చి 23 కి ఒక ప్రముఖ స్థానం ఉన్నది. జాతీయోద్యమంలో భారత జాతిముద్దుబిడ్డ లైన సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ లు బ్రిటిష్ సామ్రాజ్యవాదులచే ఉరి తీయబడ్డారు. భగత్ సింగ్ తను మరణించే నాటికి కమ్యూనిస్టు సిద్ధాంతం పైన అచంచలమైనటువంటి విశ్వాసంతో ఉన్నాడు. వ్యక్తిగత హింసావాదాన్ని వ్యతిరేకించాడు. ఒక మానవుణ్ణి మరొక మానవుడు దోచుకోవటానికి వీలు లేని న్యాయసమ్మతమైన ,సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థ కోసం విప్లవాన్ని కోరుకుంటున్నామని వారు తెలియజేశారు. ప్రముఖ నక్సలైట్ నాయకుడు కామ్రేడ్ కానూ సన్యాల్ 2010 మార్చి 23న అమరుడైనాడు. మార్చి23వ తేదీ వారి ఉరితీత, కానుసన్యాలు మరణం యాదృచ్ఛికమైనప్పటికీ ఆయన కూడా ఈ దుర్మార్గ వ్యవస్థ చే ఉరికంబాన్ని ముద్దాడాడు. బ్రహ్మచారిగా యావజ్జీవ పర్యంతం అహర్నిశలు పీడితుల్లో అధమాధములైనటువంటి నక్సల్ బరి గిరిజన రైతుల మధ్య, టీ తోటలో పనిచేసే గిరిజన కూలీల మధ్య జీవించాడు. సిపిఐ (ఎం.ఎల్ )పార్టీ అఖిల భారత కార్యదర్శి అయినప్పటికీ కేంద్ర స్థాయిలో ఆయన బాధ్యతలు నిర్వహిస్తూనే తన కార్య క్షేత్రాన్ని మొట్టమొదటి నుంచి ఏ రైతు కూలీల మధ్య ఏ గిరిజనుల మధ్య పని చేశాడో అక్కడే ఆయన ఒక చిన్న రేకుల షెడ్డు నివాసంలో ఉంటూ నిత్యం తన పనులు తానే చేసుకుంటూ, వయోభారము ,ఆర్థిక సమస్యలు ,ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నప్పటికీ వాటన్నిటినీ మొక్కవోని విప్లవదీక్షతో అధిగమించి ఏ సమ సమాజం కోసం భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ లు 1931 మార్చి 23న ఉరికంబాన్ని ముద్దాడారో- అదే ఒరవడిని విప్లవ కర్తవ్య దీక్షలో ఉరితాడుతో అమరుడైనాడు. కామ్రేడ్ కానూ సన్యాల్ 1932వ సంవత్సరం పశ్చిమ బెంగాల్ కుర్సియాంగ్ సబ్ డివిజన్, డార్జిలింగ్ జిల్లాలో మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి



గోవింద సన్యాల్. కోర్టులో గుమస్తా. గోవింద సన్యాల్ ఏడుగురు కుమారులలో కానుసన్యాల్ రెండోవాడు. ఆయన కూడా కొద్దికాలం కోర్టులో గుమ్మస్తాగా పనిచేశారు. 1952వ సంవత్సరంలో ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించి, పార్టీ ఆదేశానుసారం డార్జిలింగ్ జిల్లా సిలుగురి డివిజన్లో తేయాకు గిరిజన రైతుల మధ్య , భూమిలేని వ్యవసాయ కార్మికుల మధ్య పూర్తి కాలం కార్యకర్తగానూ, నిజమైన అర్థంలో కమ్యూనిస్టు వృత్తి విప్లవకారుడుగా పనిచేసాడు. కమ్యూనిస్టు పార్టీ చీలికల్లో సిపిఐ నుండి విడగొట్టుకొని సిపిఐ(ఎం) లో కొనసాగారు. సుదీర్ఘకాలం భూమిలేని తేయాకు రైతుల మధ్య రెక్కలే తమ జీవనాధారంగా కలిగిన గిరిజన పేదల మధ్య పనిచేస్తూ వారి అదరాభిమానాలను పొందిన ప్రియమైన నాయకుడిగా ఎదిగాడు. తరతరాలుగా భూస్వాముల దోపిడీపీడనలకు గురి అవుతున్న నక్సల్బరి రైతాంగం భూస్వాముల మీద తిరుగుబాటు జెండా ఎగురవేశారు. 1967 మే 24న బిగుల్ అనే వ్యవసాయ కార్మికుడిని భూస్వాములుకాల్చి చంపారు. వేలాది మంది రైతులు అక్కడకు చేరారు. భూస్వాములకు అండగా అక్కడకుచేరిన పోలీసులను అగ్రహోా గ్రులైనటువంటి గిరిజనులు ఒక కానిస్టేబుల్ ని చంపారు. మరుసటి రోజు మే 25వ తేదీన వందలాది మంది పోలీసులు నక్సల్ బరి గ్రామం చేరారు. భూస్వాములకు వ్యతిరేకంగా నిరసన దీక్ష చేస్తున్నటువంటి వేలాది మంది రైతాంగం పై ఒక్కసారిగా పోలీసులు కాల్పులు జరిపారు. 11 మంది ఆ పోలీసు కాల్పుల్లో చనిపోయారు. ఆనాడు బంగ్లా కాంగ్రెస్ నాయకుడు అజయ్ ముఖర్జీ ముఖ్యమంత్రిగా, జ్యోతి బస్సు రెవిన్యూ శాఖ మంత్రిగా ఉన్నారు. ఒక్కసారిగా నక్సల్బరి గ్రామ తేయాకు గిరిజనుల పోరాటం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. మావో నాయకత్వాన చైనా కమ్యూనిస్టు పార్టీ భారత భూభాగం పై వసంతకాల మేఘ ఘర్జన గా వర్ణించింది. కానూ సన్యాల్, చారు ముజుందార్, జగత్ సంతాల్, కోకన్ ముజుంధార్ మొదలగు నాయకులు ప్రపంచ పటం మీదకు వచ్చారు. నక్సల్ బరి నిర్మాతల్లో ప్రథముడు కానూ సన్యాల్. ఆ తనంతరం కానూ సన్యాలు , మరో ముగ్గురు కలిసి 1967 లో చైనా వెళ్లారు. రెండవసారి కూడా చైనా వెళ్లారు. చైనా అగ్ర నాయకులైన చైర్మన్ మావోను, ప్రధానమంత్రి చౌ-యన్ -లైన్ ను కలిసి భారత విప్లవ పంథాపై సుదీర్ఘంగా చర్చించారు. 1969 మే ఒకటో తేదీన కలకత్తా మహా నగరంలో జరిగిన బహిరంగసభలో వేలాది మంది మధ్య సిపిఐ (ఎం.ఎల్) పార్టీ ఆవిర్భవించిందని కానూ సన్యాల్ ప్రకటించాడు. 1969 ఏప్రిల్ 22 న లెనిన్ మహాశయుని పుట్టినరోజున సిపిఐ(ఎం.ఎల్ )పార్టీ ఆవిర్భవించిందని పార్టీ ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ చారు మజుందార్ ఎన్నికయ్యారని ఆయన ప్రకటించారు. నక్సల్బరీ పోరాట ప్రేరణతో శ్రీకాకుళం గిరిజన పోరాటం ప్రజ్వరిల్లింది. పార్వతీపురం కుట్ర కేసులో ఆయన నిర్బంధించబడ్డారు. 1970లో ఆయన అరెస్టయ్యారు. ఏడు సంవత్సరాలకు పైగా ఆయన విశాఖ జైల్లో ఉన్నారు. సిపిఐ( ఎం.ఎల్) పార్టీ వ్యక్తిగత హింస వాదాన్ని సాయుధపోరాటం అనే భ్రమల్లో తప్పు చేసింది. ఈ విషయాన్ని చైనా కమ్యూనిస్టు పార్టీ వీరి దృష్టికి తీసుకువచ్చింది. చైనా సలహాలు తదనంతరం విశాఖ జైలులో ఉన్న కామ్రేడ్ కానూ సన్యాల్, కామ్రేడ్ కొల్లా వెంకయ్య, నాగభూషణం పట్నాయక్, భువనమోహన్ పట్నాయక్ , చౌదరి తేజేశ్వరరావు సౌరన్ బోస్ , ఈఆరుగురు కలిసి చారుముజుందారు మరణానికి ముందు వ్యక్తిగత హింసావాదాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా యుద్ధ పంథా ఐక్యతను తెలియజేస్తూ1972 జూన్ లో లేఖ రాశారు. ఆ లేఖ అందకుండానే కామ్రేడ్ చారు మజుందార్ బెంగాల్లో పోలీసు నిర్బంధంలోచనిపోయారు. భారతదేశంలో కమ్యూనిస్టు విప్లవకారులను ఐక్యం చేయడం కోసం ,ఆంధ్ర కమ్యూనిస్టు విప్లవ భీష్ముడు కామ్రేడ్ కొల్లా వెంకయ్య, కానూ సన్యాల్ కలిసి అనేక ఐక్యత పత్రాలు రూపొందించారు. దేశంలోని అన్ని విప్లవ గ్రూపులకు ఆ సిద్ధాంత పత్రాలను అందజేశారు. ఆంధ్ర రాష్ట్రంలో ఐక్యత సమావేశాలులో పాల్గొనటానికి ఆంధ్ర రాష్ట్రం వచ్చారు. ఐక్యతా ప్రయత్నాల చర్చల కొరకు సెప్టెంబర్ 4వ తేదీన కామ్రేడ్ కానూ సన్యాల్ తదితరులు ఆంధ్ర రాష్ట్రం వచ్చారు. అప్పటికే కొల్లా వెంకయ్య గారు మాట్లాడలేని స్థితికి వెళ్ళిపోయారు. 1998 సెప్టెంబర్ 17వ తేదీన కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారు అమరలయ్యారు. ఆ తదనంతరం కానూ సన్యాలు కామ్రేడ్ విశ్వం నాయకత్వాన ఉన్న సిపిఐ(ఎం.ఎల్) యూనిటీ ఇనిషియేటివ్, మరియు కామ్రేడ్ కేవన్ రామచంద్రన్ లనాయకత్వాన ఉన్న సిపిఐ( ఎమ్. ఎల్ )రెడ్ ఫ్లాగ్ లతోఐక్యమయ్యారు. నూతనంగా ఏర్పడ్డ సిపిఐ(ఎంఎల్) పార్టీకి, ఆయన ప్రధాన కార్యదర్శిగా ,కేవన్ రామచంద్రన్ వర్కింగ్ సెక్రటరీగా నూతన పార్టీ ఏర్పడింది. సమ సమాజ నిర్మాణం కోసం ఆజన్మ బ్రహ్మచారిగా యావజ్జీవ పర్యంతం నిరాడంబర నిష్కల్మష జీవితం అనుభవించి అమరుడైన కానూసన్యాలు భారత విప్లవోద్యమంలో చిరస్మరణీయుడై నిలుస్తాడు.

**( మార్చి 23వ తేదీ కానూ సన్యాల్ 15వ వర్ధంతి)**
**విప్లవాభినందనలతో,**

**కొల్లిపర వెంకటేశ్వరరావు, సిపిఐ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు.**
**9392325652.**

భక్తి

## దైవభీతిని నింపే తఖ్వా



దైవభీతి అంటే అల్లాహ్ ఎల్లప్పుడు తనను చూస్తున్నాడనే ఎరుకతో ఉండటం. ఉపవాసాలు దైవభీతిని జనింపజేస్తాయి. దైవభీతిని ఖురాన్ పరిభాషలో 'తఖ్వా' అంటారు. తఖ్వా కలిగిన మనిషి పాపాలకు దూరంగా ఉండి, అల్లాహ్ ఆగ్రహానికి గురికాకుండా ఉండేందుకు ప్రయత్నిస్తాడు. అల్లాహ్ ఆజ్ఞలను పాటిస్తూ, ఆయన పట్ల అవిధేయతకు దూరంగా ఉంటాడు. దైవం పట్ల భయభక్తులు మనిషికి గొప్ప ప్రేరణనిస్తాయి. మనిషిని అల్లాహ్‌కు పూర్తి విధేయుడిగా మార్చి, పాపాలకు దూరంగా ఉండేలా చేసే గుణమిది. అల్లాహ్ నిఘాలో ఉన్నామనే గొప్ప చైతన్యాన్నిచ్చే అవకాశం తఖ్వా. మనిషిలో ధార్మిక విశ్వాసాన్ని ఆచరణలుగా మార్చే మార్గమిది. మనిషిని పాపాలనుంచి నిరోధిస్తుంది. పుణ్యాల వైపు నడిపిస్తుంది. ఏడాదంతా ఈ స్ఫూర్తిని నింపడమే రంజాన్ ఉపవాసాల ఆశయం. ఉపవాసం పాటించేవారు అబద్ధం, మోసం, దొంగతనం, లంచం లాంటి చెడులకు దూరంగా ఉంటారు. ఇలాంటి సుగుణాలను రంజాన్ ఉపవాసాలు ప్రేరేపిస్తాయి. నెల రోజుల సుశిక్షణ ఏడాదంతా కొనసాగించేలా చేయాలన్నదే అల్లాహ్ ఉద్దేశం. ఉపవాసం పాటించే వ్యక్తి స్వయంగా ఆకలిని అనుభవించడం వల్ల అన్నార్తుల పట్ల సానుభూతి, జాలి జనిస్తాయి. ఫలితంగా, ఆకలితో ఉన్నవారికి అన్నాన్ని అందించే ప్రయత్నాలు చేస్తారు. దానధర్మాలు, సదకాలు, జకాత్, విరాళాలను విరివిగా అందిస్తారు. రంజాన్‌లో ఉపవాసులకు భోజనం పెట్టాలని ప్రోత్సహించడం జరిగింది. భోజనం పెట్టినవారికి కూడా ఉపవాసికి సమానమైన పుణ్యం లభిస్తుంది. ఉపవాసి స్వయంగా పొందే పుణ్యంలోను ఎలాంటి తగ్గుదల ఉండదు. ధర్మపరులు, సేవా సంస్థలు ప్రత్యేకంగా రంజాన్ మాసంలో ఇఫ్తార్, సహరీలకు భోజన ఏర్పాట్లను నిర్వహిస్తుంటారు. రంజాన్ తర్వాత కూడా ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టే అలవాటు పెంపొందించుకోవాలి. 'ఆకలి కడుపుతో ఇరుగుపొరుగు నిద్రిస్తున్నప్పుడు తాను కడుపునిండా తినే వాడు విశ్వాసి కాదు' అని పేర్కొన్నారు ప్రవక్త ముహమ్మద్ (స). మొత్తంగా రంజాన్ ఉపవాసాలు అందించే సుగుణాలను కడవరకూ పాటించేవాడే నిజమైన విశ్వాసి!



# నవతార

## కొన్ని టిప్స్ ఫాలో అయితే వంటరాని వాళ్లు కూడా ఈజీగా క్షణాల్లో చేస్తారు

ఒక్కొక్కరికి ఒక్కో పని చేయడం ఇష్టంగా ఉంటుంది. కొంతమందికి వంట చేయడం అస్సలు నచ్చదు. ఏ పని చేయమన్నా చేస్తారు. కానీ, వంట పని మాత్రం అస్సలు నచ్చదు. అదో పెద్ద పనిగా అనిపిస్తుంది. చేయాలంటేనే ఇబ్బందిగా ఉంటుంది. అలాంటప్పుడు కొన్ని ఇకమతులు అంటే టిప్స్ ఫాలో అయితే క్షణాల్లో వంట పూర్తవుతుంది. మనసుకి కూడా హాయిగా ఉంటుంది.

ముందుగా డిసైడ్ అవ్వండి..మనం వంట చేయడం కంటే ఏం వండాలో డిసైడ్ అవ్వడమే కష్టం. కాబట్టి, మీరు ఏం వండాలనుకుంటున్నారో ముందుగా డిసైడ్ అవ్వండి. మీ దగ్గర ఉన్న పదార్థాలు ఏంటి చూసి ప్రశాంతంగా వాటిని వండాలని అనుకోండి.

తరిగి పెట్టుకోవడం

అదే విధంగా, వంటకి ఏమేం కావాలి, ఏమేం ప్రిపరేషన్స్ ఉన్నాయో చూసుకోండి. ఉదాహరణకి నీటిని మరిగించడం కూరగాయలు తరగడం వంటివి ఇవి అన్నీ రెడీగా ఉంటే వంటని క్షణాల్లో చేసేయొచ్చు. వీటితో పాటు వంటల్లో వాడే మసాలాలు, పదార్థాలన్నీ కూడా ముందుగానే రెడీ చేసి పెట్టుకుంటే కంగారు ఉండదు..మల్టీ టాస్కింగ్..అన్నీ ప్రిపేర్ చేశాక ఒక్కొక్కటిగా పనులు చేయకుండా ఒకటి స్టార్ట్ చేసి మధ్యలో గ్యాప్ రాగానే మరొకటి మొదలు పెట్టి మల్టీ టాస్క్‌లా చేయండి. ఇలా చేస్తే వంటలు చాలా చక్కగా వస్తాయి. ఉదాహరణకి పప్పు ఉడుకుతుండగానే మరో ఫ్రై చేయడం, అన్నం ఉడుకుతుండగానే చారు పెట్టేయడం లాంటివి. ఇలా చేస్తే త్వరగా వంట అవుతుంది.

# లోపం... శాపం కాకూడదని..!



మగపిల్లాడు కావాలనుకొంటే ఆడపిల్ల పుట్టింది. అదికూడా వినికిడి శక్తి లేని పిల్ల. ఇంట్లో వద్దు పొమ్మని కన్నతండ్రి చీదరించుకున్నాడు. అయినవాళ్లు, బంధువులు దూరం పెట్టారు. కానీ అమ్మ అండతో సామాజిక అసమానతలు దాటి... ఉన్నత చదువులు చదివింది. నాట్యం, సంగీతం... అన్నింటా అద్భుతాలు చేస్తోంది. తనలాంటివారికి ప్రేరణగా నిలుస్తూ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్న 33 ఏళ్ల రచనా షా కథ ఇది.

"నాది భిన్నమైన కథ. కన్నవారు ఉన్నా అనాథలా ఇంటికి దూరంగా బతికాను. నాకోసం అమ్మ అన్నిటినీ వదిలేసి కట్టు బట్టలతో బయటకు వచ్చింది. అమ్మమ్మ... అమ్మను, నన్నూ చేరదీసింది. నేను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు వారిద్దరే కారణం. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మధ్యతరగతి కుటుంబం మాది. అమ్మ, నాన్న ఇద్దరూ విద్యావంతులు. మా అమ్మ డాక్టర్ జ్ఞానేశ్వరీషా కెమికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేసింది. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్ విభాగం అధిపతిగా పని చేస్తోంది. నాన్న ఎలక్ట్రికల్ ఇంజనీర్. కానీ నేను పుట్టినప్పుడు మా ఇంట్లో సంబరాలు చేసుకోలేదు. అబ్బాయి కావాలని పూజలు చేస్తే అమ్మాయి పుట్టడం ఒక కారణమైతే, నేను పుట్టు బధిరురాలిని కావడం మరో కారణం.

**'అలాంటి కూతురు నాకొద్దు...'**

చావు పుట్టుకలు ఎవరి చేతుల్లోనూ ఉండవని తెలిసి కూడా నాన్న నన్ను చీదరించుకున్నారు. చెవిటిదాన్నని నా పట్ల వివక్ష చూపారు. నాన్నతో పాటు ఆయన తరుపు బంధువుల వరుస కూడా అదే. 'వైకల్యంతో పుట్టిన ఆడపిల్లకు ఇంట్లో స్థానం లేదు' అంటూ తేల్చేశారు. మరి ఎక్కడ ఉండాలి? 'ఏదో ఒక ఆశ్రమంలో పడేయండి'... ఇదీ సమాధానం. అమ్మ నా కోసం ఇంటిని, భర్తను వదిలేయడానికి సిద్ధపడింది. అప్పటికి వాళ్ల పెళ్లయ్యి ఏడాదిన్నరే. కానీ మరో ఆలోచన లేకుండా అమ్మ అన్నిటినీ త్యాగం చేసి, నన్ను తీసుకొని, బయటకు వచ్చేసింది. నాకున్న లోపం గురించి ఇకపై ఎవరూ నోరెత్తకుండా నన్ను ఉన్నతంగా పెంచాలని ఆ క్షణం దృఢంగా నిశ్చయించుకుంది.

**కొత్త వెలుగు...**

నిశిరాత్రి చీకట్లు చీల్చుకొంటూ ఉదయం కొత్త వెలుగుతో వస్తుంది. ఆ నమ్మకంతోనే నా జీవితాన్ని ప్రారంభించాను. నాపై నాకంటే మా అమ్మకు నమ్మకం ఎక్కువ. అందుకు అమ్మమ్మ మద్దతు దొరికింది. సామాజిక అసమానతలు, కట్టుబాట్లు తన కూతురి భవిష్యత్తును నిర్దేశించకూడదన్నది అమ్మ సంకల్పం. అందులో భాగంగా 1995లో తొలిసారి నాకు హియరింగ్ డివైజ్ కొని తెచ్చింది. అధునాతన సాంకేతికతో కూడిన మల్టీచానల్, డిజిటల్ డివైజ్‌లు మార్కెట్‌లోకి రాగానే అవి మా ఇంట్లో ఉండేవి. నా ఎదుగుదలలో వాటి పాత్ర అమూల్యం. అయితే నా వైకల్యం వల్ల చాలాచోట్ల అవహేళనలు ఎదుర్కొన్నా. వినికిడి శక్తిలేనివారు ఈ ప్రపంచంతో పోటీ పడలేరని ఎంతోమంది ముఖం మీదే అన్నారు. ఆ క్షణం బాధ కలిగినా, క్రమంగా నాకు నేను ధైర్యం చెప్పుకున్నా. నన్ను చులకన చేసినవారికి, నా సామర్థ్యాన్ని తక్కువ చేసి మాట్లాడినవారికి, నన్ను ఇంటి నుంచి గెంటేసిన కన్న తండ్రికి గట్టిగా సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నా.

**ఒకటి కాదు... ఎన్నో...**

నాకు మాటలు రావడమే కష్టమన్నారు. కానీ మాతృభాషతో పాటు హిందీ, ఇంగ్లీష్ కూడా నేర్చుకున్నా. వాటిల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతున్నా. నాలాంటివారికి చదువే వంటబట్టదన్నారు. చదువుతో పాటు భరతనాట్యం చేర్చుకున్నా. అదీ ఐదేళ్ల కోర్సు మూడేళ్లలోనే పూర్తి చేశా. పలు ప్రదర్శనలు కూడా ఇచ్చాను. హిందుస్థానీ సంగీతం అభ్యసించాను. హార్మోనియం వాయిస్తాను. సంబంధిత పరీక్షలు కూడా పూర్తి చేశాను. నా ఈ తపన కేవలం బతకడానికే కాదు... విజయం వైపు అడుగులు వేయడానికి. నలుగురిలో నన్ను నేను ప్రత్యేకంగా నిలపుకోవడానికి. నాలాంటివారికి నేనొక స్ఫూర్తిమంత్రం కావాలి. అన్నిటికీ మించి మా అమ్మ, అమ్మమ్మ నన్ను చూసి గర్వపడాలి.

**వారిలో ధైర్యం నింపేందుకు...**

చదువుకొనే రోజుల్లో నాకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తానంటే వద్దన్నాను. అది నా వైకల్యాన్ని గుర్తు చేస్తుంది. సాధారణ విద్యార్థులతో పోటీపడి చదివాను. 2014లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. సమాజంలో వివక్ష ఎదుర్కొంటున్న ఆడపిల్లలకు, వైకల్యం గల పిల్లలకు అండగా నిలబడాలన్న ఉద్దేశంతో ఖాళీ సమయాల్లో వారికి పాఠాలు చెబుతున్నాను. తమలోని లోపాలను చూసుకొని వెనకడుగు వేయకుండా, దాన్ని ఒక సవాలుగా తీసుకొని ప్రయత్నిస్తే ఎంతటి లక్ష్యమైనా దరి చేరుతుంది. ఈ విషయం మరింత అర్థమయ్యేలా వీధి నాటకాలు, నాట్య ప్రదర్శనలు ఇస్తున్నాను. ఎందుకంటే నేను ఎదిగితే సరిపోదు... నా చుట్టూ ఉన్నవారు కూడా అభివృద్ధి పథంలో పయనించాలి. అదే నా సంకల్పం."

**'రోల్‌మోడల్...'**

వినికిడిశక్తి లేని ఒక అమ్మాయిగా నాకు కొన్ని పరిమితులు ఉండవచ్చు. కానీ నా ప్రతిభ, సామర్థ్యాలతో వాటిని అధిగమించాను. ఇప్పుడు నేను డ్యాన్స్ చేయగలను. సంగీతం ఆలపించగలను. బొమ్మలు గీయగలను. ఇంకా ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్... అన్నిట్లో నైపుణ్యం సంపాదించాను. నా ప్రతిభ, సామాజిక స్పృహను గుర్తించి గుజరాత్ ప్రభుత్వం 'సర్వశిక్ష అభియాన్' ప్రచార కార్యక్రమాలకు నన్ను రోల్‌మోడల్‌గా నియమించింది. అలాగే 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్', 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు దక్కింది. 'రోల్‌మోడల్ హియరింగ్ ఇంపెయిర్డ్ ఫిమేల్' అవార్డును నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదగా అందుకోవడం నా జీవితంలోనే ఒక మధురమైన ఘట్టం. యూకేలోని 'వరల్డ్ రికార్డ్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది.

# బహుముఖ ప్రతిభ



లక్ష్యం పట్ల నిబద్ధత, చక్కటి ప్రణాళిక ఉంటే అభిరుచులు కొనసాగిస్తూనే... చదువులో, పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు అందుకోవడం సాధ్యమేనంటున్నారు ప్రతిభా శేఖర్. కవిత్వం, యాంకరింగ్, ఫిలిమ్‌మేకింగ్, ఫొటోగ్రఫీ... ఇలా అనేక అంశాల్లో రాణిస్తున్న ఆమె ఎక్కడా శిక్షణ తీసుకోకుండా, స్వయం సన్నద్ధతతోనే గ్రూప్-1లో మంచి స్కోర్ సాధించారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం, ప్రకృతిని ఆస్వాదించడం ఇష్టమంటున్న ప్రతిభ పంచుకున్న విశేషాలివి...

"మా నాన్న శేఖర్... ఎల్ఐసిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్. అమ్మ సుజాత తెలంగాణ ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రటరీగా పని చేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్నత స్థానాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న వారిద్దరినీ చూశాక.. పబ్లిక్ సర్వెంట్ కావాలన్న కోరిక నాకు చిన్న వయసులోనే కలిగింది. అదే లక్ష్యంగా నిర్దేశించుకున్నాను. 'నిట్-వరంగల్'లో బీటెక్ చేశాను. నాలుగేళ్ళ క్రితం నుంచి యుపిఎస్‌సికి ప్రిపేర్ కావడం ప్రారంభించాను. ఆ తరువాత తెలంగాణ గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతో... దానికీ సన్నద్ధమయ్యాను. అందుకోసం నేను ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. 'ఎలా చదవాలి? ఏది ఎప్పుడు చదవాలి?' అని కచ్చితంగా ప్రణాళిక వేసుకొని, దాన్నే అనుసరించాను. తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్, మా కుటుంబానికి సన్నిహితుడు మామిడి హరికృష్ణగారు నాకు మెంటార్‌గా వ్యవహరించారు. ప్రశ్నలకు నేను రాసిన జవాబులను ఆయన మూల్యాంకన చేసేవారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో నాకు 483.5 స్కోర్ వచ్చింది.


**ఒత్తిడి తగ్గాలంటే...**

సొంతంగా ప్రిపేర్ కావడం చాలా కష్టమని చాలామంది అనుకుంటారు. సరైన ప్రణాళిక ఉంటే అది ఏమాత్రం ఇబ్బంది కాదు. సాధారణ రోజుల్లో నాలుగైదు గంటలు చదివేదాన్ని. పరీక్షలు దగ్గరవుతున్నప్పుడు... నాలుగు నెలలపాటు ఏడెనిమిది గంటలు చదివాను. అలాగని పూర్తిగా దానికే అంకితం అయిపోలేదు. పెద్ద పరీక్షలకు సన్నద్ధం అవుతున్నప్పుడు సహజంగానే ఒత్తిడి ఉంటుంది. ఖాళీలు వందల్లో ఉంటే... పోటీపడేవారు లక్షల్లో ఉంటారు. పెద్ద లక్ష్యాల వెనుక పరిగెడుతున్నప్పుడు... మానసిక ఆరోగ్యం మీద కూడా ఆ ప్రభావం ఉంటుంది. ఇతర యాక్టివిటీస్ ద్వారా దాన్ని తగ్గించుకోవచ్చు. నా వరకూ నేను ట్రావెలింగ్‌ను ఇష్టపడతాను. మూడు-నాలుగు నెలలకు ఒకసారి ఏదో ఒక ప్రదేశానికి వెళ్తాను. లద్దాఖ్, కేరళ, గోవా... ఇలా చాలా ప్రదేశాలను చూశాను. వీటిలో లద్దాఖ్ నాకు బాగా నచ్చిన ప్రదేశం. అక్కడ జనాభా తక్కువగా ఉంటుంది, ప్రకృతి సౌందర్యంతో అలరారుతూ ఉంటుంది. టూర్లకు వెళ్ళినప్పుడు... మిగిలిన వాటి గురించి ఆలోచనలన్నీ వదిలేస్తాను. ఆ పర్యటనను ఆస్వాదించడం మీదే మనసు లగ్నం చేస్తాను. తిరిగి వచ్చాక మళ్ళీ పనిలో పడడానికి కావలసిన ఉత్తేజాన్ని నాలో నింపుకొంటాను.

**గొప్ప గౌరవంగా భావిస్తున్నా..**

నేను పుట్టిందీ, పెరిగిందీ హైదరాబాద్‌లో. అన్ని విషయాల్లోనూ నన్ను ఎంతగానో నా తల్లితండ్రులు ప్రోత్సహించారు. ఇతర యాక్టివిటీస్ వల్ల పిల్లలు చదువులో వెనుకబడతారని చాలామంది తల్లితండ్రులు భావిస్తూ ఉంటారు. అది నిజం కాదు. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కేవలం చదువు మాత్రమే సరిపోదు. చదువును, మన అభిరుచులను బ్యాలన్స్ చేసుకోవడం తెలిస్తే... దేన్నీ వదులుకోనక్కర్లేదు. నాకు కవిత్వం చదవడం, రాయడం ఇష్టం. దినపత్రికల్లో ప్రచురితమయ్యే కవితల్ని చదవడం ద్వారా ఈ అభిరుచి మొదలయింది. హైస్కూల్‌లో ఉన్నప్పటి నుంచే తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో కవితలు రాసేదాన్ని. కాలేజీకి వచ్చాక... అది మరింతగా పెరిగింది. నాలో కదిలే భావాలతో మలచిన హిందీ-ఉర్దూ కవితలతో 'మాన్ షాయరానే కా' అనే సంకలనాన్ని 2021లో విడుదల చేశాను. రిలాక్స్ కావాలనుకున్నప్పుడు కవితలు చదువుతాను, రాస్తాను. స్ఫూర్తిని, ప్రేరణను కలిగించే కవితలంటే ఇష్టం. ఉర్దూలో గాలిబ్, తెలుగులో శ్రీశ్రీ కవితలంటే ఇష్టం. రాబోయే రోజుల్లో మరికొన్ని కవితా సంకలనాలను తీసుకొస్తాను. ఇక, 2020లో 'నిట్- వరంగల్' యువజనోత్సవం సందర్భంగా నిర్వహించిన షార్ట్ ఫిలిమ్ మేకింగ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచాను. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ కోసం ఒక డాక్యుమెంటరీని రూపొందించాను. యాంకరింగ్ నాకు ఇష్టమైన మరో అంశం. స్కూల్లో, కాలేజీలోనే కాదు, అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు యాంకర్‌గా వ్యవహరించాను. 'తెలంగాణ బతుకమ్మ ఫిల్మోత్సవ్' పేరిట నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీలకు యాంకరింగ్ చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. పర్యటనల్లో కనిపించిన మంచి దృశ్యాలను ఫొటోలు తీయడం నాకున్న ఇంకో హాబీ. సినిమాలు సెలక్టివ్‌గా చూస్తాను. సందేశాత్మక చిత్రాలు వస్తే వదిలిపెట్టను. గ్రూప్-1లో నాకు వచ్చిన మార్కుల ప్రకారం... మంచి పోస్టింగే వస్తుందని ఆశిస్తున్నాను. రాబోయే రోజుల్లో యుపిఎససిలో ర్యాంక్ సాధించాలనేది నా లక్ష్యం. దానికోసం సిద్ధమవుతున్నాను."

# మెంతులతో ముందుకొచ్చిన పొట్టను తగ్గించుకోవచ్చు, ఎలా తీసుకోవాలో తెలుసా?



చెడు జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కారణంగా ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇందులో బెల్లీ ఫ్యాట్ ముఖ్యమైన సమస్యగా మారింది. చాలా మంది బెల్లీ ఫ్యాట్‌తో బాధపడుతున్నారు. బెల్లీ ఫ్యాట్ అంటే బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోవడం. దీంతో ఈ పొట్ట గుండ్రటి ఆకారంలో కనిపిస్తుంది. బెల్లీ ఫ్యాట్ కారణంగా గుండె, బీపీ, షుగర్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా ముందుకు వచ్చిన పొట్టతో నలుగురితో తిరగాలంటే ఇబ్బందిగా ఉంటుంది.

అందుకే బెల్లీ ఫ్యాట్‌ని కరిగించుకోవాలి. అయితే, బెల్లీ ఫ్యాట్‌ను కరిగించడం పెద్ద సవాల్‌గా మారింది. పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు కరగడానికి చాలా సమయం పడుతుంది. శరీరంలో మిగతా భాగాల కన్నా నెమ్మదిగా కరుగుతుంది. బెల్లీ ఫ్యాట్‌ని కరిగించుకోవాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుంది. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామంతో పాటు కొన్ని ఇంటి చిట్కాలు ముందుకువచ్చిన పొట్టను కరిగించడంలో సాయపడతాయి. వంటగదిలో దొరికే మెంతులతో పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును కరిగించుకోవచ్చని చెబుతున్నారు ఆయుర్వేద నిపుణులు. బెల్లీ ఫ్యాట్ తగ్గడానికి మెంతుల్ని ఎలా తీసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.

**మెంతుల్లో పోషకాలు**

వంటల్లో రుచిని పెంచే మెంతుల్లో పోషకాలు మెండుగా ఉన్నాయి. మెంతుల్లో పొటాషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె, బీ6, ఫోలిక్ యాసిడ్, కాపర్ వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. మెంతుల్లో ఉండే పొటాషియం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. మెంతుల్లో గెలాక్టోమన్నన్ అనే సమ్మేళనం ఎక్కువగా ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. అంతేకాకుండా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మెంతుల్లో ఉండే విటమిన్ కె ఎముకల ద్రవ్యరాశ్ని స్ట్రాంగ్‌గా మారుస్తుంది. ఇలాంటి మెంతుల్ని బరువు తగ్గడం కోసం ఎలా తీసుకోవచ్చో తెలుసుకుందాం.

**మెంతుల నీరు**

?బెల్లీ ఫ్యాట్‌ను తగ్గించడానికి మెంతుల నీరు బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. ఇందుకోసం ఒక చెంచా మెంతుల్ని తీసుకోండి. వాటిని ఒక గ్లాస్ నీటిలో రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఈ నీటిని కొద్దిగా వేడి చేసి తాగవచ్చు. మెంతుల నీరు కొవ్వును బర్న్ చేయడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. రెగ్యులర్‌గా ట్రై చేస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు చెబుతున్నారు.

**మెంతుల టీ**

?మెంతుల టీ కూడా బెల్లీ ఫ్యాట్ తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇందుకోసం ఓ రెండు టీ స్పూన్ల మెంతుల్ని తీసుకోండి. వాటిని ఒక గ్లాస్ నీటిలో వేసి మరిగించండి. నీరు సగం వచ్చేంత వరకు మరిగించాలి. ఆ తర్వాత చల్లార్చి గోరు వెచ్చగా తాగండి. మీరు కావాలంటే రుచి కోసం నిమ్మకాయ రసం, తేనె కలిపి కూడా తాగవచ్చు. రెగ్యులర్‌గా తాగడం వల్ల పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు కరిగిపోతుంది.

**మెంతుల సిరప్**

ఇందుకోసం ముందుగా మెంతుల్ని నానబెట్టాలి. ఆ తర్వాత నానబెట్టిన మెంతుల్ని, అర చెంచా అల్లం పేస్ట్, ఒక గ్లాస్ నీటితో మరిగించాలి. నీరు మరిగిన తర్వాత చల్లార్చి దానికి నిమ్మరసం కలుపుకోవాలి. ఇది బెల్లీ ఫ్యాట్‌ని తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ సిరప్ జీవక్రియన వేగవంతం చేస్తుంది. జీవక్రియ పెరిగితే పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు బర్న్ అవుతుంది.

**మెంతుల పొడి**

మెంతుల్ని బాగా వేయించి పొడిలా చేసుకోవాలి. ఈ మెంతుల పొడిని కూరల్లో లేదా వంటల్ల వాడుకోవచ్చు. కావాలంటే గోధుమ పిండిలో కలిపి రొట్టెలు చేసుకోవచ్చు. మెంతుల పొడిని సలాడ్లు లేదా స్మూతీల్లో కూడా కలిపి తీసుకోవచ్చు. మెంతుల పొడిని తీసుకోవడం చాలా సులభం.

**ఇవి కూడా ట్రై చేయండి**

- ధనియాల నీరు: మెంతుల మాదిరిగానే ధనియాల్ని రాత్రంతా నీటిలో నానబెట్టి.. ఆ తర్వాత వేడి చేసి తాగవచ్చు. ఇది కూడా బరువు తగ్గించడంలో సాయపడుతుంది.
- వాము నీరు: బరువు తగ్గడంలో వాము నీరు కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది. వాము నీరు తాగడం వల్ల కడుపులోని సమస్యల్ని తగ్గించుకోవచ్చు.
- జీలకర్ర నీరు: ఈ నీటిలో కొవ్వును కరిగించే గుణాలు పుష్కలంగా ఉన్నాయి. జీలకర్రను నానబెట్టి ఫిల్టర్ చేసి ఈ నీరును తాగవచ్చు.
- సోంపు గింజల నీరు: ఈ రెమెడీ కూడా బెల్లీ ఫ్యాట్‌ని తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటుంది. జీర్ణసమస్యలు తగ్గించడంలో సోంపు అద్భుతంగా పనిచేస్తుంది.

# ఫ్యాషన్, స్టైల్ అని మీరు వేసుకునే కొన్ని రకాల బట్టలు ఆరోగ్యానికి ప్రమాదకరం, లిస్టులో ఏమేం ఉన్నాయంటే



అందంగా, స్టైలిష్‌గా కనిపించేందుకు నేటి యువత ఎన్నో తంటాలు పడుతున్నారు. ఫ్యాషన్ సెన్స్ బాగా పెరిగింది. కేవలం అమ్మాయిలు మాత్రమే కాదు.. అబ్బాయిలు కూడా డ్రెస్సింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇక, కాలంతో పాటు ఫ్యాషన్‌లో కూడా పెద్ద మార్పు వస్తుంది. కొన్ని ఏళ్ల క్రితం ఫ్యాషన్ అనుకునే కొన్ని రకాల దుస్తులు ఇప్పుడు పాతవిగా మారి ఉండవచ్చు. ఎవరూ వాటిని ధరించడానికి ఇష్టపడకపోవచ్చు. సహజంగానే వ్యక్తిత్వాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చుకోవడానికి ఫ్యాషన్ సెన్స్, గ్రూమింగ్ పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం.

అయితే, కాలక్రమేణా వార్డ్రోబ్‌లో కొన్ని మార్పులు చేస్తూ ఉండాలి. అయితే, కొన్నిసార్లు లేటెస్ట్ ఫ్యాషన్ ట్రెండ్స్ ఆరోగ్యానికి చాలా హానికరం కావచ్చు. అందుకే, ఏదైనా ఫ్యాషన్ ట్రెండ్‌ని గుడ్డిగా ఫాలో అవ్వకుండా చూసుకోవాలి. అయితే, కొన్ని రకాల దుస్తులు ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేయవచ్చు. ఈ దుస్తులు వేసుకోవడం వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇంతకీ ఆ దుస్తులేంటి, అవి ఎందుకు వేసుకోకూడదో తెలుసుకుందాం.

**చాలా టైట్‌గా ఉండే జీన్స్**

'స్కిన్నీ జీన్స్' అని కూడా పిలువబడే టైట్ జీన్స్, టీనేజర్లలో ఒక ప్రధాన ఫ్యాషన్ ట్రెండ్‌గా మారింది. ఇప్పుడు అది మీకు ఎంత స్టైలిష్‌గా కనిపించినా, అది ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. నిజానికి, స్కిన్నీ జీన్స్ రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుంది. స్కిన్నీ జీన్స్ కారణంగా శరీరంలో దిగువ భాగాలకు రక్త ప్రసరణ తగ్గవచ్చు. అంతేకాకుండా నరాల మీద అదనపు ఒత్తిడిని కూడా కలిగిస్తుంది. దీని కారణంగా కాళ్ళలో నొప్పి సమస్య, గజ్జల్లో నొప్పి వంటి సమస్యలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో, ఈ మరీ టైట్‌గా ఉండే జీన్స్ పురుషులలో వంధ్యత్వానికి కూడా కారణమవుతాయని నిపుణులు అంటున్నారు.

**షేప్‌వేర్‌ను ఎక్కువగా వాడకండి**

ఈ రోజుల్లో, మహిళల్లో షేప్ వేర్ ధరించే ట్రెండ్ వేగంగా పెరుగుతోంది. ఇది ఒక రకమైన లోదుస్తులు. దీనిని ధరించడం వల్ల శరీర ఆకృతి చాలా మెరుగుపడుతుంది. నాజుగ్గా కనిపించేందుకు ఈ షేప్‌వార్‌ని ఎక్కువగా వాడుతున్నారు. ఏదైనా ఫంక్షన్ లేదంటే కొన్ని సందర్భాల్లో వీటిలో వాడితే తప్పులేదు. కానీ, వీటిని ఎక్కువ సార్లు వాడితే ఆరోగ్యానికి ప్రమాదమంటున్నారు నిపుణులు. షేప్?వేర్ కడుపును లోపలికి నెట్టివేస్తుంది. దీని కారణంగా శరీరంలోని అంతర్గత భాగాలపై ఒత్తిడి కలుగుతుంది. అంతేకాకుండా స్వేచ్ఛగా శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బంది ఏర్పడుతుంది. దీని కారణంగా శరీరానికి సరైన ఆక్సిజన్ లభించదు. వాంతులు, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి.

**టైట్, లేస్ లోదుస్తులు**

సాధారణంగా లేస్ లోదుస్తులు ఆకర్షిణీయం, అందంగా కనిపిస్తాయి. దీంతో, చాలా మంది ఈ లోదుస్తుల్ని వారి ఫ్యాషన్‌లో భాగం చేసుకుంటున్నారు. అయితే, లేస్ లోదుస్తులు గాలిని సరిగ్గా పీల్చుకోవు. దీంతో, తేమ ఎక్కువగా చేరుతుంటుంది. దీని కారణంగా యోని ఇన్ఫెక్షన్, యూటీఐ ప్రమాదం కూడా పెరుగుతుంది. వీటితో పాటు బిగుతుగా ఉండే లోదుస్తులు కూడా అస్సలు మంచిది కాదు. ఎందుకంటే టైట్ లోదుస్తులు యోని ఇన్ఫెక్షన్ అవకాశాల్ని పెంచుతాయి. అంతేకాకుండా యోని చుట్టూ ఉన్న చర్మం రాపిడికి గురవుతుంది. చికాకు కూడా పెరుగుతుంది. అందుకే కాటన్‌తో చేసిన తేలికైన, వదులుగా ఉండే లోదుస్తుల్ని ఎంచుకోండి.

**బిగుతుగా ఉండే దుస్తులు**

అందరూ చక్కగా సరిపోయే దుస్తులు ధరించడానికి ఇష్టపడతారు. చాలా మంది ఫిట్‌గా ఉండాలని కోరుకుంటారు. అది సాధ్యం కానప్పుడు ఫిట్‌గా కనిపించడానికి టైట్ షర్టులు, బాడీకాన్ డ్రెస్సులు, టాప్స్ వంటి దుస్తులు ధరిస్తున్నారు. అయితే, ఇవి టైట్‌గా ఉంటే మాత్రం ఇబ్బందులు తప్పవు. ఇలాంటి బట్టలు శరీరంలో రక్త ప్రసరణను నెమ్మదించేలా చేస్తాయి. కొన్నిసార్లు డీప్ వెయిన్ థ్రాంబోసిస్ వంటి ప్రమాదకరమైన వ్యాధి కూడా రావచ్చు. టైట్ బట్టలు కడుపుపై ఒత్తిడిని కలిగిస్తాయి. దీని కారణంగా యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట వంటి సమస్యలు తలెత్తుతాయి.

**సీక్విన్ వర్క్ దుస్తులు**

మెరిసే, ఆకర్షణీయమైన సీక్విన్ వర్క్ డ్రెస్సులు ఎవరికి ఇష్టం ఉండవు? పార్టీల్లో అందంగా కనిపించేందుకు ఈ దుస్తులు బెస్ట్ ఆప్షన్. అయితే, సీక్విన్ వర్క్ ఉన్న బట్టలు ధరించడం ఆరోగ్యానికి మంచిది కాదు. నిజానికి, బిస్ ఫినాల్ ఎ, థాలేట్లను సీక్విన్లను తయారు చేయడానికి ఉపయోగిస్తారు. ఈ రెండు పదార్థాలు హార్మోన్ల సమతుల్యతను భంగపరుస్తాయి. అంతేకాకుండా పునరుత్పత్తి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు కూడా వస్తాయి. అందుకే ఇలాంటి దుస్తులు ధరించడం మానుకోవాలని నిపుణులు అంటున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 | హైదరాబాద్
మంగళవారం
25 । మార్చి । 2025






# దలాల్‌స్ట్రీట్‌లో రంకేసిన బుల్..! సెన్సెక్స్ 1000 పాయింట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల జోరు కొనసాగుతున్నది. వరుసగా ఆరో రోజు మార్కెట్లు లాభాల ర్యాలీ కొనసాగింది. ఫైనాన్సియల్, బ్యాంకింగ్ రంగాల్లో స్టాక్స్ పెరుగుల కారణంగా సూచీలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సానుకూల పవనాలకు తోడు.. విదేశీ పెట్టుబడులు కొనసాగుతుండడంతో పాటు బ్లూ-చిప్ స్టాక్స్ కొనుగోళ్ల కారణంగా మార్కెట్లు లాభాలను నమోదు చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. సోమవారం ఉదయం 77,456.27 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత సెన్సెక్స్ చివరి వరకు అదే జోష్‌లో కొనసాగాయి. ఈ క్రమంలోనే ఇంట్రాడేలో 77,179.35 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 78,107.23 పాయింట్లకు పెరిగింది. చివరకు 1,078.87 పాయింట్లు పెరిగి.. 77,984.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 307.95 పాయింట్లు పెరిగి 23,658.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,371 షేర్లు లాభపడ్డాయి. 1,602 షేర్లు నష్టపోగా.. మరో 153 షేర్లు మారలేదు. బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, ఐటీ, ఆయిల్, గ్యాస్, పవర్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ తదితర రంగాలకు చెందిన సూచీలు ఒకటి నుంచి మూడుశాతం వరకు పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతానికిపైగా వృద్ధిని నమోదు చేశాయి. నిఫ్టీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, పవర్ గ్రిడ్ కార్ప్, టెక్ మహీంద్ర భారీగా లాభపడ్డాయి. అయితే ఎంఅండ్ఎం, టైటాన్ కంపెనీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, భారతి ఎయిర్‌టెల్ నష్టపోయాయి.

## ఇండియాతో అమెరికా టారిఫ్స్ చర్చలు



**అమెరికా-నవభూమి:** అధ్యక్షుడిగా ఎన్నికైంది మొదలు ట్రేడ్ టారిఫ్ బాదుడంటూ ప్రపంచదేశాల్ని బెదరగొడుతున్నారు అగ్రరాజ్యాధినేత డోనాల్డ్ ట్రంప్. ఇక అడపాతడపా ఇండియా పేరు ప్రస్తావించి మరీ మీరెంత టాక్స్ వేస్తే మేమూ అంతే వేస్తామంటూ రెసిప్రోకల్ టారిఫ్స్ హెచ్చరికలు చేస్తున్న సంగతి తెలిసిందే. తాము ఎలాంటి టారిఫ్స్ ఇండియాపై విధిస్తామో ఏప్రిల్ 2వ తేదీన తెలుస్తుందని కూడా ట్రంప్ చెప్పుకొచ్చారు. దీనిపై భారత మార్కెట్లు ఉత్సుకతతో ఎదురు చూస్తున్న వేళ అమెరికా ప్రతినిధి రేపు ఇండియాతో చర్చలకు వస్తున్నారు. ఇది భారత మార్కెట్లకు ఒకింత సానుకూల పరిణామమేనని చెప్పుకోవాలి.
దక్షిణ, మధ్య ఆసియాకు అసిస్టెంట్ యుఎస్ ట్రేడ్ ప్రతినిధి అయిన బ్రెండన్ లించ్ ఇండియాకు వస్తున్నట్టు అధికారిక సమాచారం వెలువడింది. యుఎస్ ప్రభుత్వ బృందంతో కలిసి ఆయన మార్చి 25 నుంచి 29 వరకు భారతదేశంలో పర్యటిస్తారు. యుఎస్-ఇండియా ద్వైపాక్షిక వాణిజ్య చర్చలలో భాగంగా ఆయన కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ సహా భారత అధికారులతో కీలక సమావేశాలు జరుపుతారు. ఐదు రోజుల పర్యటనలో ఇరుదేశాల మధ్య వాణిజ్యం, ట్రేడ్ టారిఫ్స్ అమలు మొదలైన విషయాల గురించి చర్చలుంటాయని తెలుస్తోంది. లెవీలు, మార్కెట్ యాక్సెస్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించే పలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల గురించి కూడా ఇరు దేశాలు చర్చించబోతునట్టు సమాచారం. భారతదేశంతో పెట్టుబడి, మంచి వాణిజ్య సంబంధాన్ని నెరపేందుకు నిబద్ధతతో ఉన్నామని బ్రెండన్ లించ్ అంటున్నారు.

## గుడ్ న్యూస్..ఈ ఛార్జీలను తొలగించిన అమెజాన్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత రోజుల్లో అనేక మంది వారు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్ లైన్ విధానంలో ఫ్లిప్ కార్ట్, అమెజాన్ వంటి సంస్థల ద్వారా సేల్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి వారికి అమెజాన్ ఇండియా తాజాగా గుడ్ న్యూస్ తెలిపింది. ఈ క్రమంలో రూ.300 కంటే తక్కువ ధర ఉన్న 1.2 కోట్ల ఉత్పత్తులపై రిఫెరల్ ఫీజులను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.
ఇప్పటివరకు అమెజాన్ ప్లాట్‌ఫామ్‌పై అమ్మకాలు జరిపే ప్రతి విక్రేతకు రిఫెరల్ ఫీజు అనేది ప్రధాన భారంగా ఉండేది. కానీ ఇప్పుడు వారి ఉత్పత్తులు అమ్ముతున్నవారికి ఈ ఫీజును తొలగించడంతో అమెజాన్ ద్వారా అమ్మకాలు చేస్తున్న వ్యాపారాలకు పెద్ద ఉపశమనం కలిగింది. ఈ మార్పుతో విక్రేతలకు, ముఖ్యంగా చిన్న వ్యాపారాలకు తమ ఉత్పత్తులకు సంబంధించి మరిన్ని లాభాలు రానున్నాయి.

**విక్రేతలకు మెరుగైన అవకాశాలు**

ఈ కొత్త నిర్ణయం ద్వారా ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న విక్రేతలు, చిన్న వ్యాపారాలు, అమెజాన్ ప్లాట్‌ఫామ్‌లో మరింత స్థిరపడేందుకు అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో అమెజాన్ ప్రస్తుతం 135 విభాగాల్లో రిఫెరల్ ఫీజును తొలగించింది. వాటిలో దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ ఆభరణాలు, కిరాణా ఉత్పత్తులు, గృహ అలంకరణ, అందం, బొమ్మలు, వంటగది ఉత్పత్తులు, ఆటోమోటివ్ వస్తువులు, పెంపుడు జంతువుల వంటి పలు రకాల ఉత్పత్తులు ఉన్నాయి.
మరోవైపు కస్టమర్లకు కూడా..అమెజాన్ ఒక కిలో కంటే తక్కువ బరువున్న వస్తువుల నిర్వహణ రుసుములను కూడా తగ్గించింది. ఈ మార్పుతో, విక్రేతలు తక్కువ రుసుము చెల్లించి తమ ఉత్పత్తులను సులభంగా స్టోర్ చేసుకోవచ్చు. ఇదే సమయంలో అమెజాన్ ఫ్లాట్ రేట్ షిప్పింగ్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టింది. ఈ వ్యవస్థ ద్వారా, ఉత్పత్తుల బరువు, పరిమాణం లేదా దూరం వంటి అంశాలు కాకుండా, ఒక స్థిరమైన ధరను మాత్రమే వసూలు చేస్తాయి. ఈ కొత్త రేట్ ఇకపై 75 నుంచి రూ.65కి తగ్గింది. ఇది షిప్పింగ్ ఖర్చులను మరింత తగ్గిస్తుంది. ఈ క్రమంలో రుసుములను తగ్గించడం వల్ల కస్టమర్లకు కూడా తక్కువ ధరలకు ఉత్పత్తులు లభించనున్నాయి. ఈ కొత్త నిర్ణయాలు, కొత్త రుసుములు ఏప్రిల్ 7, 2025 నుంచి అమల్లోకి వస్తాయి.


## ఒకే రీఛార్జ్‌తో ముగ్గురికి ఉపయోగం..సరికొత్త ప్లాన్ ప్రవేశపెట్టిన బీఎస్ఎన్ఎల్

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత టెలికాం రంగంలో ఆయా కంపెనీల మధ్య పోటీ క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రధానంగా ప్రభుత్వ సంస్థ వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా, బీఎస్ఎన్ఎల్ కొత్త ఫ్యామిలీ ప్లాన్‌ను అనౌన్స్ చేసింది. దీని స్పెషల్ ఏంటంటే ఒకే రీఛార్జ్‌తో ముగ్గురు కుటుంబ సభ్యులు సేవలను పొందవచ్చు. ఈ ప్లాన్ అన్ని పోస్ట్‌పెయిడ్ వినియోగదారుల కోసం అమల్లో ఉంటుందని కంపెనీ తెలిపింది. దీంతో కొత్తగా ప్రవేశపెట్టిన రూ.999 ఫ్యామిలీ ప్లాన్, వినియోగదారుల ఆదరణను క్రమంగా పెంచుకుంటోంది. ఈ ప్లాన్ ద్వారా ఒక వ్యక్తి రీఛార్జ్ చేసుకుంటే, మరో ఇద్దరు కూడా దీని సేవలను పొందవచ్చు. ఈ విధంగా, ముగ్గురు కుటుంబ సభ్యులు ఒకే ధరకు సేవలను వినియోగించుకోవచ్చు. ప్రత్యేకంగా ఈ ప్లాన్ ద్వారా వ్యక్తిగత ప్లాన్‌ల అవసరాన్ని తొలగించి, కుటుంబంలో ఉన్న వారందరికీ సమానమైన సేవలు అందించడం సాధ్యమవుతుంది.
బీఎస్ఎన్ఎల్ ఫ్యామిలీ ప్లాన్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది మూడు వేర్వేరు కనెక్షన్‌లను ఒకే రీఛార్జ్‌తో అనుసంధానం చేసుకోవచ్చు. దీంతో, వేర్వేరు వ్యక్తుల కోసం ప్రత్యేక రీఛార్జ్‌లు చేయాల్సిన అవసరం కూడా ఉండదు. ఒకే ప్లాన్‌లో ముగ్గురు కుటుంబ సభ్యులు సేవలను పొందవచ్చు. ఆ క్రమంలో ప్రతి యూజర్‌కు సొంతంగా 75GB డేటా, రోజు 100 ఉచిత SMSలు, అపరిమిత ఉచిత కాలింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.

**వినియోగదారులకు 300GB డేటా**

రూ.999 ఫ్యామిలీ ప్లాన్‌లో భాగంగా ప్రతి వినియోగదారునికి 75GB డేటా కేటాయించబడుతుంది. అంటే ఇది మొత్తం ముగ్గురికి కలిపి 300GB డేటా లభిస్తుంది.

## అనంతపురంలో బాధ్యతాయుతమైన నీటి నిర్వహణ ద్వారా నీటి భద్రతను సాధ్యం చేస్తోన్న అల్ట్రాటెక్





**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా, తాము దృష్టి సారించిన నీటి నిర్వహణ పద్ధతులు మరియు ప్రభావవంతమైన పాలనా వ్యవస్థల ద్వారా బాధ్యతాయుతమైన నీటి నిర్వహణ పట్ల తమ నిబద్ధతను అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ పునరుద్ఘాటిస్తుంది. అల్ట్రాటెక్ యొక్క నీటి నిర్వహణ ప్రయత్నాలు, యూనిట్ ప్రాంగణంలో , కంచెకు ఆవల ఉన్న ప్రాంతాలను, అంటే కంపెనీ కార్యకలాపాలను నిర్వహించే ప్రాంతాలలోని కమ్యూనిటీలను సైతం చేరుకుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో వున్న అల్ట్రాటెక్ యొక్క ఇంటిగ్రేటెడ్ సిమెంట్ తయారీ యూనిట్, ఆంధ్రప్రదేశ్ సిమెంట్ వర్క్స్, నీటి సంరక్షణ పట్ల సమగ్ర విధానాన్ని కలిగి ఉంది. వారి నీటి సంరక్షణ కార్యక్రమాలలో ఒకటి వరుసగా నంద్యాల జిల్లా మరియు అనంతపురం జిల్లాలోని పెట్నికోట మరియు అయ్యవారిపల్లి గ్రామాలపై దృష్టి పెడుతుంది. ఇక్కడ తక్కువ వర్షపాతం, భూమి క్షీణత మరియు అతి తక్కువ పంట ఉత్పాదకత వంటివి గ్రామీణ జీవనోపాధికి చాలా కాలంగా అడ్డంకులుగా ఉన్నాయి. ఫలితంగా, ఈ ప్రాంతంలో సమగ్ర వాటర్‌షెడ్ నిర్వహణ కార్యక్రమాలను అమలు చేయడానికి యూనిట్ 2019-20లో ఐదు సంవత్సరాల కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ రోజు వరకు, ఆంధ్రప్రదేశ్ సిమెంట్ వర్క్స్ ఈ గ్రామాల్లో ఏడు వర్షపు నీటి ఇంకుడు గుంతల నిర్మాణాలను నిర్మించింది, ఇది భూగర్భజల స్థాయిలను గణనీయంగా పెంచుతుంది. ఈ నిర్మాణాలు 35,000 క్యూబిక్ మీటర్ల మొత్తం నీటి నిల్వ సామర్థ్యాన్ని సృష్టించాయి, జనవరి 2025 నాటికి 7 లక్షల క్యూబిక్ మీటర్ల వర్షపు నీటిని ఇవి సేకరించాయి. దీని వలన భూగర్భ జలాలు 2 నుండి 4 మీటర్ల వరకు గణనీయంగా పెరిగాయి, దాదాపు 346 హెక్టార్ల సాగు భూమికి నీటిపారుదల లభించింది. గతంలో బంజరుగా ఉన్న 400 ఎకరాల భూమిని కూడా సాగులోకి తీసుకువచ్చారు, వ్యవసాయ ఉత్పాదకత , ఆదాయ భద్రతను పెంచారు. సమతుల్య పోషక వినియోగ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించే ప్రయత్నాలు ఈ గ్రామాల్లో నేల మరియు భూగర్భ జల కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా సహాయపడ్డాయి. ఈ ప్రాజెక్ట్ నంద్యాల మరియు అనంతపురం జిల్లాల్లోని ఈ రెండు గ్రామాల్లో నివసిస్తున్న 500 గృహాలలో 2,000 మందికి పైగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చింది.
అల్ట్రాటెక్ యొక్క సమగ్ర నీటి సంరక్షణ విధానం కమ్యూనిటీ నీటి సంరక్షణ కార్యక్రమాలతో పాటు, అల్ట్రాటెక్ దాని తయారీ కార్యకలాపాలలో నీటి సంరక్షణకు బహుముఖ విధానాన్ని కూడా తీసుకు వచ్చింది. ఈ విధానంలో అయిపోయిన గని గుంటలను జలాశయాలుగా మార్చడం , పైకప్పుపై వర్షపు నీటి సేకరణ నిర్మాణాలను నిర్మించడం, పునర్వినియోగించబడిన నీటి వినియోగం పెరగడంతో పాటు తయారీ కార్యకలాపాలలో నీటి సామర్థ్యాన్ని పెంచే కార్యక్రమాలు ఉన్నాయి. అల్ట్రాటెక్ తమ అనేక తయారీ యూనిట్లలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది, దీని ద్వారా యూనిట్లలో 100 శాతం శుద్ధి చేసిన నీటిని తిరిగి ఉపయోగించుకునే అవకాశం లభిస్తుంది, తద్వారా మంచినీటిపై ఆధారపడటం తగ్గుతుంది. నీటి సామర్థ్య మెరుగుదల అవకాశాలను గుర్తించడానికి, రోజుకు 100 క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువ నీటి ఆధారపడటం ఉన్న దేశీయ ప్రదేశాలలో ఇది ద్వైవార్షిక నీటి ఆడిట్‌లను కూడా నిర్వహిస్తుంది. ఆంధ్రప్రదేశ్ సిమెంట్ వర్క్స్ తమ యూనిట్ ప్రాంగణంలో అనేక నీటి సంరక్షణ కార్యక్రమాలను చేపట్టింది. ప్రారంభం నుండి, ఈ యూనిట్ తమ ప్రాంగణంలో 1.9 మిలియన్ క్యూబిక్ మీటర్లకు పైగా నీటిని సేకరించి, రీఛార్జ్ చేసి, తిరిగి ఉపయోగించుకుంది, ఒక్క FY24 లో మాత్రమే 1.2 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని ఆదా చేసింది.

## వాట్సాప్‌లో కొత్తగా ఐదు ఫీచర్స్..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది వినియోగిస్తున్న ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్. మెటా యాజమాన్యంలోని ఈ యాప్‌కు కోట్లాది మంది యూజర్లు ఉన్నారు. ఈ క్రమంలో యూజర్ల ఎక్స్‌పీరియన్స్‌ను మెరుగుపరిచేందుకు ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్స్‌ను పరిచయం చేస్తుంది. గోప్యత, భద్రతను మెరుగుపరిచేందుకు.. కంపెనీ అప్‌డేట్స్‌ను తీసుకు వస్తుంది. తాజాగా వాట్సాప్ కొత్తగా ఐదు ఫీచర్స్‌ను తీసుకువచ్చింది. ఈ ఫీచర్స్ యాప్‌ని మరింత సౌకర్యవంతంగా మార్చనున్నాయి. గత కొద్ది నెలలు అనేక ఫీచర్స్‌ను వాట్సాప్ టెస్ట్ చేస్తుంది. పలు ఫీచర్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అవేంటో తెలుసుకుందాం పదండి..!

**వాట్సాప్‌లో నచ్చిన థీమ్..**

వాట్సాప్‌లో యూజర్లు తమకు నచ్చినట్లుగా కస్టమైజ్ చేసుకునేందుకు.. చాటింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇంప్రూవ్ చేసేందుకు 'చాట్ థీమ్' స్పెసిఫికేషన్‌ను కంపెనీ లాంచ్ చేసింది. దాంతో యూజర్లు నచ్చిన కలర్‌లో చాట్‌ను సెట్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మొన్నటి వరకు చాట్ స్క్రీన్ థీమ్ కేవలం ఒకే రంగులో అందుబాటులో ఉండగా.. అవతలి యూజర్స్ పంపే సందేశాలు కేవలం వైట్ కలర్‌లో కనిపించేవి. యూజర్ సెండ్ చేసే మెసేజ్‌మాత్రం గ్రీన్ కలర్‌లో ఉండేవి.. మిగతా ప్లాట్‌ఫామ్స్‌లో ఇలాంటి చాట్ థీమ్స్ మార్చుకునే అవకాశం ఉండేది. తాజాగా వాట్సాప్ సైతం కస్టమైజ్డ్ ఫీచర్‌ను యూజర్లకు అందుబాటులోకి వచ్చింది.

**నోటిఫికేషన్స్‌ని నియంత్రించొచ్చు..**

వాట్సాప్‌లో చాలామందికి కుప్పలు తెప్పలుగా సందేశాలు వస్తుంటాయి. చాలామంది వాటిని చదవకుండా అలాగే వదిలేస్తుంటారు. యూజర్లు చదవని మెసేజ్ మెసేజ్‌లకు సంబంధించిన నోటిఫికేషన్ డాట్ కారణంగా చిరాకుపడుతుంటారు. చదవకుండా వదిలేసిన మెసేజ్ సమస్యను అధిగమించేందుకు వాట్సాప్ క్లియర్ చాట్ నోటిఫికేషన్ ఫీచర్‌ను జోడించింది. యూజర్లు నోటిఫికేషన్ సెట్టింగ్స్‌కు వెళ్లి తమకు నచ్చినట్లుగా నోటిఫికేషన్స్‌లో మార్పులు చేసుకునేలా వీలు కల్పించింది.

**ఫిల్టర్స్‌లో చాట్ కౌంటర్..**

వాట్సాప్ గతేడాది చాట్ ఫిల్టర్‌ను పరిచయం చేసిన విషయం తెలిసిందే. దాంతో మెసేజ్‌లను నిర్వహించడం సులభతరం చేసింది. తాజాగా వాట్సాప్ ఈ ఫీచర్‌కు చాట్ కౌంటర్ ఫీచర్‌ను జోడించింది. దాంతో యూజర్లు చాట్ ఫిల్టర్‌లో ఎన్ని మెసేజ్‌లు చదవనివి ఉన్నాయో నేరుగా తెలుసుకోవచ్చు. తద్వారా ఏదైనా ముఖ్యమైన మెసేజ్‌ను మిస్‌కాకుండా ఉంటుంది.

**వాట్సాప్, వీడియో ప్లేబ్యాక్ వేగం సర్దుబాటు..**

యూజర్లు చాలాకాలంగా ఎదురుచూస్తున్న వీడియో ప్లేబ్యాక్ స్పీడ్ సర్దుబాటు ఫీచర్‌ను వాట్సాప్ విడుదల చేసింది. గతంలో ఈ ఫీచర్ వాయిస్ నోట్స్ కోసం మాత్రమే అందుబాటులో ఉండేది. కానీ, ప్రస్తుతం యూజర్లు 1.5x లేదంటే.. 2x వేగంతో వీడియోలను కూడా చూడవచ్చు. వాట్సాప్‌లో షేర్ చేసిన వీడియోలను త్వరగా చూడాలనుకునే యూజర్లు ప్రత్యేకంగా ఉపయోగపడుతున్నది.

**హోమ్ స్క్రీన్‌కు మెటా ఏఐ విడ్జెట్..**

వాట్సాప్‌లో మెటా ఏఐ చాట్‌బాట్‌ను వాట్సాప్ పరిచయం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఏఐని మరింత లోతుగా అనుసంధానిస్తున్నది. యూజర్లు ఇప్పుడు వారి ఫోన్ హోమ్ స్క్రీన్‌కు మెటా ఏఐ విడ్జెట్‌ను జోడించొచ్చు. WhatsApp AI చాట్‌బాట్‌కు ఇన్‌స్టంట్ యాక్సెస్ ఇస్తుంది. ఇందు కోసం పర్సనలైజేషన్ ఓపెన్ చేసి.. విడ్జెట్ కేటగిరిలోకి వెళ్లాలి. అందులో హోమ్ స్క్రీన్‌కు Meta AI విడ్జెట్‌ను జోడించుకోవచ్చు. దాంతో కేవలం ఒకే ఒక్క ట్యాప్‌తో Meta AI చాట్‌బాట్ ఓపెన్ అయ్యి.. యూజర్లు సహాయం అందిస్తుంది.

## కొండెక్కిన పసిడి ధర.. ప్రస్తుతం రేట్లు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవల జీవిత కాల గరిష్ఠానికి(తులం రూ.90 వేలు) చేరిన బంగారం ధర స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. కొన్ని రోజులుగా వరసగా చుక్కలు చూపిస్తున్న పసిడి ధర ఇవాళ (24-03-2025)న స్వల్ప తేడాలతో యథావిధిగా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో కొండెక్కిన గోల్డ్ రేట్లలో నేడు ఎలాంటి మార్పు లేదు. సోమవారం ఉదయం 06:30 గంటల సమయానికి %https://bullions.co.in%/ ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.80,566 ఉండగా.. 24 క్యారెట్ల తులం పసిడి రేటు రూ.87,890 వద్ద కొనసాగుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.80,713 ఉండగా.. 24 క్యారెట్ల తులం గోల్డ్ రేటు రూ.88,050 వద్ద కొనసాగుతోంది. అలాగే హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.80,841 ఉండగా.. 24 క్యారెట్ల తులం పసిడి రేటు రూ.88,190 వద్ద కొనసాగుతోంది. అయితే మరికొన్ని రోజుల్లో బంగారం ధర రూ.లక్ష దాటే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మార్కెట్ పండితులు చెబుతున్నారు.
దేశవ్యాప్తంగా బంగారం (22, 24 క్యారెట్ల) ధర పరిస్థితి ఎలా ఉందంటే..

కోల్‌కతా- రూ.80,603, రూ.87,930
చెన్నై- రూ.80,942, రూ.88,300
బెంగళూరు- రూ.80,777, రూ.88,120
పుణె- రూ.రూ.80,713, రూ.88,050
అహ్మదాబాద్- రూ.80,813, రూ.88,160
భువనేశ్వర్- రూ.80,731, రూ.88,070
భోపాల్- రూ.80,795, రూ.88,140
కోయంబత్తూర్- రూ.80,942, రూ.88,300
పట్నా- రూ.80,667, రూ.88,000
సూరత్- రూ.80,813, రూ.88,160

వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..
ఇక వెండి ధరల్లోనూ స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. ఢిల్లీలో కిలో వెండి ధర ఆదివారం రూ.97,730 ఉండగా.. నేడు రూ.97,740కు చేరింది. ముంబైలో నిన్న కేజీ వెండి రూ.97,900 కాగా.. నేడు రూ.97,910 వద్ద కొనసాగుతోంది. అలాగే తెలుగు నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కిలో వెండి ధర ఆదివారం రూ.98,050 ఉండగా.. నేడు రూ.98,060కి చేరుకుంది.

## ద్రవ్యోల్బణాని దాటేద్దాం

**న్యూఢిల్లీ-నవభూమి:** పదవీ విరమణ అనంతర జీవితం.. ప్రతీ ఒక్కరికీ ఎంతో ముఖ్యం. ముదిమి వయసులో సరిపడా డబ్బుంటే ప్రతీ క్షణం ఆనందకరమే. కానీ ఆర్థిక సమస్యలు తలెత్తితే మాత్రం నరకమే. అందుకే రిటైర్మెంట్ ప్లానింగ్ అనేది తెలివైన పని. కానీ దానికోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలా ప్రధానమని మరువద్దు. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినైట్లైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతర జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

**పొదుపుపై ధరాఘాతం**

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. ఉద్యోగాన్ని వీడిన తర్వాత పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.
ఇదీ సంగతి..రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని. ఇక ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

స్టాక్ మార్కెట్లు..ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరి అని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్-టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్-టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కు వే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నం గా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నైట్లైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

**పెట్టుబడుల వర్గీకరణ**

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒకట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

**బాండ్లు, ఫండ్లు**

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్ప కాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు. చివరగా..ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూ పోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తిం చవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు.

## ఇలా చేయకపోతే... అప్పుల్లో తలనొప్పులు ఖాయం

**న్యూఢిల్లీ-నవభూమి:** చాలా మంది ఆర్థిక అవసరాల కోసం అప్పులు చేస్తుంటారు. కానీ వాటిని తీర్చేటప్పుడు మాత్రం ఇబ్బందులకు గురవుతుంటారు. కొంతమందికి అప్పులు తీసుకునే సమయంలో వాటిపై సరైన అవగాహన లేక.. అప్పు తీసుకున్నాక అనేక సమస్యలు ఎదుర్కొంటుంటారు. వడ్డీలు, అప్పు వ్యవధి కాలం, ఎలాంటి అప్పులు చేయాలని అనే వాటిపై చాలా మందికి అవగాహన ఉండి ఉండదు. అయితే అప్పులు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మాత్రం టెన్షన్ పడటం ఖాయం. అప్పులు తీసుకునేటప్పుడు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి.. అప్పుల విషయంలో ఎలా ముందడుగు వేయాలి.. అప్పులు తీసుకునేటప్పుడు తెలుసుకోవాల్సి కీలక విషయాలేంటి ఇప్పుడు చూద్దాం.

**వడ్డీ రేటు:** అప్పు తీసుకునేటప్పుడు వడ్డీ గురించి తప్పకుండా తెలుసుకోవాలి. బ్యాంకుల్లో పర్సనల్ లోన్ వడ్డీ పది నుంచి పదిహేను శాతం (10-15 శాతం) వరకు ఉంటుంది. అలాగే క్రెడిట్ కార్డులు 24 నుంచి 36 శాతం వరకు ఉంటుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం దాచిన ఛార్జీలు లేకుండా చూసుకోవడం బెటర్.

చెల్లింపు కాలం: అప్పులు తీసుకున్నా.. దాన్ని ఎంత వ్యవధిలో తీరుస్తారో తెలుసుకోవాలి. ఎక్కువ వ్యవధి ఉంటే తక్కువ ఈఎంఐ ఉంటుంది కానీ.. వడ్డీ ఎక్కువ. మనకు వచ్చే ఆదాయంలో 40 శాతం మించకుండా ఈఎంఐ ఉండేలా చూసుకోవాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ చెబుతోంది.

**దాచిన ఖర్చులు:** లోన్ తీసుకునే ముందు ప్రాసెసింగ్ ఫీజు, ప్రీ-పేమెంట్ పెనాల్టీ వంటివి ఉన్నాయా లేవా అనేవి తెలుసుకోవాలి. ఎకనమిక్ టైమ్స్ ప్రకారం ఈ ఖర్చులు మొత్తం అప్పును 2 నుంచి 5 శాతానికి పెంచుతాయి. ఆదాయ సామర్థ్యం: మనకు వచ్చే ఆదాయంలో అప్పును తిరిగి చెల్లించే సామర్థ్యం ఉందా లేదా అనేది ముందుగానే ఆలోచన చేసుకోవాలి. సామర్థ్యానికి మించి అప్పు.. ఆర్థిక సంక్షోభానికి దారి తీసే అవకాశం ఉందని నేషనల్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ హెచ్చరిస్తుంది. అప్పు రకం: మనకు ఉండే అవసరాన్ని బట్టే అప్పును ఎంచుకోవాలి. హౌస్ లోన్, పర్సనల్ లోన్, క్రెడిట్ కార్డ్.. వీటిలో ఏది అవసరమో దాన్నే ఎంపిక చేసుకోవాలి.



## తండ్రి మృతదేహాన్ని తరలిస్తూ.. బాధను తట్టుకోలేక కుమారుడు మృతి



**లక్నో-నవభూమి:** తండ్రి మరణించడాన్ని కుమారుడు తట్టుకోలేకపోయాడు. తండ్రి మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తుండగా బైక్‌పై అనుసరించాడు. ఆ బాధతో గుండెపోటుకు గురై మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ విషాద సంఘటన జరిగింది. మార్చి 20న కాన్పూర్‌లో నివసించే లయిక్ అహ్మద్ ఆరోగ్యం క్షీణించింది. దీంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.కాగా, తండ్రిని బాగా ఇష్టపడే చిన్న కుమారుడు అతిక్ ఆయన చనిపోయినట్లు డాక్టర్లు చెప్పడాన్ని నమ్మలేకపోయాడు. వెంటనే హార్ట్ స్పెషలిస్ట్‌లు ఉన్న మరో హాస్పిటల్‌కు అహ్మద్‌ను తరలించాడు. అయితే ఆయన మరణించినట్లు అక్కడి డాక్టర్లు కూడా నిర్ధారించారు. దీంతో అతిక్ వెక్కివెక్కి ఏడ్చాడు.మరోవైపు అహ్మద్ మృతదేహాన్ని హాస్పిటల్ నుంచి ఇంటికి అంబులెన్స్‌లో తరలించారు. అతిక్ బైక్‌పై ఆ వాహనాన్ని అనుసరించాడు. అయితే తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఆ బాధతో మార్గమధ్యలో అతిక్ గుండెపోటుకు గురై కుప్పకూలాడు. గమనించిన స్థానికులు అతడ్ని ఆసుపత్రికి తరలించగా చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు.

## అందులో తప్పేముంది..? : కునాల్ కమ్రా వ్యాఖ్యలపై ఉద్ధవ్ థాకరే



**ముంబై-నవభూమి:**మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిఏక్‌నాథ్ షిండే పై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వివాదాస్పద వ్యాఖ్యల దుమారం మరింత ముదురుతోంది. షిండేను 'ద్రోహి'గా కునాల్ అభివర్ణించాన్ని శివసేన చీఫ్ ఉద్ధవ్ థాకరే సమర్థించారు. ఆయనను 'ద్రోహి' అనడం తప్పేమీ కాదని అన్నారు.కునాల్ కమ్రా తప్పేమీ మాట్లాడలేదని, ద్రోహి అనడమంటే ఒకరిపై దాడి చేయడం కాదని ఉద్ధవ్ థాకరే తెలిపారు. అంతేగాక కునాల్ పూర్తి పాట వినాలని, మిగతా వారికి కూడా వినిపించాలని ఆయన సూచించారు. కునాల్ కమ్రా షో జరిగిన హొటల్‌పై దాడిలో తమ పార్టీ కార్యకర్తల ప్రమేయం లేదని చెప్పారు. అది 'గద్దర్ సేన' పని అని, ద్రోహం (గద్దర్) ఎవరి రక్తంలో ఉందో వాళ్లు ఎప్పుడూ శివసైనికులు కాలేరని వ్యాఖ్యానించారు.ఖార్ ప్రాంతంలోని ది యూనికాంటినెంటల్ హొటల్‌లోని హాబిటాట్ కామిడీ క్లబ్‌లో ఇటీవల కునాల్ కమ్రా షో జరిగింది. మహారాష్ట్ర రాజకీయాల గురించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివసేన నుంచి శివసేన బయటకు వచ్చిందని, ఎన్సీపీ నుంచి ఎన్సీపీ విడిపోయిందని అన్నారు. ఏక్‌నాథ్ షిండేను పరోక్షంగా ద్రోహిగా అభివర్ణిస్తూ.. 'దిల్ తో పాగల్ హై' అనే హిందీ పాటలోని చరణాలను రాజకీయ కోణంలో మార్చి పాడారు.అయితే కమ్రా వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. మహారాష్ట్ర డిప్యూటీ సీఎంను ద్రోహి అంటూ కామెడీ చేస్తారా..? ఇది కామెడీనా.. వల్గారిటీనా..? అంటూ శివసేన నేత షైనా ఎన్‌సీ మండిపడ్డారు. ఆ పార్టీ నేత ముర్జీ పటేల్ ఎంఐడీసీ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. కునాల్ కమ్రా వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన శివసేన కార్యకర్తలు కునాల్ షో సభావేదికను ధ్వంసం చేశారు.వారిపై కామెడీ క్లబ్ కేసు పెట్టింది. కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగి పలువురు శివసేన కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో వివాదంపై మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ థాకరే స్పందించారు. ఏక్‌నాథ్ షిండేను ద్రోహి అనడం తప్పెలా అవుతుందని అంటూ కమెడియన్ కునాల్ కమ్రాను సమర్థించారు.

## సౌరభ్ హత్య తర్వాత ముస్కాన్, సాహిల్ పొరపాట్లు.. ఆధారాలు మాయం కోసం ప్రయత్నాలు



**లక్నో-నవభూమి:** ఉత్తం ప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగిన హత్య కేసులో మరిన్ని ట్విస్టులు వెలుగులోకి వస్తున్నాయి. భర్త సౌరభ్ రాజ్‌పుత్‌ను దారుణంగా హత్య చేసిన తర్వాత భార్య ముస్కాన్ రస్తోగి, ప్రియుడు సాహిల్ శుక్లా కొన్ని పొరపాట్లు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. మార్చి 3 రాత్రివేళ సౌరభ్‌ను కత్తితో పొడిచి వారిద్దరూ చంపారు. ఆ తర్వాత మృతదేహాన్ని 15 ముక్కలుగా నరికారు. ఖాళీ ప్లాస్టిక్ డ్రమ్స్‌లో వాటిని ఉంచి తడి సిమ్మెంట్‌తో నింపారు. కొన్ని రోజుల తర్వాత ఆ డ్రమ్‌ను ఎక్కడోచోట పడేసి హత్య ఆనవాళ్లు, ఆధారాలు నాశనం చేయాలని ప్లాన్ వేశారు.కాగా, సౌరభ్ హత్య తర్వాత ముస్కాన్, సాహిల్ కలిసి హిమాచల్ ప్రదేశ్‌కు వెళ్లారు. రెండు వారాలపాటు అక్కడ ఎంజాయ్ చేసి రిలాక్స్ అయ్యారు. మార్చి 17న వారిద్దరూ మీరట్‌కు తిరిగి వచ్చారు. సౌరభ్ మృతదేహం భాగాలున్న డ్రమ్‌ను పడేసేందుకు ప్రయత్నించారు.మార్చి 18న ఆ డ్రమ్‌ను అక్కడి నుంచి తరలించేందుకు కొందరు కూలీలను ముస్కాన్ పిలిపించింది. అయితే సిమ్మెంట్ గట్టిపడటంతో ఆ డ్రమ్ చాలా బరువుగా మారింది. దీంతో కూలీలు దానిని ఎత్తలేకపోయారు. పలుసార్లు వారు ప్రయత్నించగా డ్రమ్ మూత ఊడిపోయింది. సౌరభ్ మృతదేహం భాగాలున్న దాని నుంచి దుర్వాసన వచ్చింది. అనుమానించిన కూలీలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.మరోవైపు ఈ పరిణామంతో ముస్కాన్ భయాందోళన చెందింది. వెంటనే తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. తొలుత సౌరభ్ సోదరి, ఆమె భర్తపై ఆ హత్యను మోపేందుకు ప్రయత్నించింది. అయితే ముస్కాన్ తల్లి గట్టిగా నిలదీయడంతో అసలు నిజం బయటపెట్టింది. సాహిల్‌తో కలిసి సౌరభ్‌ను హత్య చేసినట్లు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు ముస్కాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.కాగా, సౌరభ్ హత్య గురించి తెలుసుకున్న పోలీసులు షాక్ అయ్యారు. ముస్కాన్ ఇంటికి వారు చేరుకున్నారు. అక్కడున్న ప్లాస్టిక్ డ్రమ్‌ను కోశారు. సిమ్మెంట్‌తో ఉన్న మృతదేహం భాగాలను వెలికితీశారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ హత్యా కేసుపై మరింతగా దర్యాప్తు చేస్తున్నారు.

## విమానయాన సంస్థలకు డీజీసీఏ కీలక ఆదేశాలు..

**న్యూఢిల్లీ-నవభూమి:** విమానయాన సంస్థలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్స్ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. విమానయాన సంస్థలకు కస్టమర్స్ హక్కులు, నియమ నిబంధనలకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. టికెట్ బుక్ చేసుకున్న తర్వాత.. అందుబాటులో ఉన్న ప్రయాణికుల చార్టర్ ఆన్‌లైన్ లింక్‌ను ప్రయాణికుడికి ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా పంపాలని డీజీసీఏ అన్ని విమానయాన సంస్థలకు సూచించింది. ఇకపై ప్రయాణికులు విమాన టికెట్స్‌ను బుక్ చేసుకున్న సమయంలోనే వారి హక్కులు, సౌకర్యాలకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకునే వీలు కలుగనున్నది.డీజీసీఏ ఆదేశాల ప్రకారం.. అన్ని విమానయాన సంస్థలు టికెట్లను బుక్ చేసుకున్న తర్వాత ప్రయాణికులకు ఆన్‌లైన్ లింక్ ద్వారా తమ హక్కుల గురించి తెలియజేయాల్సి ఉంటుంది. ఈ లింక్‌లో ప్రయాణికుల హక్కులు, నియమాలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన పూర్తి సమాచారం ఉండనున్నది. తద్వారా ప్రయాణికులు ఏదైనా సమస్యను సులభంగా పరిష్కరించుకునే అవకాశంతో పాటు విమాన ప్రయాణ సమయంలో పొందే హక్కుల గురించి స్పష్టమైన సమాచారం లభించనుంది. ఎందుకంటే సాధారణంగా ప్రయాణీకులు విమానాల రద్దు, బోర్డింగ్ తిరస్కరణ, బ్యాగేజ్ మిస్సింగ్, బ్యాగేజ్ మిస్సింగ్ లాస్ సమయాల్లో సమస్యలు ఎదుర్కొంటారు. చాలా మంది ప్రయాణికులకు ఆయా పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఎదురవుతుంది.

# రాహుల్ గాంధీకి భారత పౌరసత్వం లేదా..



**న్యూఢిల్లీ-నవభూమి:**కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి రెండు దేశాల పౌరసత్వం ఉందా? అసలు రాహుల్ గాంధీ భారత పౌరుడు కాదా? కాంగ్రెస్ పార్టీ ఎంపీ, రాహుల్ గాంధీ పౌరసత్వం గురించి గత కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఆయనకు రెండు దేశాల పౌరసత్వం ఉందా? లేదా ఆయన భారత పౌరుడు కాదా అని గత కొన్ని సంవత్సరాలుగా అనేక మందికి సందేహాలు వచ్చాయి. తాజాగా, ఈ అంశంపై అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ కీలక నిర్ణయం తీసుకోవాలని హోం మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ఈ అంశంపై కర్ణాటకకు చెందిన ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అందులో రాహుల్ గాంధీ విదేశీ పౌరసత్వాన్ని నిరూపించగల ఈమెయిల్‌లు తన వద్ద ఉన్నాయని పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి పేర్కొన్నాడు.

కోర్టు ఆదేశాలు..అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్, ఈ కేసు విచారణలో హోం మంత్రిత్వ శాఖకు నాలుగు వారాల సమయం ఇచ్చింది. ఈ సమయంలో, హోం మంత్రిత్వ శాఖ ఈ అంశంపై సమగ్రంగా పరిశీలించి, నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ కేసు తదుపరి విచారణ తేదీని ఏప్రిల్ 21, 2024గా నిర్ణయించారు. ఈ సమయంలో, హోం మంత్రిత్వ శాఖ ఎనిమిది వారాల సమయం కోరింది. దీంతో ఈ కేసు పరిణామాలు మరింత ఆసక్తికరంగా ఉంటాయనిపిస్తుంది.

విచారణలో భాగంగా..గతంలో కూడా ఆయన పౌరసత్వం గురించి అనేక ఆరోపణలు వచ్చాయి. అయితే, ఈసారి అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఈ అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని హోం మంత్రిత్వ శాఖకు నాలుగు వారాల సమయం ఇచ్చింది. ఈ కేసు విచారణలో, రాహుల్ గాంధీ పౌరసత్వం గురించి ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి అవసరమైన సమాచారాన్ని సమర్పించాలని కోర్టు ఆదేశించింది.

పిటిషన్ దాఖలు..ఈ పిటిషన్‌ను కర్ణాటక బీజేపీ కార్యకర్త శిశిర్ దాఖలు చేశారు. ఆయన తన వద్ద ఉన్న రహస్య ఈమెయిల్ల ఆధారంగా రాహుల్ గాంధీ విదేశీ పౌరసత్వాన్ని నిరూపించవచ్చని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి చెందిన ప్రత్యక్ష సమాచారం కూడా అందిందని ఆయన తెలిపారు. ఈ పిటిషన్ దాఖలు చేయడం ద్వారా రాహుల్ గాంధీ పౌరసత్వం గురించి ఉన్న అనుమానాలను స్పష్టంగా చర్చించాలనుకుంటున్నారు.

**రాజకీయంగా ప్రభావం**

ప్రస్తుతం రాహుల్ గాంధీ పౌరసత్వ వివాదం రాజకీయంగా దుమారం రేపనుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఈ అంశాన్ని తమకు అనుకూలంగా ఉపయోగించుకోవాలని చూస్తుండగా.. బీజేపీ మాత్రం ఈ అంశం గురించి మరింత గట్టిగా ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఈ కేసు పరిణామాలు, రాహుల్ గాంధీ రాజకీయ భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపించే అవకాశం ఉంది.

## ప్రయాణికులతో కిక్కిరిసిన ఢిల్లీ రైల్వే స్టేషన్..
# మరోసారి తొక్కిసలాట వదంతులు




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధాని న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ ఆదివారం రాత్రి ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. పలు రైళ్ల ఆలస్యంతో 12, 13 నెంబరు ప్లాట్‌ఫాంలపై తీవ్రమైన రద్దీ నెలకుంది. దీంతో ఒకానొక సమయంలో పరిస్థితి అదుపు తప్పింది. తొక్కిసలాటకు దారితీసే అవకాశం ఉందని భావించిన అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. దీంతో ఆ రెండు ప్లాట్‌ఫాంలపైకి ప్రయాణికులు వెళ్లకుండా నిలిపివేశారు. సాధారణ స్థితికి చేరుకోవడం అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే, అప్పటికే తొక్కిసలాట చోటుచేసుకున్నట్టు వదంతులు వ్యాపించాయి. ఈ ప్రచారంపై స్పందించిన పోలీసులు.. ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదని, చిన్న గాయం కూడా కాలేదని తెలిపారు. ఆర్పీఎఫ్ కమాండెంట్, స్టేషన్ డైరెక్టర్ వంటి ఉన్నతాధి కారు లు జోక్యం చేసుకుని.. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చినట్టు వివరించారు. మరోవైపు, రైల్వే మంత్రిత్వ శాఖ సైతం స్పందించింది. భారీ రద్దీ నెలకున్నప్పటికీ ఎలాంటి తొక్కిసలాటగానీ, ప్రమాదకర పరిస్థితి గానీ తలెత్తలేదని పేర్కొంది. కాగా, గంగా, స్వతంత్ర సేనాని, జమ్మూ రాజధాని, లక్నో మెయిల్, మగధ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు.. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌కు అలస్యంగా చేరుకున్నాయి. ఒకేసారి ఐదు రైళ్లు ఆలస్యం కావడం వల్ల అందులో వెళ్లాల్సిన ప్రయాణికులు 12, 13 నెంబరు ప్లాట్‌ఫాంలపైకి భారీగా చేరుకోవడంతో గందరగోళం నెలకుంది. దీంతో రంగంలోకి దిగిన ఆర్పీఎఫ్ సిబ్బంది చర్యలు చేపట్టారు. రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టి.. ఆ రెండు ప్లాట్‌ఫామ్‌లకు వెళ్లే మార్గాలను మూసివేశారు.

విపరీతమైన రద్దీతో భయాందోళనలకు గురైనట్టు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఫిబ్రవరి 15న ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళాకు వెళ్లే భక్తులు భారీగా పోటెత్తడంతో తొక్కిసలాటకు దారితీసి 18 మంది మృతిచెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ నేపథ్యంలో మళ్లీ అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా రైల్వే అధికారులు ముందే అప్రమత్తమయ్యారు. రద్దీని నియంత్రించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆలస్యమైన రైళ్లు స్టేషన్ నుంచి బయలుదేరడంతో రద్దీ సాధారణ స్థితికి చేరుకుంది. అయితే, ప్రయాణికులు బారికేడ్లపై నుంచి దూకి పరుగెత్తడం, క్యూలైన్‌లో ఒకరినొకరు తోసుకోవడం కనిపించింది. సోషల్ మీడియాలో దీనిపై వదంతులు వ్యాపించాయి.

## ట్రంప్ కోడలితో ప్రేమలో టైగర్ వుడ్స్.. ఎవరీ వన్నేసా?



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రముఖ గోల్ఫ్ ఆటగాడు టైగర్ వుడ్స్.., అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ కొడలితో డేటింగ్ వార్తలపై స్పందించారు. జూనియర్ ట్రంప్ భార్య వన్నెసా ట్రంప్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు వుడ్స్ తాజాగా ధ్రువీకరించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. 'మా ప్రేమ గాలిలో ఉంది. జీవితంలో ఒకరికి ఒకరు తోడుగా ఉండటం చాలా ఆనందంగా ఉంది... మా జీవిత ప్రయాణం సంతోషంగా సాగాలని కోరుకుంటున్నాం... ఈ సమయంలో మా శ్రేయాభిలాషుల నుంచి మరింత గోప్యతను ఆశిస్తున్నాం.. ప్రేమ అనేది ఒక అందమైన అనుభూతి... ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించాలని నిర్ణయించుకున్నప్పుడు వారి జీవితం మరింత మెరుగ్గా ఉంటుంది... తమ జీవిత ప్రయాణంలో ఒకరికొకరు తోడుగా ఉండాలని అనుకుంటున్నాం' అని వుడ్స్ ఎక్స్‌లో వెన్నెసాతో ఉన్న ఫోటోలను షేర్ చేశారు.టైగర్ వుడ్స్, డొనాల్డ్ ట్రంప్ జూనియర్ మాజీ భార్య వనెస్సా ట్రంప్‌తో కలిసి శాన్ డియాగోలోని టోరీ పైన్స్‌లో తొలిసారి కనిపించారు. తన కుమార్తె కైతో కలిసి జెనెసిస్ ఇన్విటేషనల్ గోల్ఫ్ టోర్నీ ముగింపునకు వచ్చినప్పుడు వుడ్స్, వన్నెసా మొదటిసారి కలిశారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడి.. సహజీవనానికి దారితీసింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఈ వారం బెంజిమిన్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి వుడ్స్ పిల్లలు శామ్, చార్లీతో కలిసి ట్రంప్ మనవరాలు కై హాజరైంది. దీంతో వుడ్స్, వన్నెసా రిలేషన్‌షిప్ వార్తలకు మరింత బలం చేకూరింది. తాజాగా, వుడ్స్ దీనిని అధికారికంగా ధ్రువీకరించారు.

డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌తో వెన్నెసాకు 12 ఏళ్ల కిందట వివాహం కాగా.. ఈ జంటకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. కాగా, టైగర్ వుడ్స్ తన వ్యక్తిగత జీవితాన్ని రహస్యంగా ఉంచుతారు. కానీ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తూ.. వన్నేశాతో తన సంబంధాన్ని బహిరంగంగా ధ్రువీకరించారు. 2013లో లిండ్సే వాన్తో కలిసి దిగిన ఫోటోలను పంచుకున్న వుడ్స్.. అప్పుడు ఆమెతో డేటింగ్ చేస్తున్నట్లు ప్రకటించాడు. తన పిల్లల భద్రత గురించి ఇలా చేయాల్సి వచ్చిందని వివరించారు.కాగా, పలువురి మహిళలతో తన భర్త వివాహేతర సంబంధాలు వెలుగులోకి రావడంతో భార్య ఎలిన్ నొర్డెగ్రెన్.. 2010లో వుడ్స్ నుంచి విడాకులు తీసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఆ తర్వాత ఎరికా హెర్మన్‌తో ఏడేళ్ల పాటు సహజీవనం చేశారు. ఈ జంట 2022లో విడిపోయింది. అయితే, ఈ సమయంలో వివాదం తలెత్తడంతో కోర్టుల్లో కూడా వ్యాజ్యాలు నడిచాయి. చివరకు ఇరువురీ రాజీకి రావడంతో వివాదం ముగిసింది.

## డేటా చౌర్యం ఆరోపణలు.. ఖతార్‌లో టెక్ మహీంద్రా ఉద్యోగి అరెస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత్‌కు చెందిన టెక్ మహీంద్రా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను డేటా చోర్యం ఆరోపణలతో ఖతార్ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుజరాత్‌లోని వడోదరకు చెందిన టెక్ మహీంద్ర సీనియర్ అమిత్ గుప్తాను జనవరి 1న అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై తాజాగా స్పందించిన ఆ సంస్థ.. అమిత్ గుప్తాతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపింది. సంస్థలో పనిచేసే ఉద్యోగుల బాగోగులు చూసుకోవడం తమ బాధ్యతని పేర్కొంది. ఈ కష్టకాలంలో అమిత్ కుటుంబానికి మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చింది. అమిత్‌ను విడుదల చేయించడానికి ఇరుదేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నామని వెల్లడించింది. గతంలో ఇలాగే భారత నేవీ అధికారులను ఖతార్ బంధించింది. కాగా, ఇప్పటికే ఈ అంశంపై ఖతార్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. అమిత్ గుప్తాను విడిపించడానికి ఖతార్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. తప్పుడు ఆరోపణలతో అదుపులోకి తీసుకున్నారని, దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొంది. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. కానీ, ఈ కేసుకు అసలు కారణం ఏంటనేది ఇంకా తెలియరాలేదు. అయితే, తమ కుమారుడ్ని ఖతార్ ప్రభుత్వ భద్రతా సిబ్బంది అరెస్ట్ చేశారని అమిత్ తండ్రి అన్నారు. తప్పుడు ఆరోపణలతో తమ కుమారుడ్ని అరెస్ట్ చేశారని, తక్షణమే వదలిపెట్టాలని కోరారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి కార్యాలయం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అమిత్ తల్లి మాట్లాడుతూ.. తన కొడుకు ఖతార్‌లోని టెక్ మహీంద్రా కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నట్టు తెలిపారు. డేటా చోర్యం ఆరోపణలతో జనవరి 1న ఖతార్ పోలీసులు అరెస్ట్ చేశారని, 48 గంటల పాటు నీరు, ఆహారం ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దోహాలో మూడు నెలలుగా బంధించి ఉంచారని, తమ కుమారుడు నిర్దోషి అని అన్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులో అమిత్‌ను ఇరికించారని ఆమె ఆరోపించారు. సంస్థలో ఎవరో చేసిన తప్పునకు ఖతార్- కువైట్ రీజియన్ హెడ్ స్థానంలో ఉన్న అమిత్‌ను అరెస్ట్ చేశారని వాపోయారు.

అరెస్ట్ గురించి తమకు సమాచారం ఇవ్వడానికి కూడా ప్రయత్నించలేదని చెప్పారు. కొద్ది రోజులుగా తమతో మాట్లాడకపోవడంతో అనుమానం వచ్చి అమిత్ స్నేహితుడికి ఫోన్ చేయడంతో ఈ విషయం తెలిసిందని వివరించారు. వెంటనే దోహాకు వెళ్లి ఎంబసీ అధికారులను కలిశానని.. అయినా ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని అన్నారు. అమిత్ గురించి వడోదర ఎంపీ హేమాంగ్ జోషిని కలిసి.. విడుదలకు సాయం చేయాలని కోరానని, ఉన్నతాధికారుల దృష్టికి దీనిని తీసకువెళ్తానని ఆమె హామీ ఇచ్చారన్నారు.

బీజేపీ ఎంపీ హేమాంగ్ జోషి మాట్లాడుతూ.. అమిత్ గుప్తా గత పదేళ్లుగా టెక్ మహీంద్రా ఖతార్ కేంద్రంలో ఉద్యోగం చేస్తున్నాడని అన్నారు. అరెస్టైన విషయం తెలిసి.. దోహాకు వెళ్లిన తల్లిదండ్రులు, అక్కడ నెల రోజుల పాటు ఉండి అతడ్ని కలవడానికి ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదని వివరించారు. విదేశాంగ అధికారులు దీనిపై స్పందిస్తూ అమిత్ గుప్తా అరెస్ట్‌పై ఖతార్ విదేశాంగ శాఖతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. అతడ్ని విడిపించడానికి అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కాగా, ఖతార్‌లో 2022 నుంచి భారతీయుడ్ని అదుపులోకి తీసుకోవడం ఇది రెండోసారి. 2022లో 8 మంది నేవీ అధికారులను అరెస్ట్ చేయగా.. వారికి 2023లో మరణశిక్ష ఖరారు చేశారు. కానీ, ఖతార్ కోర్టు వారి శిక్షలను రద్దుచేయగా.. ఎమిర్ ఆదేశాలతో ఫిబ్రవరి 2024లో వీరిని విడుదల చేయడంతో భారత్‌కు చేరుకున్నారు.

## ఆగ్రహంతో ఊగిపోతూ వస్తువులు విసిరి, మహిళను కొట్టి. పాస్టర్ అరాచకం..

**పంజాబ్-నవభూమి:**లైంగిక వేధింపుల ఆరోపణల ఎదుర్కొంటోన్న పంజాబ్‌కు చెందిన మతబోధకుడికి సంబంధించిన షాకింగ్ వీడియో వెలుగులోకి వచ్చింది. తన ఆఫీసులో ఉన్నవారిపై తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ.. వాళ్లను నోటికొచ్చినట్టి తిడుతూ.. వస్తువులు విసిరేస్తూ నానా హంగామా సృష్టించాడు. అంతటితో ఆగకుండా అక్కడ ఉన్న ఓ యువకుడితోపాటు మహిళలపైనా చేయిచేసుకుని దురుసుగా ప్రవర్తించాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతోంది. అతడిపై పంజాబ్ పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదుచేసిన కొద్ది రోజుల్లోనే ఈ వీడియో వెలుగులోకి రావడం గమనార్హం.జలంధర్‌కు చెందిన మతబోధకుడు బాజిందర్ సింగ్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఓ యువతి (22) కపుర్తలా పోలీసులకు గత నెలలో ఫిర్యాదు చేసింది. 'చర్చ్ ఆఫ్ గ్లోరీ అండ్ విస్డమ్' పేరుతో నిర్వహించే ప్రార్థనా స్థలానికి తన తల్లిదండ్రులతో కలిసి 2017 నుంచి 2023 వరకు వెళ్లామని, 2022లో ఓసారి తన ఫోన్ నంబర్ తీసుకొని వేధించసాగాడని ఆమె ఆరోపించింది. అంతేకాదు, ఆదివారాల్లో తన క్యాబిన్‌కు పిలిపించుకుని, చాలా అసభ్యంగా ప్రవర్తించేవాడని వాపోయింది. ఆ విషయాన్ని బయటికి చెబితే తన తల్లిదండ్రులకు హానితలపెడతానని బెదిరించాడని తెలిపింది."నేను కాలేజీకి వెళ్లేటప్పుడు అతడి మనుషుల్ని కార్లలో వచ్చి నన్ను అనుసరించేవారు... మీ నాన్న ఇంటికి తిరిగి రాకూడదని కోరుకుంటున్నావా? మీ అమ్మ చర్చి నుంచి ప్రాణాలతో రాకూడదని కోరుకుంటున్నా? అని బెదిరించేవాడు... తీవ్ర నిరాశకు గురైన నేను ఆ కష్టాలను ఎవరితోనూ పంచుకోలేకపోయాను' అని ఆ యువతి మీడియా ముందు తన గోడు వెళ్లబోసుకుంది. నల్లమందు, మహిళల అక్రమ రవాణాకు పాల్పడుతుంటాడని ఆమె ఆరోపించింది.దీంతో మతబోధకుడిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు, ఈ వ్యవహారాన్ని పంజాబ్ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. బాధితురాలి కుటుంబానికి భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది. అటు, జాతీయ మహిళా కమిషన్ కూడా స్పందిస్తూ.. వేగంగా చర్యలు తీసుకోవాలని పంజాబ్ పోలీసులకు ఆదేశాలు జారీచేసింది.ఇక, వైరల్ అవుతోన్న వీడియోలో తన ఆఫీసులోని వస్తువులను అక్కడున్నవారిపై విసిరికొట్టి.. చెంపపై కొట్టడం స్పష్టంగా కనిపిస్తోంది. ముందు ఓ యువకుడ్ని కొట్టిన అతడు.. అనంతరం ఓ మహిళపై ఆగ్రహంతో ఊగిపోయాడు. ఆ తర్వాత ఆమెపై ఓ పుస్తకం లాంటిది విసిరాడు. ఆమె దీన్ని అడ్డుకుంటే మరింత రెచ్చిపోయి చెంపలు వాయించడం మొదలుపెట్టాడు. అతడి చర్యలు అక్కడున్నవారు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆఫీసులోని సీసీటీవీ కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి.హర్యానాలోని జాట్ కుటుంబానికి చెందిన బాజిందర్ సింగ్.. పదేళ్ల కిందట మతబోధకుడి అవతారం ఎత్తాడు. 'చర్చ్ ఆఫ్ గ్లోరీ అండ్ విస్డమ్' పేరుతో జలంధర్, మొహాలిలలో ప్రార్థనా స్థలాలు ఏర్పాటు చేశాడు. తక్కువ సమయంలో సింగ్ పేరు జనాల్లోకి వెళ్లింది. అతడికి సోషల్ మీడియాలోనూ లక్షలాది ఫాలోవర్లు ఉన్నారు. అయితే, గతంలోనూ బాజిందర్ అనేక ఆరోపణలు ఎదుర్కొన్నాడు.జిరాక్‌పూర్‌కు చెందిన ఓ మహిళ అతడిపై లైంగిక వేధింపుల ఆరోపణల చేయడంతో 2018లో కేసు నమోదైంది. దీంతో లండన్‌కు వెళ్తున్న అతడ్ని ఢిల్లీ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇటీవలే మొహాలి కోర్టు వారెంటు సైతం జారీచేసింది. అలాగే, అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమార్తెకు నయం చేస్తానని సింగ్ డబ్బులు వసూలుచేసినట్టు ఢిల్లీకి చెందిన భార్యాభర్తలు 2022లో అతడిపై ఫిర్యాదు చేశారు.. 2023లో సింగ్ ఆఫీసు, నివాసంలో ఆదాయపు పన్ను సోదాలు కూడా నిర్వహించారు.

## భార్యతో గొడవ పెట్టుకుని.. ఆమె కళ్ల ముందే రైలు కిందపడి..!



**మాధోపూర్-నవభూమి:**క్షణికావేశంలో ఓ వ్యక్తి తన ప్రాణం తీసుకున్నాడు. భార్యతో గొడవ పెట్టుకుని, ఆమె వారిస్తున్నా వినకుండా తన కళ్ల ముందే కదులుతున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజస్థాన్ రాష్ట్రంలోని సవాయ్ మాధోపూర్ జిల్లా లో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకి వెళ్తే.. దిల్‌రాజ్ మీనా అనే 23 ఏళ్ల యువకుడు ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. భార్యాభర్త ఇద్దరూ కోటాలోని బాలాజీకి బాగ్చీ ఏరియాలో ఉంటూ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్షల కోసం సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వాట్సాప్ స్టేటస్ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో తాను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటాననంటూ దిల్‌రాజ్ ఇంట్లోంచి పరుగులు తీశాడు.దాంతో అతడి భార్య కూడా దిల్‌రాజ్ వెంటే పరుగెత్తుకుంటూ వెళ్లింది. రైల్వే ట్రాక్ వెంట పరుగెడుతున్న భర్తను వారిస్తూ, వద్దూవద్దూ అని గట్టిగా అరుస్తూ అతడిని అనుసరించింది. ఇంతలో ఎదురుగా రైలు రావడంతో ఆమెకు కొన్ని మీటర్ల దూరంలో ఆ రైలు కింద దూకి దిల్‌రాజ్ ఆత్మహత్య చేసుకున్నాడు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ మంగళవారం 25 । మార్చి । 2025

## బాలయ్య అభిమానులకి గుడ్ న్యూస్.. వారం ముందుగానే..



నందమూరి బాలకృష్ణకి ఏ రేంజ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన నటించిన సినిమాలు ప్రేక్షకులకి మాంచి కిక్ ఇస్తుంటాయి. అయితే బాలయ్య నటించిన చిత్రాలలో ఆదిత్య 369 చిత్రం చాలా స్పెషల్ అనే చెప్పాలి. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రం 1991లో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అయితే ఈ మూవీకి సీక్వెల్ ఉంటుందని, బాలయ్య గతంలో పలు సందర్భాలలో చెప్పుకొచ్చారు. అది కూడా 999 మ్యాక్స్ పేరుతో రానుందని అన్నారు. ఈ మూవీ కోసం కూడా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఆదిత్య 369 చిత్రం టైమ్ ట్రావెల్ సైన్స్ ఫిక్షన్ మూవీగా తెరకెక్కి అప్పట్లో ప్రేక్షకులకి మంచి వనోదం పంచింది. ఇప్పటికీ ఈ చిత్రం టీవీలో వస్తే ప్రేక్షకులు అస్సలు మిస్ కారు. అయితే శ్రీదేవీ మూవీస్ సంస్థ నిర్మించిన ఈ చిత్రాన్ని మూడు దశాబ్దాల తరువాత మరోసారి థియేటర్లలోకి తీసుకువచ్చేందుకు ప్లాన్ చేశారు. 4%ఖ% డిజిటలైజేషన్, 5.1 సౌండ్‌తో మరింత అధునాతనంగా ఏప్రిల్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకున్నారు. అయితే బాలయ్య అభిమానుల ఉత్సాహం చూసి ఈ చిత్రాన్ని వారం రోజుల ముందుగానే ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్లు నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 4న ఆదిత్య 369 చిత్రాన్ని భారీ ఎత్తున రీ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవలి కాలంలో చాలా మంది హీరోల సినిమాలు రీరిలీజ్ అయి మంచి విజయాన్ని సాధిస్తున్నాయి.



## ఇండియన్ సినిమాలకు రావాల్సిన గుర్తింపు రావట్లేదు

సినీ ఇండస్ట్రీలోనే అన్నిటికంటే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు అంటే ఆస్కార్. ఈ అవార్డు కోసం ప్రతీ ఒక్క టెక్నీషియన్ కలలు కంటూ ఉంటారు. నటీనటుల దగ్గర్నుంచి సాంకేతిక నిపుణుల వరకు అందరూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం కోసం కష్టపడుతూ ఉంటారు. తాజాగా ఈ ఆస్కార్ అవార్డ్స్ గురించి హీరోయిన్ దీపికా పదుకొణె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలో ఎంతోమంది ప్రతిభావంతులైన నటీనటులున్నారని దీపికా ఈ సందర్భంగా తెలిపారు. రీసెంట్ గా దీపిక తన ఇన్‌స్టాలో ఓ వీడియోను షేర్ చేస్తూ అందులో ఆస్కార్ అవార్డుల గురించి తన పర్సనల్ ఒపీనియన్ ను షేర్ చేశారు. ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో ఎన్నో గొప్ప గొప్ప కథలు తెరకెక్కాయని దీపికా ఈ సందర్భంగా తెలిపారు. %ూశ్రీంశీ =ఖుఐ% - జాట్ ట్రైలర్.. బాలీవుడ్ లో గోపిచంద్ ఆటమ్ బాంబ్! ఎన్నో గొప్ప కథలు ఇండియన్ సినిమా అందించినప్పటికీ ఆ కథలకు, సినిమాలకు, నటీనటులకు రావాల్సిన గుర్తింపు రాలేదని, ఎన్నో సందర్భాల్లో భారతీయులు అందుకోవాల్సిన ఆస్కార్ ను మన నుంచి దూరం చేశారని దీపిక అభిప్రాయపడ్డారు. ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు సాంగ్ కు ఆస్కార్ అనౌన్స్ చేసినప్పుడు తాను అక్కడే ఆడియన్స్ లో కూర్చున్నానని, ఆ టైమ్ లో తానెంతో ఎమోషనల్ అయినట్టు దీపిక చెప్పుకొచ్చారు. ఆర్ఆర్ఆర్ సినిమాకూ, తనకూ ఎలాంటి సంబంధం లేదని, కేవలం ఓ ఇండియన్ గా మాత్రమే తనకు ఆ క్షణంలో గర్వంగా, ఆనందంగా అనిపించిందని, ఆ గొప్ప క్షణాలను తానెప్పటికీ మర్చిపోలేనని దీపిక తెలిపారు. ఈ ఇయర్ ది బ్రూటలిస్ట్ సినిమాకు గానూ ప్రముఖ యాక్టర్



అడ్రియన్ బ్రాడీకి బెస్ట్ యాక్టర్ గా ఆస్కార్ రావడం తనకెంతో సంతోషాన్ని కలిగించిందిందని దీపిక షేర్ చేసింది. ఇక ఆర్ఆర్ఆర్ విషయానికొస్తే జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ హీరోలుగా నటించిన ఈ సినిమాకు దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన ఆర్ఆర్ఆర్ కు ఎం.ఎం కీరవాణి సంగీతం అందించగా, ఆ సినిమాలోని నాటు నాటు సాంగ్ కు ఆస్కార్ అవార్డు వరించిందనే విషయం తెలిసిందే.

## రాజాసాబ్ టీజర్ కట్ రెడీ.. ఎలా ఉంటుందంటే..



ప్రభాస్ సినిమాలు ఇటీవల కాలంలో పాన్ ఇండియా రేంజ్ ను దాటి మార్కెట్ లో ఒక సంచలనం క్రియేట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈమధ్య మద్య 'సలార్' రీ రిలీజ్ తో పండగ చేసుకున్న అభిమానుల్లో ఎనర్జీ పెరిగింది. ఇప్పుడు అదే ఉత్సాహాన్ని 'ది రాజాసాబ్' సినిమాతో రెట్టింపు చేయబోతున్నారు. ఈసారి ప్రభాస్‌తో మాస్ పండుగ చ్రూపించాలన్నదే దర్శకుడు మారుతి ప్లాన్. ఈ సినిమా ఫ్యామిలీ, హర్రర్, కామెడీ ఎలిమెంట్స్‌తో కూడిన ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నా, ఇప్పుడు మాత్రం సినిమా టీజర్ కోసం అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మారుతి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాలో ప్రభాస్ లుక్‌కి ఇప్పటికే మంచి క్రేజ్ ఏర్పడింది. అలాగే ఒక కింగ్ హారర్ లుక్ కూడా వైబ్ పెంచింది. మారుతి స్టైల్ కామెడీకి ప్రభాస్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా మిక్స్ అవుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాకి సంబంధించి ఇటీవలే మేకర్స్ ఓ రఫ్ టీజర్ కట్ సిద్ధం చేశారు. ఈ టీజర్‌ను ఇండస్ట్రీలోని కొంతమంది సన్నిహితులకు దర్శకుడు మారుతి ప్రివ్యూ చేయడం జరిగింది. టీజర్‌లో ప్రభాస్ చెప్పే ఓ డైలాగ్.. లేటెస్ట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌కి దగ్గరగా ఉంటుందని తెలుస్తోంది. అలాగే ఈ టీజర్‌లో ఓ స్పెషల్ షాట్ ఉందట. అందులో థ్రిల్, స్టైల్, డ్యాన్స్ స్టెప్.. మూడూ కలిపి ఉన్నాయట. ఇది మారుతి ఇమాజినేషన్‌కు నిదర్శనంగా మారిందంటూ ప్రివ్యూ చూసినవారు కామెంట్స్ చేస్తున్నారు. ఈ షాట్ అభిమానుల్లో పూనకాలెత్తేలా ఉందని ఫీడ్‌బ్యాక్ రావడంతో మేకర్స్ టీజర్ రిలీజ్ టైమ్‌పైనా మెల్లిగా ప్రణాళిక వేసుకుంటున్నారు. ఫ్యాన్స్‌కి ఇది 'నెవర్ బిఫోర్' ప్రభాస్ ట్రీట్ అవుతుందని టాక్ బలంగా ఉంది. గతంలో ఇది హారర్ టచ్‌లో మిక్స్ కామెడీగా ఉంటుందని ఊహించినవారికి, ఇప్పుడు మాత్రం విజువల్ ట్రీట్‌తో మరో లెవల్‌లో మాస్ యాంగిల్ కనిపిస్తోంది. %ూశ్రీంశీ =ఖుఐ% - మెగా పవర్ స్టార్ మార్చ్ బెటర్ అంటున్నాడా? ప్రస్తుతం ప్రభాస్ లైన్ అప్ చూసుకుంటే ఆయన ఖాళీ లేకుండా సినిమాలు చేస్తూ ఫ్యాన్స్‌కి ట్రీట్స్ ఇస్తున్నారని అర్థమవుతుంది. 'ది రాజాసాబ్' తర్వాత హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే పీరియాడిక్ యాక్షన్ డ్రామాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. ఆ తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్, తర్వాత నాగ్ అశ్విన్ డైరెక్షన్‌లో 'కల్కి 2898 ఏడి' ఫైనల్ పార్ట్, ఆ తర్వాత ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో సలార్ సీక్వెల్ మొదలవుతుంది. అలాంటి బిరుదులు జనాలు ఇవ్వాలి: మోహన్ లాల్ ఇప్పటికే 'కన్నప్ప'లో అతిథి పాత్ర చేసిన ప్రభాస్‌ఈ ఏడాది జూన్/జులై లో 'ది రాజాసాబ్' తో అభిమానుల్ని థియేటర్‌కి దించబోతున్నారు. ఇప్పటి దాకా వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను బట్టి చూస్తే, మారుతి %-% ప్రభాస్ కాంబినేషన్‌కి మంచి ఊపు వస్తోంది. మొదట్లో కొన్ని అనుమానాలు ఉన్నా, ఇప్పుడు మాత్రం టీజర్ రఫ్ కట్ చూసినవారంతా ఫుల్ పాజిటివ్ ఫీల్‌తో ఉన్నారు. ముఖ్యంగా డైలాగ్స్, బాడీ లాంగ్వేజ్, లుక్ అన్నీ కాంబినేషన్‌గా ప్రభాస్‌ని మాస్ మూడ్‌లో చూపించబోతున్నారని చెప్పవచ్చు. ఇక టీజర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందో అని ఫ్యాన్స్ ఇప్పుడు కౌంట్‌డౌన్ మొదలుపెట్టేశారు.

## కేతిక అప్పుడే ఐటెమ్ సాంగ్ చేయాల్సింది



సినీ ఇండస్ట్రీలో ఏ అవకాశం ఎవరి నుంచి ఎవరికి వెళ్తుందో చెప్పలేం. ఒకరు చేయాల్సిన సినిమాను మరొకరు చేయడం, ఆ సినిమా హిట్ అయ్యాక అది నేను చేయాల్సిన సినిమా అని సదరు ఆర్టిస్టులు చెప్తుండటం చాలా కామన్. ఏ సినిమా ఎవరికి రాసి పెట్టి ఉంటే వాళ్లే ఆ సినిమాను చేస్తారని, ఆ సినిమా వాళ్లదే అవుతుందనేది మాత్రం వాస్తవం. అలానే కేతిక శర్మ చేయాల్సిన ఓ స్పెషల్ సాంగ్ ను సమంత చేసి నేషనల్ వైడ్ లో గుర్తింపు తెచ్చుకున్న వైనాన్ని మైత్రీ నిర్మాత రవి శంకర్ తాజాగా వెల్లడించాడు. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన రాబిన్‌హుడ్ సినిమా మార్చి 27న రిలీజ్ కానున్న సందర్భంగా ఆదివారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ఆయన ఈ విషయాన్ని బయటపెట్టారు. బాలీవుడ్ లో గోపిచంద్ ఆటమ్ బాంబ్! రాబిన్‌హుడ్ సినిమాలో కేతిక శర్మ అదిదా సర్‌ప్రైజు అనే స్పెషల్ సాంగ్ చేసి నెట్టింట రచ్చ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఇదే సాంగ్. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత ఆ ఆనందాన్ని తెలుపుతూ కేతిక పుష్ప సినిమాలోనే ఐటెమ్ సాంగ్ చేయాల్సిందనే విషయాన్ని తెలిపారు. పుష్ప సినిమాలో ఐటెం సాంగ్ కోసం సమంత కంటే ముందే కేతికను అనుకున్నామని, కానీ అప్పుడది మిస్ అయిందని, మళ్లీ ఇన్నేళ్లకు కేతిక తో వర్క్ చేసే ఛాన్స్ దక్కిందని, ఈ సినిమాలో కేతిక సాంగ్ ఉన్నందుకు చాలా హ్యాపీగా ఉందంటూ రవి శంకర్ తెలిపారు. అన్నీ బావుండి కేతిక పుష్ప సినిమాలో ఊ కొడతారా సాంగ్ చేసి ఉంటే ఈ రోజు అమ్మడి స్థాయి వేరేలా ఉండేదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు రాబిన్‌హుడ్ సినిమా వాస్తవానికి రష్మిక మందన్నా చేయాల్సింది. ఆమెను హీరోయిన్ గా అనుకునే సినిమాను అనౌన్స్ చేశారు. కానీ రష్మిక పలు ప్రాజెక్టులతో బిజీగా ఉండటం వల్ల రాబిన్‌హుడ్ కు డేట్స్ అడ్జస్ట్ చేయలేకపోయిందని, అందుకే ఈ ప్రాజెక్టులోకి శ్రీలీల వచ్చిందని, రాబిన్‌హుడ్ శ్రీలీల కెరీర్లో గుర్తుండిపోయే సినిమా అవుతుందని డైరెక్టర్ వెంకీ కుడుముల తెలిపారు.

## కమ్ముల - నాని.. ప్లాన్ ఏమిటంటే..

నేచురల్ స్టార్ నాని ఇటీవల చాలా బిజీగా కనిపించాడు. ది.ప్యారడైజ్ ప్రీ ప్రొడక్షన్ పనులు కోర్ట్ సినిమా రిలీజ్ అలాగే మెగాస్టార్ న్యూ ప్రాజెక్టు స్టార్ట్ అవ్వడం వంటి పనుల్లో తీరిక లేకుండా కనిపించాడు. అలాగే 'హిట్ 3' షూటింగ్‌ను పూర్తిచేసిన నాని, మే 1న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాపై త్వరలో ప్రమోషన్లు ప్రారంభించబోతున్నాడు. అందుకే ప్రస్తుతం స్వల్ప విరామంలో ఉన్నాడు. ఇదిలా ఉండగా, నాని శేఖర్ కమ్ముల కాంబినేషన్ లో ఓ ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్న సంగతి సినీవర్గాలకు తెలిసిందే. గత కొంతకాలంగా ఈ కాంబోపై వార్తలు వస్తున్నప్పటికీ, ప్రాజెక్ట్ మొదలయ్యే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ఇప్పుడు అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాకు ఇంకా టైమ్ పట్టేలా కనిపిస్తోంది. ఇప్పటికే శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున కలిసి నటిస్తున్న 'కుబేర' సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. జూన్‌లో ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా పూర్తైన తరువాతే శేఖర్ కమ్ముల నాని సినిమా స్క్రిప్ట్ పనులు స్పీడ్ పట్టనున్నాయి. చాలా రోజుల క్రితమే నాని, శేఖర్ చెప్పిన ఓ సెన్సిబుల్ కథకు ఓకే చెప్పినప్పటికీ, స్క్రిప్ట్ ఫైన్‌ట్యూనింగ్‌కు ఇంకా టైమ్ కావలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో, నాని శేఖర్ కమ్ముల సినిమా 2026కి పోస్ట్‌పోన్ అయినట్లు తెలుస్తోంది. మరోవైపు నానికి ఇప్పటికే 2026కి సంబంధించి రెండు ప్రాజెక్టులు లైన్లో ఉన్నాయి. దీంతో శేఖర్ కమ్ముల ప్రాజెక్ట్ కోసం ఒకేసారి ఎక్కువ డేట్స్ ఇవ్వడం కష్టమని, ప్రతినెలా పదిరోజుల చొప్పున డేట్స్ కేటాయించనున్నట్లు తెలుస్తోంది. అంటే ఈ సినిమా షూటింగ్ కు టైమ్ పట్టే అవకాశం ఉంది. అయినా, ఈ కాంబోపై ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ దృష్టిలో పెట్టుకొని, ఎలాంటి పద్ధతిలోనైనా సినిమా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాను ఆసియన్ సునీల్ నిర్మించబోతున్నాడు. 'లవ్ స్టోరీ', 'ఫిదా' తరహాలో శేఖర్ కమ్ముల తన స్టైల్ లో తీసే సెన్సిబుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందనుంది. అందుకే నిర్మాణంలో ఖర్చుకు వెనుకాడకుండా మంచి రిచ్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో సినిమా తెరకెక్కించాలనే ఉద్దేశంతో ఉన్నారని సమాచారం. నిజానికి ఈ కాంబినేషన్ చాలా రోజులుగా ఎదురుచూ స్తున్నది. ఓ వైపు నాని నేచురల్ పర్ఫామెన్స్‌కు ముద్ర వేసిన నటుడైతే, మరోవైపు శేఖర్ కమ్ముల తనదైన కథానాయక స్టైల్ లో నెమ్మదిగా కథల్ని చెప్పే దర్శకుడు. ఇద్దరి కలయికలో ఏదైనా స్పెషల్ కథ వస్తుందన్న నమ్మకం అభిమానుల్లో ఉంది. ఇదిలా ఉండగా, నాని ప్రస్తుతం 'ద ప్యారడైజ్' సినిమా షూటింగ్‌ను ప్రారంభించబోతున్నాడు. 'దసరా' డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా, ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. దాని తర్వాత నాని - సుజీత్ కాంబినేషన్‌లో మరో ప్రాజెక్ట్ ఉండబోతోంది.



## దేవుడు చూపిన దారిలో నడుస్తున్నా : సినీ నటుడు సుమన్



**అమరావతి :** సినిమా బ్యాక్ గ్రౌండ్ లేని తనకు తల్లిదండ్రుల పుణ్యం, వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు, ఆయన చూపిన దారిలో విజయవంతంగా నడుస్తున్నానని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. సోమవారం తిరుమల శ్రీవారిని వీఐపీ ప్రారంభ విరామ గర్భాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. గతంలో ఏం జరిగిందన్నది మరిచిపోయి అందరూ ఆరోగ్యంగా ఉండాలని , అందరికీ మేలు జరిగే కార్యక్రమాలు జరుగాలని దేవుణ్ణి ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను ఇతర భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్నానని పేర్కొన్నారు. తెలుగు, కన్నడ, మలయాళం, ఒరియా సినిమాల్లో నటిస్తున్నట్లు వెల్లడించారు. అన్నమయ్యలో వేంకటేశ్వరస్వామి, శ్రీ రామదాసులో రాముడిగా, సత్యనారాయణస్వామి సినిమాలో దేవుడి పాత్ర చేశానని వివరించారు. తాను కోరుకున్న దాని కంటే ఎక్కువగా దేవుడు తనకు ఇచ్చాడని స్పష్టం చేశారు.

## చిక్కుల్లో మాజీ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్.. జాత్యహంకార వ్యాఖ్యలు చేశాడంటూ సోషల్ మీడియాలో దుమారం..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 అట్టహాసంగా మొదలైంది. టీ20 క్రికెట్ సమరం మొదలైన కొద్దిగంటల్లోనే వివాదంలో చిక్కుకున్నది. ఐపీఎల్ కామెంటరీ ప్యానెల్‌లో సభ్యుడిగా భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ చుట్టూ వివాదాలు అలుముకున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్ సందర్భంగా భజ్జీ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. జోఫ్రా ఆర్చర్‌పై హర్భజన్ సింగ్ జాత్యహంకార వ్యాఖ్యలు చేసినట్లుగా పలువురు ఆరోపించారు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లో కామెంటరీ చెబుతూ.. ఇంగ్లాండ్, రాజస్థాన్ రాయల్స్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ వివరిస్తూ.. 'బ్లాక్ టాక్సీ' అనే పదాన్ని ఉపయోగించాడు. ఈ కామెంట్స్‌పై అభిమానులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుర్పించారు. హర్భజన్ క్రికెట్ ఆడుతున్న సమయంలోనూ జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొన్నాడు. తాజాగా మరోసారి హర్భజన్ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. మ్యాచ్ సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన ఆర్చర్ 76 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్‌ను తీయలేకపోయాడు. ఐపీఎల్ హిస్టరీలో అత్యధిక పరుగులు సమర్పించిన బౌలర్‌గా చెత్త రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్ సమయంలో కామెంటేటర్‌గా ఉన్న హర్భజన్ సింగ్ .. 'లండన్‌లో నల్ల ట్యాక్సీల మీటర్ చాలా వేగంగా తిరుగుతుంది. ఇక్కడ ఆర్చర్ మీటర్ కూడా అలాగే ఉంది' అంటూ వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా పలువురు నెటిజన్స్ మండిపడుతున్నారు.

## నీ ప్రేమలో ఉంటే గాల్లో తేలినట్లుంది.. ట్రంప్ మాజీ కోడలితో టైగర్ వుడ్స్ డేటింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** గోల్ఫ్ సూపర్‌స్టార్ టైగర్ వుడ్స్ షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ కోడలు వెనెసా ట్రంప్‌తో తాను రిలేషన్‌లో ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. 'నీ ప్రేమలో ఉంటే గాల్లో తేలినట్లుంది..' అంటూ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు వెనెసాతో సన్నిహితంగా ఉన్న ఫొటోలను షేర్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. వెనెసా సైతం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో టైగర్ వుడ్స్‌తో కలిసి దిగిన ఫొటోను షేర్ చేస్తూ తమ బంధాన్ని ధ్రువీకరించారు. %కాగా, ట్రంప్ కుమారుడైన డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌తో 2005 నవంబర్ 12న వెనెసా వివాహం జరిగింది. ఫ్లోరిడాలోని ట్రంప్ ఎస్టేట్ మార్ ఎ లాగో క్లబ్‌లో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. వీరికి ఐదుగురు పిల్లలు ఉన్నారు. అయితే, ఇద్దరి మధ్యా మనస్పర్థలు రావడంతో 2018లో విడాకులు తీసుకున్నారు. అనంతరం ట్రంప్ జూనియర్‌కు 2020లో ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరిగింది. ఇక టైగర్ వుడ్స్ గతంలో స్వీడిష్ మోడల్ ఎలిన్ నార్డెగ్రెన్‌ను వివాహం చేసుకున్నాడు. అయితే, 15 సార్లు మేజర్ ఛాంపియన్‌గా నిలిచిన ఈ గోల్ఫర్ పలువురి మహిళలతో వివాహేతర సంబంధాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో 2010లో ఎలిన్ విడాకులు తీసుకుంది. ఈ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఆ మెసేజ్ ఏంటో చెప్పను.. కోహ్లీకి పంపిన సందేశం గురించి ధోనీ ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ తో ఉన్న అనుబంధం గురించి తెలిసిందే. ముఖ్యంగా మూడేళ్ల క్రితం స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఫామ్ కోల్పోయి తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. ఆ సమయంలో కెప్టెన్సీని కూడా వదిలేశాడు. ఆ సమయంలో ధోనీ తనకు ఇచ్చిన మద్దతు గురించి కోహ్లీ బహిరంగంగానే మాట్లాడాడు. ఆ సమయంలో ధోనీ ఒక్కడే తనకు మెసేజ్ చేశాడని కోహ్లీ వెల్లడించాడు. ఆ మెసేజ్ గురించి తాజాగా ధోనీకి ఓ ప్రశ్న ఎదురైంది. కోహ్లీకి పంపించిన ఆ మెసేజ్ ఎంటని ధోనీని ప్రశ్నించగా.. తాను చెప్పనని ధోనీ సమాధానం చెప్పాడు. లి అది నమ్మకానికి సంబంధించింది. ఆ మెసేజ్ ఏంటనేది నేను మాట్లాడలేను. కానీ, మా అనుబంధం గురించి మాట్లాడతా. చాలా మంది క్రికెటర్లు తమ మనసులోని మాటలను నాతో పంచుకుంటుంటారు. నేను బయటకు చెప్పనని వారికి నమ్మకం. నేను వాటిని ప్రైవేట్‌గానే ఉంచుతాను లి అని ధోనీ చెప్పాడు. అలాగే కోహ్లీ గురించి కూడా ధోనీ మాట్లాడాడు. కోహ్లీతో తన స్నేహం ఎప్పటికీ పదిలంగా ఉంటుందని చెప్పాడు. విరాట్ కోహ్లీ కేవలం 40, 50 పరుగులు చేస్తే చాలనుకుని సంతృప్తి చెందే మనిషి కాదని, సెంచరీ చేయడంతో పాటు చివరి వరకు క్రీజులో ఉండాలనే వ్యక్తి అని ధోనీ చెప్పాడు. బ్యాటింగ్‌లో చాలా మెరుగయ్యాడని, ఫిట్‌నెస్ విషయంలో కూడా స్ట్రిక్ట్‌గా ఉంటాడని పేర్కొన్నాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**